అనుదినం... జనస్వరం


నవతెలంగాణ

www.navatelangana.com

14 పేజీలు | వెల : 6.50
సంపుటి : 10 | సంచిక : 103

శనివారం 13-4-2024 | సమగ్ర తెలుగు దినపత్రిక

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar





మాకినేనికి నివాళులు అర్పిస్తున్న బి వి రాఘవులు, ఎస్ వీరయ్య,నంద్యాల తదితరులు...

మార్గదర్శి మాకినేని

ఆయన రచనలు సైద్ధాంతిక ఆయుధాలు

కష్టజీవుల కర్తవ్యబోధకుడు... కమ్యూనిస్టుల మార్గనిర్దేశకుడు
చీకటికి చిరునవ్వులు అద్దినవాడు...
వేకువకు మెరుగులు దిద్దినవాడు
ఆకలికి యుద్ధం నేర్పినవాడు...
తూర్పును మార్పుకు నడిపినవాడు
అధ్యయనం ఆచరణల అచ్చమైన రూపమతడు
విముక్తి పోరాటంలో అరుణారుణ పతాకమతడు

ఎర్రెర్రని ఉత్తేజం

- వాటి స్ఫూర్తితో ముందుకు సాగాలి
- ఎన్నికల్లో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు
- హైదరాబాద్‌లో ఎంబీ వర్ధంతి కార్యక్రమం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మార్క్సిస్టు పార్టీ నేత మాకినేని బసవపున్నయ్య (ఎంబీ) బహుముఖ ప్రజ్ఞాశాలి అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. పార్టీ ఎత్తుగడలను రూపొందించడంలో, సైద్ధాంతిక అవగాహనను పెంపొందించడంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారని తెలిపారు. ఎంబీ 32వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో నిర్వహించారు. బసవపున్నయ్య చిత్రపటానికి రాఘవులు పూలమాలవేసి నివాళులర్పించారు. 'జోహార్ మాకినేని, సాధిస్తాం మాకినేని ఆశయాలు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ పార్టీ ఎత్తుగడలకు సంబంధించి ఆయన రచనలను అధ్యయనం చేయాలని సూచించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుసరిస్తున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం ...13లో

ఉపేక్షించేదే లేదు



రైతులను మోసం చేస్తే మిల్లర్ల లైసెన్సులు రద్దు

- ధాన్యం కొనుగోళ్లలో కుంటి సాకులు చెబితే సీఎంఆర్ కట్
- తాగునీటి కోసం కర్ణాటక సర్కార్‌తో సంప్రదింపులు
- సాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నీటి తరలింపునకు ఏర్పాట్లు
- ఉద్దేశపూర్వకంగా సరఫరాను ఆపితే కఠిన చర్యలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"ధాన్యం కొనుగోళ్లలో రైతులను మోసం చేస్తే మిల్లర్లు, ట్రేడర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తాం. కుంటి సాకులు చెప్పి అవకతవకలకు పాల్పడే మిల్లులకు కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) నిలిపి వేయడంతో పాటు వాటిని బ్లాక్ లిస్టులో పెడుతాం. ప్రభుత్వ మార్గదర్శకాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు, తాగునీటి సరఫరాపై మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు.

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో అక్రమాలకు తావు లేకుండా సంబంధిత విభాగాల అధికారులు జిల్లాలకు వెళ్లి క్షేత్ర స్థాయిలో చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు. కొన్ని చోట్ల తేమ ఎక్కువగా ఉందని చెప్పి వ్యాపారులు, మిల్లర్లు ధరలో కోత పెడుతున్నారనే విషయం తమ దష్టికి వచ్చిందనీ, అందువల్ల ధాన్యాన్ని మార్కెట్లకు తెచ్చే ముందు ఆరబెట్టాలని సీఎం రైతులకు విజ్ఞప్తి చేశారు. కళ్లాల నుంచి నేరుగా వడ్లను మార్కెట్లకు తరలించకుండా ఒకట్రెండు రోజులు ధాన్యాన్ని ఆరబెట్టి మంచి రేటు పొందాలని వారికి సూచించారు. ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు మార్కెట్ యార్డుల్లో తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు సీసీ కెమెరాలు అమర్చి వడ్ల దొంగతనం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు ఏరోజుకారోజు మార్కెట్లలో జరుగుతున్న కొనుగోళ్లపై మానిటరింగ్ చేయడంతో పాటు రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా కోసం ఉమ్మడి జిల్లాలకు నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారులే ధాన్యం కొనుగోళ్లను కూడా పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. వడగండ్ల వానలు వచ్చినా ఇబ్బంది లేకుండా అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కొన్ని చోట్ల రాజకీయ లబ్ది కోసం ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు తప్పుడు ఫిర్యాదులు, మీడియాలో ఉద్దేశపూర్వక కథనాలు వస్తున్నాయని అధికారులను అప్రమత్తం చేశారు. అలాంటి చర్యలకు పాల్పడే వారిపై వెంటనే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని ఆదేశించారు.

తాగునీటి సమస్యపై...

రాష్ట్రంలో తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న ఎండల దష్ట్యా రాబోయే రెండు నెలలు మరింత కీలకమని చెప్పారు. గతేడాదితో పోలిస్తే ఎక్కువ నీటిని సరఫరా ...13లో

ముందస్తుగానే రుతుపవనాలు !

- జూన్-ఆగస్టు నాటికి లానినా పరిస్థితులు
- విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం
- ప్రకటించిన భారత వాతావరణ శాఖ

వివరాలు 13లో

నీటి కేటాయింపులు

తెలంగాణకు 8.5, ఏపీకి 5.5 టీఎంసీలు

- కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ నిర్ణయం
- వచ్చే నెలలో మరోసారి భేటీ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

వేసవికాలం నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నెలకొన్న తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) కీలక నిర్ణయం తీసుకుంది. నాగార్జునసాగర్ జలాశయంలో 500 అడుగులపై ఉన్న 14 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాల కోసం పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలంటూ కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సూచించింది. అందుబాటులో ఉన్న 14 టీఎంసీల్లో తెలంగాణకు 8.5 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 5.5 టీఎంసీల నీటిని కేటాయించింది. కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి డీఎం రాయిపురే నేతృత్వంలో త్రిసభ్య కమిటీ, హైదరాబాద్ జలసౌధలో జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో తెలంగాణ ఈఎన్సీ అనిల్‌కుమార్, ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి పాల్గొన్నారు. దాదాపు రెండు గంటలపాటు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాగర్ జలాశయంలో అందుబాటులో ఉన్న నీరు, తెలుగు రాష్ట్రాల్లోని నీటిఎద్దడి తదితర అంశాలపై త్రిసభ్య కమిటీ చర్చించింది.

జంట జలాశయాలైన శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో కొద్దిపాటి నీరు ఉన్న నేపథ్యంలో జూన్ వరకు జాగ్రత్తగా తాగునీటి అవసరాల కోసం వాడుకునే విషయమై సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది అక్టోబరులో తీసుకున్న నిర్ణయాలు, ప్రస్తుత అవసరాలపై దీర్ఘంగా చర్చించారు. అప్పట్లో ఏపీకి 45, తెలంగాణకు 35 టీఎంసీలు కేటాయించగా, అందులో తమకు మరో 5 టీఎంసీలు మిగులు ఉందనీ, తెలంగాణ అదనంగా 7 టీఎంసీలు వినియోగించుకున్నదని ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి అభిప్రాయపడ్డారు. సాగర్ నుంచి వెంటనే తమకు ఆ 5 టీఎంసీల నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇందుకు తెలంగాణ సాగునీటి శాఖ అధికారులు స్పందించారు. కృష్ణా జలాల్లో ఏపీ ఎక్కువ మొత్తాన్నే వినియోగించుకుందనీ, అంతా లెక్కలోకి రాలేదని తెలంగాణ ఈఎన్సీ అనిల్‌కుమార్ అన్నారు. ఏపీ వాదనతో విభేదించారు. శ్రీశైలం నుంచి ఏపీ ఎలాంటి అవసరాలకైనా నీరు తీసుకోకుండా చూడాలని కోరారు. సాగర్ దిగువన తమకు తాగునీటికి చాలా ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయనీ, ట్యాంకర్లతో నీరు సరఫరా చేయాల్సి వస్తున్నదని ఏపీ ఈఎన్సీ తెలిపారు. హైదరాబాద్‌తోపాటు నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల పరిధిలో ఎక్కువ మంది తాగునీటి కోసం సాగర్‌పై ఆధారపడ్డారని తెలంగాణ ఈఎన్సీ ...13లో



నిరుద్యోగ సమస్యే కీలకం...

ఎన్నికల్లో ఇదే ప్రధానాంశం

- 'సీఎస్‌డీఎస్-లోక్‌నీతి' సర్వేలో వెల్లడి
- గత ఐదేండ్లలో అవినీతి పెరిగిపోయిందన్న 55 శాతం మంది
- లోక్‌సభ ఎన్నికలు మోడీ సర్కారుకు కష్టమే
- రాజకీయ విశ్లేషకుల అంచనా

న్యూఢిల్లీ : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో దేశంలోని నిరుద్యోగుల నుంచి బీజేపీకి గట్టి ఎదురుదెబ్బే తగిలే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి మోడీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు కేంద్రంలో ఏర్పడింది. అయితే, పదేండ్లు పాలించినా మోడీ మాత్రం ఆ హామీని నిలబెట్టుకోలేదు. ఫలితంగా దేశంలో ఏటికేడు నిరుద్యోగం తారా స్థాయికి చేరింది. ఇటీవల అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్‌ఓ) వంటి అంతర్జాతీయ నివేదికలూ ఇదే విషయాన్ని వెల్లడించాయి. అలాగే, సీఎస్‌డీఎస్-లోక్‌నీతి నిర్వహించిన సర్వేలోనూ నిరుద్యోగం అనే అంశమే కీలకమని తేలింది. ఈ సమస్యనే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని ఉక్కిరిబిక్కిరి చేయనున్నట్టు తెలుస్తున్నది.

లోక్‌సభ ఎన్నికలకు నిరుద్యోగంతో పాటు ధరల పెరుగుదల, అభివృద్ధి అంశాలు కూడా పని చేయనున్నట్టు ప్రజల అభిప్రాయాలను బట్టి ఈ సర్వే వివరించింది. వీటిలో నిరుద్యోగం, ధరల పెరుగుదల కాషాయపార్టీకి తలనొప్పులు తెచ్చిపెట్టగలవని విశ్లేషకులు చెప్తున్నారు. దేశంలో నిరుద్యోగం ఏటికేడు తీవ్రమైంది. ఇది భారత్‌లోని గణనీయమైన యువ జనాభాను ప్రభావితం చేస్తుందని ఇటీవల ఐఎల్‌ఓ నివేదిక వివరించిన విషయం విదితమే. 2022లో మొత్తం నిరుద్యోగ జనాభాలో యువత వాటా 82.9 శాతం అని కూడా ...13లో

> దేశంలో అభివృద్ధి విషయంలో మోడీ గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ.. ప్రజల్లో మాత్రం ఆ భావన కనిపించటం లేదు. గత ఐదేండ్లలో 'ధనవంతుల కోసమే' అభివృద్ధి జరిగిందని 32 శాతం మంది ఓటర్లు భావిస్తున్నారని ప్రీ-పోల్ సర్వేలో తేలిందని సర్వే నివేదిక పేర్కొన్నది. కేవలం 8 శాతం మంది మాత్రమే దేశంలో అవినీతిని, అయోధ్యలోని రామ మందిరాన్ని తమ స్వంత ప్రధాన అంశాలుగా చెప్పారని నివేదిక పేర్కొన్నది. అయితే, గత ఐదేండ్ల మోడీ పాలనలో అవినీతి పెరిగిపోయిందనే భావన మెజారిటీ ఓటర్లలో కనిపిస్తున్నది. ఈ సర్వేలో 55 శాతం మంది ఇదే అభిప్రాయాన్ని తెలిపినట్టు అధ్యయనం వివరించింది. కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) హామీపై రైతుల నిరసనలు వంటి అంశాలు ఈ సర్వేలో ప్రతిధ్వనించటం గమనార్హం.



బ్లాక్‌మెయిల్‌తో రేవంత్‌రెడ్డి కొత్త నాటకం

- గ్యారెంటీలను పార్లమెంట్ ఎన్నికలతో ముడిపెట్టడం సరికాదు
- ఎంపీ అభ్యర్థులను మార్చం
- మజ్లిస్‌ను గెలిపించేందుకు కాంగ్రెస్ తాపత్రయం
- హామీల అమలులో ప్రభుత్వం విఫలం : ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

13లో..

భువనగిరి కోటపై ఎర్ర జెండా ఎగరాలి

- భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తున్న బీజేపీని.. పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించండి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

3లో..



సీబీఐ కస్టడీకి కవిత



- 15న హాజరుపర్చాలి
- రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశం
- కేసే తప్పయితే ... చెప్పేదేముంది : కవిత

వివరాలు 13లో

డెడ్ స్టోరేజీకి నాగార్జునసాగర్ ప్రాజెక్టు

ప్రస్తుత జలాశయం నీటిమట్టం 510.30 అడుగులు

- హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాపై తీవ్రప్రభావం
- ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకూ పొంచివున్న ముప్పు



ఆందోళన వ్యక్తం చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-నాగార్జునసాగర్

రెండు తెలుగు రాష్ట్రాల్లోని వేలాది గ్రామాలకు సాగు, తాగునీటిని అందిస్తున్న నాగార్జున సాగర్ జలాశయం ప్రమాదకర స్థితికి చేరింది. గతేడాది అనుకున్న స్థాయిలో కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో నాగార్జునసాగర్ జలాశయం కనిష్ట నీటిమట్టానికి చేరువలో ఉంది. ఆయకట్టు కింద ఖరీఫ్, రబీ సీజన్‌లో ప్రభుత్వం క్రాఫ్ హాలిడే ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు వేసవి కాలం కావడంతో కృష్ణా జలాలపై ఆధారపడిన హైదరాబాద్ జంట నగరాలు, ఖమ్మం, ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లో మంచినీటి ఎద్దడి తీవ్రమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, ప్రాజెక్టు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ నెల 1వ తేదీ నుండి వారం రోజుల పాటు తాగునీటి అవసరాల కోసం ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసింది. మరోవైపు ఒప్పందం ప్రకారం ఆంధ్ర రాష్ట్రానికి తాగునీటి అవసరాలకు ఐదు టీఎంసీల నీటిని కుడి కాలువ ద్వారా విడుదల చేస్తున్నది. సాగర్ జలాశయం డెడ్ స్టోరేజీకి చేరువలో ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్ అవసరాలకు శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకునే అవకాశం కూడా లేదు. ఇప్పటికే శ్రీశైలం అడుగంటి పోయింది. ఈ లోపల వర్షాలు పడకుంటే రాబోయే మూడు నెలల పాటు తాగునీటి అవసరాలు ఎలా తీర్చాలనే దానిపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

హైదరాబాద్ తాగునీటి సరఫరాపై తీవ్రప్రభావం

నాగార్జునసాగర్ జలాశయం శుక్రవారం సాయంత్రానికి కనిష్ట నీటిమట్టానికి చేరువలో ఉంది. సాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590.5050 అడుగులు కాగా కనిష్ట నీటిమట్టం 510 అడుగులు. ప్రస్తుతం జలాశయం ...13లో

గృహజ్యోతి దరఖాస్తులను నిలిపేయడమేంటి ? : రచనారెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గృహజ్యోతి దరఖాస్తులను నిలిపేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందనీ, అసలు గృహలక్ష్మి ఎప్పుడు ప్రారంభించారు? ఎప్పుడు దరఖాస్తులు ముగించారు? ఎన్ని దరఖాస్తులొచ్చాయి? అప్పుడే నిలిపేయడమేంటి? ఎన్నికల కోడ్‌కు, ఆ పథకం ఆపేయడానికి కారణమేంటి? పాత పథకాలకు ఎన్నికల కోడ్‌తో సంబంధం లేదనే విషయం తెలియదా? అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రచనారెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. పథకాలు, హామీల గురించి ప్రజలు ప్రశ్నిస్తుంటే కేంద్రం పైసలివ్వలేదనీ, బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల్లో ముంచిపోయిందని దాటేయడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణలో వేల మంది విద్యార్థులకు అన్యాయం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో రూ.5 వేల కోట్ల నిధులను ఎక్కడ నుంచి తీసుకొస్తుందని ప్రశ్నించారు. 15వేల కంటే తక్కువే అపాయింట్ మెంట్ ఆర్డర్లు ఇచ్చి,

30వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం దుర్మార్గమన్నారు. అవన్నీ పాత ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్లే అని చెప్పారు. ప్రజల దృష్టి మరల్చేందుకే ఫోన్ ట్యాపింగ్‌ను తెరపైకి తెచ్చారని విమర్శించారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడంపై కాకుండా పరిపాలనపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టి పెట్టాలని సూచించారు.

కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం : ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో తమ పార్టీని నిలువరించేందుకు కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 17 సీట్లను కాంగ్రెస్ 10, బీఆర్ఎస్ ఆరు, ఎంఐఎం ఒకటి చొప్పున పంచుకున్నట్టు స్పష్టంగా కనబడుతోందన్నారు. అందుకే ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులు ప్రచారంలో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. తెలంగాణలో రాహుల్ గాంధీ పర్యటన, లిక్కర్ కేసులో కవిత అరెస్టు, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి వెలుగులోకి రావడం, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో అనేక మంది పెద్దల హస్తం ఉందని వార్తలు బయటకు వచ్చిన తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో అనేక మార్పులు సంభవించాయన్నారు. చాలా రాష్ట్రాల్లో సీపీఎం, సీపీఐ వంటి కమ్యూనిస్టు పార్టీలు ఇండియా కూటమిలో ఉన్నాయనీ, తెలంగాణలో మాత్రం ఆ కూటమిలో ఏ పార్టీలున్నాయో అర్థం కాని పరిస్థితి ఉందని విమర్శించారు. పార్టీ ఫిరాయించిన శాసనసభ్యుల సీట్లను డిస్ క్వాలిఫై చేయాలని స్పీకర్ ను కలుస్తామంటే టైం ఇవ్వడం లేదని బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

వయోపరిమితి వార్తల్లో నిజంలేదు

- రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగుల వయోపరిమితికి 61 ఏండ్లు లేదా 33 ఏండ్ల సర్వీసును ప్రాతిపదికగా తీసుకుంటారంటూ వివిధ పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజంలేదని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ స్థాయిలో ఏవిధమైన ప్రతిపాదన కానీ, ఫైల్ నిర్వహణ కానీ లేదని స్పష్టం చేశారు. ఈ విధమైన ఊహాజనిత వార్తలు రాయడం సరైంది కాదని తెలిపారు.

ఏపీ ఇంటర్ ఫలితాల్లో శ్రీగోసలైట్స్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏపీ ఇంటర్ ఫలితాల్లో శ్రీగోసలైట్స్ జూనియర్ కాలేజీకి చెందిన బైపీసీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ మేరకు ఆ సంస్థ చైర్మెన్ నరేంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఆలూరు కిరణ్మయి 990 మార్కులు సాధించి రాష్ట్రంలో రెండో టాపర్‌గా నిలిచారని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఇంజమూరి హరిచందన 435 మార్కులతో రాష్ట్రంలో రెండో టాపర్‌గా ఉన్నారని పేర్కొన్నారు. తమ విద్యాసంస్థలో చదివిన విద్యార్థులందరూ మంచి ఫలితాలను సాధించారని వివరించారు. ఇంటర్ ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

ఉద్యోగుల వయోపరిమితిపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలి : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగుల వయోపరిమితి వయస్సు 61 ఏండ్లు లేదా 33 ఏండ్ల సర్వీసు అంటూ వస్తున్న వార్తలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 61 ఏండ్లు నిండినా లేదా 33 ఏండ్ల సర్వీసు పూర్తయినా ఉద్యోగ విరమణ చేయాలంటూ ప్రభుత్వం నిర్ణయించినట్టుగా కొన్ని పత్రికలు, టీవీ ఛానెళ్లలో వార్తలు వైరలవుతున్నాయని తెలిపారు. ఈ వార్తపై సాధారణ పరిపాలన శాఖ, ఆర్థిక శాఖ అధికారులను సంప్రదించగా తమకు తెలియదంటూ సమాధానమిస్తున్నారని పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సందర్భంలో విధానపరమైన నిర్ణయాలు తీసుకునే అధికారం మంత్రివర్గానికిగానీ, అధికారులకుగానీ లేదంటూ పలువురు చెప్తున్నారని వివరించారు. ఇలాంటి గాలి వార్తలను ప్రచారంలో పెట్టి ఉద్యోగులను గందరగోళంలోకి నెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఎవరైనా ప్రయత్నిస్తున్నారేమోననే సందేహం కలుగుతున్నదని తెలిపారు. నిజంగానే అలాంటి ఆలోచన ప్రభుత్వానికి ఉంటే దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. సర్వీసును 33 ఏండ్లకు పరిమితం చేయడం సమంజసం కాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై వెంటనే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇజ్రాయిల్, ఇరాన్‌లకు ప్రయాణం వద్దు : పౌరులకు కేంద్ర విదేశాంగ శాఖ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : ఇజ్రాయిల్, ఇరాన్‌లలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా మళ్లీ నోటీసులు జారీ చేసేవరకూ ఆయా దేశాలకు ప్రయాణం చేయవద్దని పౌరులకు కేంద్ర విదేశాంగ శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఒక అత్యవసర సర్క్యులర్‌ను శుక్రవారం విడుదల చేసింది. 'ఈ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా తదుపరి నోటీసు విడుదల చేసేవరకూ భారతీయులందరూ ఇజ్రాయిల్, ఇరాన్‌కు వెళ్లవద్దని సూచిస్తున్నాం' అని విదేశాంగ శాఖ తెలిపింది. ప్రస్తుతం ఇజ్రాయిల్, ఇరాన్‌లో నివసిస్తున్న భారతీయులు అక్కడ రాయబార కార్యాలయాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

ఇదేనా వికసిత భారతం?

పోషకాహార లోపంతో చిన్నారుల కుంగుబాటు

మహిళలు, పిల్లల్లో పెరుగుతున్న రక్తహీనత

ఆకలితో అల్లాడుతున్న శిశువులు

బాలల బువ్వ కూడా కాషాయీకరణే

ఆహార సబ్సిడీలలో కోత

మోడీ పాలనా వైఫల్యాలను ఎండగట్టిన 'రిపోర్ట్ కార్డ్'

న్యూఢిల్లీ : దేశంలోని 81 కోట్ల మంది పేదలకు ఉచిత రేషన్ అందజేయడం ప్రపంచంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు గౌరవప్రదమా లేక మాయని మచ్చా? 2023వ సంవత్సరపు అంతర్జాతీయ ఆకలి సూచికలో భారత్ 111వ స్థానంలో (మొత్తం 125 దేశాలలో) ఎందుకు ఉంది? దేశంలోని 32శాతం మంది చిన్నారులు ఎందుకు బరువు పెరగడం లేదు?. పౌర సమాజ సంస్థలు, సంఘాలు, ప్రజా ఉద్యమాలు, పౌరులతో కూడిన ఫైనాన్షియల్ అకౌంటబులిటీ నెట్‌వర్క్ ఇండియా (ఫ్యాన్ ఇండియా) విడుదల చేసిన 'ఆహార భద్రత, పౌష్టికాహార నివేదిక కార్డు 2014-2024'ను విశ్లేషించిన వారిలో ఈ ప్రశ్నలు ఉదయించక మానవు. గత పది సంవత్సరాల పాలనలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు, చెప్పుకున్న గొప్పలను ఈ నివేదికలో ప్రస్తావించారు.ప్రభుత్వ పత్రాలు, ప్రకటనలను పరిశీలించిన తర్వాతే నివేదిక కార్డును తయారు చేశారు. 2014 ఎన్నికల సమయంలో బీజేపీ విడుదల చేసిన మ్యానిఫెస్టోలోని అంశాలను ఇందులో ఉదహరించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామంటూ అందులో బీజేపీ హామీలు గుప్పించింది. కానీ పది సంవత్సరాల మోడీ పాలనలో మనకు కన్పిస్తున్న వాస్తవాలేమిటి?

పోషకాహార లోపం...రక్తహీనత


జాతీయ కుటుంబ ఆరోగ్య సంస్థ (ఎన్‌హెచ్‌ఎఫ్‌ఎస్) అందజేసిన తాజా నివేదిక ప్రకారం మన దేశంలో ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న చిన్నారుల్లో 36శాతం మందిలో వయసుకు తగిన విధంగా ఎదుగుదల లేదు. పోషకాహార లోపమే దీనికి కారణమని నివేదిక స్పష్టం చేసింది. ఆ వయసున్న పిల్లల్లో మరో 32శాతం మందికి తగినంత బరువు లేదు. 2018లో కేంద్రం 'అనీమియా ముక్త్ భారత్' అనే కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే ఇలాంటి కార్యక్రమాలు, పథకాలు ఎన్ని ప్రవేశపెట్టినా మహిళల్లో రక్తహీనత సమస్య అలాగే ఉండిపోతోంది. 2015-16లో 15-49 సంవత్సరాల మధ్య వయసున్న మహిళల్లో 53శాతం మంది రక్తహీనతతో బాధపడగా 2019-20లో అది 57.2శాతానికి పెరిగింది. వాస్తవానికి 67శాతం మంది చిన్నారుల్లో ఏదో ఒక విధమైన రక్తహీనత (హిమోగ్లోబిన్ స్థాయి 11 కంటే తక్కువ) కన్పిస్తోంది. మోడీ హయాంలో 2015-16, 2019-21 మధ్యకాలంలో 6-59 నెలల మధ్య వయస్కులైన చిన్నారుల్లో రక్తహీనత 59శాతం నుంచి 67శాతానికి పెరిగింది. మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌ను 2014 ఎన్నికల ప్రచారంలో 'మోడల్ రాష్ట్రం'గా పొగిడేశారు. అయితే ఆ రాష్ట్రంలో 6-59 నెలల మధ్య వయసున్న చిన్నారుల్లో రక్తహీనత అత్యధికంగా 80శాతం ఉండడం గమనార్హం. గుజరాత్‌లోని నర్మద (93.2శాతం), పంచమహల్ (91శాతం), ఆరావళి (89.5శాతం) జిల్లాల్లో బాలల్లో రక్తహీనత అధికంగా ఉన్నదని ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5 నివేదిక స్పష్టం చేసింది.

శిశువులకు అందని ఆహారం

పట్టణాలు, గ్రామాల్లో నివసిస్తున్న పేదలకు...ముఖ్యంగా ఎస్సీలు, ఎస్టీలు వంటి అట్టడుగు వర్గాల వారికి ఆహార భద్రత అనేది అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. ఎస్టీలు, ఎస్సీల్లో కుంగుబాటుతనం 40శాతం వరకూ ఉండగా ఇతర వర్గాలకు... ముఖ్యంగా హిందువులకు చెందిన చిన్నారుల్లో అది 30శాతానికి ఉందని ఫ్యాన్ - ఇండియా నివేదిక కార్డు వివరించింది. 'గడచిన 24 గంటల కాలంలో ఏ విధమైన ఆహారం లభించని' 6-23 నెలల మధ్య వయసున్న పిల్లలు మన దేశంలో అధికంగానే ఉన్నారని, ఈ విషయంలో ప్రపంచంలో భారత్ మూడో స్థానంలో ఉన్నదని నివేదిక కార్డు తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో తల్లులు, పిల్లలకు అందజేస్తున్న పోషకాహారాన్ని పెంచడానికి ఉద్దేశించిన పథకాలకు కేంద్రం నిధుల కేటాయింపు పెంచవచ్చు కదా? అసలు ప్రభుత్వం పెడుతున్న ఖర్చులో వాస్తవాలు ఏమిటి?

ఆహార సబ్సిడీలకూ అంతంతే

ప్రజా పంపిణీ వ్యవస్థ కింద ఆహార సబ్సిడీలకు జరుపుతున్న బడ్జెట్ కేటాయింపులు నానాటికీ తగ్గిపోతున్నాయి. 2023-24లో రూ.2.12 లక్షల కోట్లకు అంచనాలను సవరించగా 2024-25లో కేటాయించింది రూ.2.05 లక్షల కోట్లు మాత్రమే. ఆహార సబ్సిడీకి జరిపిన బడ్జెట్ కేటాయింపులు కూడా పది సంవత్సరాల మోడీ పాలనలో తగ్గిపోయాయి. 2014-15 బడ్జెట్‌లో 6.4శాతం కేటాయించగా 2024-25లో 4.3శాతం మాత్రమే కేటాయించారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద దేశంలోని పేదలకు ఐదు కిలోల ఆహారధాన్యాలను ఉచితంగా అందజేస్తామని జనవరిలో ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంది. దీనిని ఓ చారిత్రక నిర్ణయంగా అభివర్ణించింది. దేశంలో ఆహార, పోషకాహార భద్రతను పటిష్టవంతం చేసేందుకు ప్రధాని కట్టుబడి ఉన్నారని చెప్పడానికి ఇదో ఉదాహరణ అని కొనియాడింది. అయితే ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారం, అది చేసిన కేటాయింపులు చూస్తుంటే కథ వేరేలా ఉన్నదని అర్థమవుతుంది. దేశ భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన చిన్నారులు నీరసంతో, నిస్సత్తువగా, పేలగా, కుంగుబాటుతనంతో కన్పిస్తుంటే భారత్ వికసిస్తుందని ఎలా అనుకోగలం?



అంగన్‌వాడీలపై పని ఒత్తిడి

పిల్లలకు పోషకాహారం సరిగా అందుతోందా, వారు ఆరోగ్యంగా ఉన్నారా అనే విషయాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, పర్యవేక్షించే అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లపై పని ఒత్తిడి పెరిగిపోతోంది. ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వాలు ఉదాశీనంగా వ్యవహరిస్తున్నాయి. పనిచేస్తున్న వారికి సైతం గౌరవవేతనం, ఇతర ప్రయోజనాలు అరకొరగానే ఉంటున్నాయి. దేశంలో 70,444 అంగన్‌వాడీ వర్కర్లు, 1,23,287 హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వమే చెబుతోంది.

మధ్యాహ్న భోజనంలో గుడ్డేది?

మధ్యాహ్న భోజన పథకాన్నే తీసుకుందాం. ఇప్పుడు దీనిని పీఎం-పోషణ్ అని పిలుస్తున్నారు. దీనికి 2013-14లో 0.79శాతం నిధులు కేటాయిస్తే 2024-25లో విదిల్చింది 0.23శాతం మాత్రమే. దారుణమైన విషయమేమంటే అభం శుభం తెలియని చిన్నారులకు అందించే ఆహారాన్ని కూడా కాషాయీకరణ చేస్తున్నారు. మధ్యాహ్న భోజనంలో వారికి పోషక విలువలున్న కోడిగుడ్లు ఇవ్వడం లేదు. ఎన్‌హెచ్‌ఎఫ్‌ఎస్-4, ఎన్‌హెచ్‌ఎఫ్‌ఎస్-5 నివేదికల మధ్య కాలంలో 21 రాష్ట్రాల పిల్లల్లో కుంగుబాటుతనం పెరిగింది. ఇక ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకాన్ని చూద్దాం. ఈ పథకంలో లబ్దిదారుల సంఖ్య 2019- 20లో 96 లక్షలు ఉండగా 2021-22 నాటికి 61 లక్షలకు పడిపోయింది. అదీకాక ఈ పథకంలో చేరిన మహిళలకు జాతీయ ఆహార భద్రతా చట్టం కింద రూ.6,000 అందించాల్సి ఉండగా రూ.5,000 మాత్రమే ఇస్తున్నారు.

అనుమతి లేకుండా
తాటి, ఈత చెట్లు నరికితే చర్యలు

నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ: నవతెలంగాణలో ప్రచురితమైన 'గీత వృత్తిపై రియల్టర్ల పగ' కథనానికి సంబంధిత ఎక్సైజ్ శాఖ నుంచి స్పందన లభించింది. శుక్రవారం నాడు ప్రచురితమైన ఈ వార్తకు డిప్యూటీ కమిషనర్ (హెడ్ క్వార్టర్స్) కె. రఘురాం స్పందన తెలియజేశారు. "ఈ అంశంపై ప్రచురించబడిన వార్తను అవసరమైన చర్యల కోసం సంగారెడ్డి ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్)కు పంపాం. ఆందోల్ పరిధిలో ఏడు తాటి, ఈత చెట్లను రియల్ ఎస్టేట్ కోసం తగుల బెట్టినట్టు సంగారెడ్డి ఈఎస్ నుంచి నివేదిక అందింది. శుక్రవారం క్రిమినల్ కేసూ నమోదైంది" అని వివరించారు. సంగారెడ్డి జిల్లాలో గత మూడేండ్లలో చెట్ల అక్రమ నరికివేత కేసులు 16 నమోదయ్యాయనీ, డిపార్ట్‌మెంట్ నుంచి ముందస్తు అనుమతి లేకుండా అక్రమంగా చెట్లను నరికితే అప్రమత్తంగా ఉండి కఠిన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లాలోని అన్ని ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు.

తమకు కేటాయించిన ఇండ్లను తమకే ఇవ్వాలి

- మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం ముందు లబ్దిదారుల నిరసన

నవతెలంగాణ-మర్కుక్

తమకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను తమకే ఇవ్వాలని సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన లబ్దిదారులు మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గజ్వేల్ నియోజకవర్గంలో గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 1250 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించి, టోకెన్ల ద్వారా డ్రా తీసి లబ్దిదారులను ఎంపిక చేశారు. కాగా, ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో మల్లన్న సాగర్ నిర్వాసితులు నివాసం ఉంటున్నారు. టోకెన్ల ద్వారా ఎంపికైన లబ్దిదారులు.. తమ ఇంటిని ఖాళీ చేయాలని మల్లన్న సాగర్ నిర్వాసితులను అడగ్గా తమకు ఇంకా రావాల్సిన నష్ట పరిహారం వచ్చే వరకు తాము ఖాళీ చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. దాంతో చేసేదేమీలేక గజ్వేల్ పట్టణానికి చెందిన సుమారు 50 మంది లబ్దిదారులు.. ఆటోల్లో మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి చేరుకుని గేటు ఎదుట నిరసన చేపట్టారు. లబ్దిదారులు రోడ్డుపై బైటాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో తమకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్వాసితులకు ఇవ్వడం దారుణమన్నారు. ఇప్పుడు భూ నిర్వాసితులు ఇండ్లు ఖాళీ చేయడం లేదని, తమకు కేటాయించిన ఇండ్లు వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న మర్కుక్ ఎస్ఐ చల్ల మధుకర్ రెడ్డి నిరసనకు దిగిన వారితో మాట్లాడి, సమస్యలుంటే కలెక్టరేట్‌కు వెళ్లాలని, మీలో లబ్దిదారులైన కొంతమంది పేర్లు ఇస్తే మాజీ సీఎం కేసీఆర్‌కు అందజేస్తామని తెలపగా, లబ్దిదారులు నిరసనను విరమించుకున్నారు.

బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు

- వచ్చే నెల ఐదు నుంచి 20వరకు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వచ్చే నెల ఐదు నుంచి 20 వరకు హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్టు ఆ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు భూపతి వెంకటేశ్వర్లు, ఎన్ సోమయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎస్వీకేలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లల ఆసక్తికి తగిన విధంగా వారి ప్రతిభను గుర్తించి, మరింత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్యాంపును నిర్వహించనున్నట్టు తెలిపారు. వేసవి సెలవుల్లో.. కాలాన్ని వృథా చేయకుండా కొత్త కళలను, సరికొత్త పనిలో ప్రావీణ్యాన్ని సంపాదించేందుకు పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. ఆ ఆసక్తిని తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. చిన్నపిల్లల్లో అరుదైన ప్రతిభతో పాటు సృజన శక్తి దాగుంటుందనీ, దాన్ని గుర్తించి బయటకు తీయాలన్నారు. అందుకు తెలంగాణ బాలోత్సవ కమిటీ కృషి చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం కమిటీ సభ్యులు ఎస్.శంకర్, రేష్మ, విజిత పాల్గొన్నారు. 9490098343, 9490098676 సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భువనగిరి కోటపై ఎర్ర జెండా ఎగరాలి

నవతెలంగాణ-చండూరు



భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని, పోరాటాల అడ్డా భువనగిరి కోటపై ఎర్ర జెండా ఎగురవేయాలంటే భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. శుక్రవారం నల్లగొండ జిల్లా గట్టుప్పల మండల కేంద్రంలో ఆ పార్టీ చండూరు, గట్టుపల మండలాల విస్తృత స్థాయి సమావేశాన్ని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చాపల మారయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. మునుగోడు నియోజకవర్గ వెనుకబాటుకు కారణం గత పాలకులేనని తెలిపారు. మూసీ నదిని ప్రక్షాళన చేయాలని పాదయాత్రలు చేయడంతో పాటు సాగు, తాగునీరు కోసం పోరాటాలు నిర్వహించడంలో కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషించారన్నారు. మునుగోడు నియోజకవర్గంలో ఇండ్ల స్థలాల కోసం, కార్మికుల కోసం, గీత కార్మికుల సమస్యల కోసం, పేద ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడింది కమ్యూనిస్టులేనని తెలిపారు. ఆర్ఎస్ఎస్ ఆలోచనలకు అడ్డుగా ఉన్న భారత రాజ్యాంగాన్ని సంపూర్ణంగా మార్చి, ఆ స్థానంలో మనుధర్మాన్ని తీసుకొచ్చి ఫ్యూడల్ పద్ధతులు ప్రవేశ పెట్టడం కోసం బీజేపీ కృషి చేస్తోందని, దీని ద్వారా కుల, మత, ప్రాంత విద్వేషాలు సృష్టిస్తోందని అన్నారు. ఇప్పటికే సీఏఏ, పౌరసత్వ రద్దు, జ్యోతిష్యశాస్త్ర అమలు, విద్యా కాషాయీకరణతో పాటు ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను బెదిరించడం, వారిని లొంగదీసుకోవడం, మేధావులను జైళ్లల్లో పెట్టడం లాంటి వాటిని బలవంతంగా అమలు చేస్తుందని తెలిపారు. నోట్ల రద్దుతో నల్ల డబ్బును బయటికి తీసి దేశ ప్రజల ఖాతాల్లో ప్రతి ఒక్కరికి రూ.15 లక్షలు జమ చేస్తామని చెప్పిన బీజేపీ.. అవినీతికి చట్టబద్ధత కలిగించిందన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో రూ.1600 కోట్ల అవినీతి జరిగితే, దాంట్లో రూ.800 కోట్లు బీజేపీకి చేరాయని తెలిపారు. బాండ్స్ చట్ట విరుద్ధమైనవని సీపీఐ(ఎం) పోరాడటంతో.. సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడం వల్ల అవినీతి బయటికి వచ్చిందన్నారు. విద్యా రంగానికి బడ్జెట్ తగ్గించి (0.4శాతం) విద్యను పూర్తిగా ప్రయివేటీకరణ చేశారన్నారు. ఆకలి సూచిలో మనదేశం 111 స్థానంలో ఉందన్నారు. లిక్కర్ కేసులో బీజేపీకి అరబిందో ఫార్మా కంపెనీ అధినేత శరత్ చంద్రారెడ్డి ద్వారా రూ.60 కోట్ల ముడుపులు ముట్టాయని తెలిపారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మునుగోడు నియోజకవర్గ ప్రజలందరికీ సీపీఐ(ఎం) చేసిన పోరాటాలు తెలుసన్నారు. సీపీఐ(ఎం) పోరాటాల ఫలితంగా పేదలకు భూములు, ఇండ్ల స్థలాలు సాధించి పెట్టామన్నారు. మునుగోడు నియోజకవర్గంలో ప్రజల కోసం నిరంతరం పనిచేస్తామన్నారు. నిరంతరం నిజాయితీగా, నికరంగా, అవినీతికి తావులేకుండా ప్రజాసమస్యలపై పోరాడే భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా ఎండీ జహంగీర్‌ను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం, జిల్లా కమిటీ సభ్యులు చాపల మారయ్య, చండూరు మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయ గౌడ్, గట్టుప్పల్ మండల కమిటీ సభ్యులు కర్నాటి సుధాకర్, అచ్చిన శ్రీనివాస్, పి.శ్రీను, ఖమ్మం రాములు, పెద్దగాని నరసింహ, బి.నరసింహ, బి.యాదయ్య, విశ్వనాథం, అబ్బయ్య, ఈరటి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

కార్మికోద్యమ నేత నీలిమా మైత్రా కన్నుమూత

న్యూఢిల్లీ : కార్మికోద్యమ ప్రముఖ నేత, వర్కింగ్ వుమెన్, స్కీమ్ వర్కర్ల ముఖ్యంగా అంగన్‌వాడీ ఉద్యమాల నిర్వాహకురాలు నీలిమా మైత్రా కోల్‌కతాలోని నర్సింగ్‌హోంలో శుక్రవారం కన్నుమూశారు. దీర్ఘకాలంగా అస్వస్థతతో బాధపడుతున్న ఆమె వయస్సు 92సంవత్సరాలు. ఆమెది ఆరు దశాబ్దాలకు పైగా సాగిన రాజకీయ జీవితం. యువతగా వున్న సమయంలో ఉత్తర కోల్‌కతాలో మహిళా ఆర్గనైజేషన్‌లో పనిచేయడం ఆరంభించారు. ఇక ఆ తర్వాత రాష్ట్రంలో వామపక్ష ఉద్యమంలో ఆమె చాలా క్రియాశీలంగా పనిచేస్తూ వచ్చారు. తనపై జరిగిన అన్ని రకాల దాడులను నిర్భయంగా తట్టుకుని మరీ ఆమె పోరాటం సాగించారు. పాలక పక్షం, రాజకీయ గూండాలు సాగించిన సెమీ ఫాసిస్ట్ తరహా దాడులను కూడా ఆమె ఎదుర్కొన్నారు. తదనంతరం ఆమె అంగన్‌వాడీ వర్కర్లను, హెల్పర్లను సంఘటితం చేయనారంభించారు. ఆ యూనియన్‌ను పశ్చిమ బెంగాల్‌లోనే సీఐటీయూకు అనుబంధంగా గల అతిపెద్ద యూనియన్లలో ఒకటిగా రూపొందించడంలో ఆమె పాత్ర ఎనలేనిది. జాతీయ స్థాయిలో కూడా అంగన్‌వాడీలు, హెల్పర్లను సంఘటితం చేయడానికి ఆమె పాటుపడ్డారు. 1991లో అఖిల భారత అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమాఖ్య (ఏఐఎఫ్ఎడబ్ల్యుహెచ్) ఏర్పాటులో చాలా కీలకంగా వ్యవహరించారు. ఆ సమాఖ్యకు ఆమె వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1998లో అధ్యక్షురాలయ్యారు. 2019 వరకు ఆమె ఆ పదవిలో కొనసాగారు. దేశంలో అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘాల్లో అతిపెద్ద సంఘంగా ఏఐఎఫ్ఎడబ్ల్యుహెచ్‌ను అభివృద్ధిపరచడానికి ఆమె దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పర్యటించారు.



వయసు ఎంతలా మీదపడినా ఆమె చివరి వరకు చురుగ్గానే పనిచేశారు. చనిపోవడానికి కొన్ని వారాలు ముందు వరకు ఆమె యూనియన్ కార్యాలయానికి వస్తూ క్రియాశీలంగా కార్యకలాపాల్లో పాల్గొన్నారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు, దేశంలో బీమా ఉద్యోగుల ఉద్యమ వ్యవస్థాపక నేతల్లో ఒకరైన సునీల్ మైత్రాను ఆమె వివాహం చేసుకున్నారు. వారి కుమారులు కూడా కార్మికోద్యమంలోని వారి వారి రంగాల్లో క్రియాశీలంగా పనిచేస్తున్నారు.

సీఐటీయూ సంతాపం

ప్రముఖ కార్మిక నేత, మహిళా ఉద్యమాలను అగ్ర భాగాన వుంటూ సమర్ధవంతంగా నడిపించిన కార్యదక్షురాలు నీలిమా మైత్రా మృతికి సీఐటీయూ తీవ్రంగా సంతాపాన్ని ప్రకటించింది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసింది. ఉద్యమానికి ఆమె చేసిన విశేష సేవలకు గానూ ఘనంగా నివాళులర్పించింది. ఆమె మృతితో దేశంలో కార్మికోద్యమం ముఖ్యంగా వర్కింగ్ వుమెన్ ఉద్యమం కోలుకోలేని నష్టాన్ని ఎదుర్కొంటుందని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏపీ ఇంటర్ ఫలితాల్లో టాప్ శ్రీచైతన్య

Sri Chaitanya Educational Institutions INDIA
Sri Chaitanya
Educational Institutions

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏపీ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీ అయినా, బైపీసీ అయినా టాప్ శ్రీచైతన్య విద్యాసంస్థేనని ఆ సంస్థ అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో చింటు రేవతి 467 మార్కులతో, బైపీసీలో టి దివ్య 436 మార్కులతో, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎవి దుర్గా మధులిక 992 మార్కులతో, బైపీసీలో ఎస్ పావని 991 మార్కులతో స్టేట్ ఫస్ట్ మార్కులను శ్రీచైతన్య విద్యార్థులే సాధించారని పేర్కొన్నారు. పటిష్టమైన ప్రోగ్రాములు, సరైన ప్రణాళిక, అగ్రశ్రేణి అధ్యాపకుల శిక్షణతో ఇంటర్మీడియెట్ సబ్జెక్టులపై విద్యార్థులకు పట్టు కల్పిస్తున్నామని వివరించారు. జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, నీట్‌లతో అత్యధిక ర్యాంకులు తమ విద్యార్థులే సాధిస్తారన్న నమ్మకం ఏర్పడిందని తెలిపారు. గతేడాది ఐఐటీ జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో హ్యాట్రిక్ ర్యాంకులతో శ్రీచైతన్య రికార్డు బ్రేక్ చేసి సత్తా చాటిందని పేర్కొన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అందుకు దోహదపడిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని ఆమె అభినందించారు.

కరువుపై
బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారు

- బీజేపీ, బీఆర్ఎస్ నేతలపై కోదండరెడ్డి ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కరువు పరిస్థితులపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని కిసాన్ కాంగ్రెస్ జాతీయ నేత కోదండరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉండి కూడా అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. శుక్రవారం హైదరబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేశంలో అనేక సార్లు తీవ్రమైన కరువు వచ్చిందన్నారు. దాన్ని అధిగమించేందుకు ఆనాడు రాజశేఖర్ రెడ్డి కేంద్రానికి నివేదిక పంపించారని తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కరువును అధిగమించేలా రాష్ట్రాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తాగు, సాగు నీరు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పరిస్థితుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారని పేర్కొన్నారు. కష్టకాలంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు కేంద్రాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మెన్ సామ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ పదేండ్ల బీజేపీ పాలనలో దేశంలో పేదలు తీవ్ర ఇబ్బందులపాలయ్యాయరని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఇప్పటి వరకు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని విమర్శించారు.

పదేండ్లలో అన్నీ పిరమే

అందుకే బీజేపోళ్లకు ఓట్లేయాల్నా

- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హెూదా ఇవ్వనందుకా..?
- ఫూలే, అంబేద్కర్ ఆశయాలు కొనసాగిస్తున్నది కేసీఆర్ మాత్రమే
- పార్లమెంట్ ఎన్నికల తర్వాత అన్ని పథకాలకు రాష్ట్ర సర్కార్ మంగళం
- ఇబ్రహీంపట్నం విస్తృత స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

'రాముడితో పంచాయితీ లేదు.. రాముడు అందరివాడు.. బీజేపీ వ్యక్తి కాదు. రాముడికి బరాబర్ మొక్కుదాం.. కానీ ఈ పదేండ్లలో అన్నీ పిరం చేసినరు.. అందుకు బీజేపోళ్లకు ఓట్లేయాల్నా..? ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని పండబెట్టి తొక్కుదాం.. ఓడిద్దాం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణకు బీజేపీ ఏం చేసిందో చెప్పి ఓట్లు అడగాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హెూదా ఇవ్వనందుకు వేయాల్నా అని ప్రశ్నించారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన భువనగిరి పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశానికి కేటీఆర్ హాజరై మాట్లాడారు. బీజేపీకి ఎందుకు ఓటేయాలని.. తెలంగాణలోని ఐదు మండలాలను గుంజుకున్నందుకా..? భద్రాద్రి రామున్ని పట్టించుకోనందుకా..? కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వనందుకా..? ఐటీఐఆర్ రద్దు చేసినందుకా..? నవోదయ పాఠశాలలు, మెడికల్ కాలేజీలు ఇవ్వనందుకా..? అని అడిగారు. రాముడిని అడ్డం పెట్టుకుని తాము రాజకీయం చేస్తామంటే వారి నిజస్వరూపం బయటపెడతామని తెలిపారు. ఎంతో అద్భుతంగా నిర్మించిన యాదాద్రిని అడ్డం పెట్టుకుని రాజకీయం చేయలేదన్నారు. కేంద్రంలో ఏ పార్టీకి మెజార్టీ వచ్చే పరిస్థితి లేదని, ప్రజల ఆశీర్వాదంతో 12 సీట్లు వస్తే బీఆర్ఎస్సే చక్రం తిప్పే పరిస్థితి రావొచ్చని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను ఆచరణలో చేసి చూపెడుతున్నది కేసీఆర్ మాత్రమేనని తెలిపారు. 1008 గురుకుల పాఠశాలలను కేసీఆర్ స్థాపించారని, ఆరున్నర లక్షల మంది విద్యార్థులకు రూ.లక్షా 20 వేల చొప్పున ఖర్చు పెట్టి చదివించి, ప్రపంచంతో పోటీ పడే పౌరులుగా గురుకుల విద్యార్థులను తీర్చిదిద్దారని అన్నారు. రూ.11 వేల కోట్లతో గొర్రెల పెంపకం అమలు, రూ.30 వేల కోట్లతో మత్స్యకారులకు మత్స్య సంపద సృష్టించినట్టు చెప్పారు. పూలే, అంబేద్కర్‌కు దండేసి దండం పెట్టుడు వేరని, వారి ఆశయాలను కొనసాగించేలా చేతల్లో చేసి చూపించిన ఒకే ఒక్క నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ అన్నారు.



సంపాదకీయం

కళల్లో కలలేవెందుకు?



అరవై నాలుగు కళల గురించి గుదిగుచ్చిన మన శాస్త్రకారులు వాటిలో కలలు కనడాన్ని చేర్చకపోవడం పెద్ద ఆశ్చర్యమేమీ...! ఆశయం కోసం బతకడం, లక్ష్య సిద్ధి కోసం కలలు కనడం ఒక రకమైతే, ప్రజల్ని ఆశయ రహితులుగా చేసి జోకొట్టే పాలకుల కనికట్టుకు లోనై శవాల్లాగా, దూలాల్లాగా ప్రవాహం వాలుకు పడికొట్టుకుపోయేవారు అత్యధికులు. నాడు తెల్లదొరల పాలనకు 'జోహుకుం' అంటూ తలదించి లొంగిపోయిన రాజులు, మహరాజులు ఎందరో! దోపిడీ రహిత స్వతంత్ర భారతాన్ని కలగన్న భగత్‌సింగ్‌లు, బటుకేశ్వర్ దత్‌లు, అష్ఫఖుల్లాఖాన్‌లు కొందరే అయినా నేటికీ కోట్లాదిమందికి దారిదీపాలై ప్రకాశిస్తున్నారు.

> మోడీ లేటెస్ట్ నినాదం దేశంలో నాలుగే కులాలున్నాయంట. అవి యువతట, మహిళలట, రైతులట, చివరిగా మరో బ్రహ్మపదార్థం 'పేదలట'! వారి కోసమే తన ప్రభుత్వం పనిచేస్తోందట! రైతుల పంటలకవసరమైన కనీస మద్దతుధర ఈ ప్రభుత్వం ప్రకటించదు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ఖర్చు కూడా వెళ్ళక ప్రయివేటు అప్పులు, వడ్డీలు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకునే రైతులు పేదల లెక్కలోకి రారేమో!

అబ్దుల్ కలామ్ దేశ యువతీ, యువకుల్ని కనమన్న కలలు వేరు. నేటి భారత ప్రధాని ప్రజల్ని కలలు కంటూనే ఉండమంటున్న తీరు వేరు. అబ్దుల్ కలామ్ దేశ యువతను తమ బంగారు భవిష్యత్‌ను కలగనమన్నాడు. అందుకు కృషి కీలకమన్నాడు. 'పుస్తకం హస్త భూషణం'గా కాక అధ్యయన శీలురుగా యువత ఉండాలని స్వప్నించిన వ్యక్తి కలామ్ సాబ్. మోడీ చెప్పే కలలే వేరు. యువతకేం ఖర్మ, దేశ జనాభానంతటినీ బిజీగా వందేభారత్ రైళ్ళెక్కి ఊరేగమన్నట్టు కలగనమంటున్నాడు. ఎలాన్‌మస్క్ నోయిడాలో ఎలక్ట్రిక్ బస్సుల ఫ్యాక్టరీలు పెట్టినట్టు, రామమందిర నిర్మాణంలో ఉద్యోగాలు దొరికిన యువత పోనూ మిగిలిన యూపీ పోరగాండ్లందరికీ ఐదారు వేల రూపాయల జీతానికి ఆ కంపెనీల్లో ఉద్యోగాలొచ్చినట్టు కలగనమంటున్నాడు. ఆ రకంగా, దేశంలోని మొత్తం నిరుద్యోగుల్లో 83శాతం యువతేనన్న ఐఎల్ఓ రిపోర్టు తప్పని కలగనమంటున్నాడు.

2013, 2014 ఎన్నికల సమయంలో తనని గనుక ఢిల్లీలో సింహాసనాధీశుణ్ణి చేస్తే భారతదేశాన్ని 'గుజరాత్ తరహా'లో అభివృద్ధి చేస్తానన్న మోడీ వాగ్దానం గుజరాత్ బుడగ 2015లోనే ఠప్పున పేలిపోయింది. చిన్న పరిశ్రమలు దివాళా తీసి కొందరు, దేశమంతటిలాగే వ్యవసాయం దెబ్బతిని ఉపాధిలేక రోడ్డెక్కి లక్షలాదిమంది ఉద్యోగాల కోసం ఎగబడ్డారు. పాటీదార్ ఆందోళన 'గుజరాత్ మోడల్' గుట్టు రట్టు చేసింది. సాలుకి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్నది 2014 బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టో. ఆ తర్వాత దావోస్‌లో పకోడీలు చేసుకోవడమూ ఉపాధేనని అంతర్జాతీయంగా దేశం పరువుతీశారు మోడీ. తాజాగా చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ అసలు ఉద్యోగాలు కల్పించడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాదంటున్నాడు. వెరసి, 2014లో మోడీ ఆర్థిక సలహాదారులు అమాయకులా? మోసగాళ్ళా? పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు అమాయకులుండే అవకాశమే లేదు. కాబట్టి కచ్చితంగా మోసం చేసే మోడీ సింహాసనాధీశుడైనాడు.

మోడీ లేటెస్ట్ నినాదం దేశంలో నాలుగే కులాలున్నాయంట. అవి యువతట, మహిళలట, రైతులట, చివరిగా మరో బ్రహ్మపదార్థం 'పేదలట'! వారికోసమే తన ప్రభుత్వం పనిచేస్తోందట! రైతుల పంటలకవసరమైన కనీస మద్దతుధర ఈ ప్రభుత్వం ప్రకటించదు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ఖర్చు కూడా వెళ్ళక ప్రయివేటు అప్పులు, వడ్డీలు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకునే రైతులు పేదల లెక్కలోకి రారేమో! వ్యవసాయ రంగంలో సగటు వేతనాలు మోడీ దశాబ్దపాలనలో 12.3శాతం నుండి 4.8శాతానికి పడిపోయాయి. వ్యవసాయేతర రంగాల్లోనూ ఈ దశాబ్దకాలంలో వేతనాల పరిస్థితి ఇదే. సంఘటిత రంగంలోని కార్మికుల వేతనాలూ ఈ రకంగానే దిగజారాయని యాన్యువల్ సర్వే ఆఫ్ ఇండస్ట్రీస్ పేర్కొంది. నికర వాల్యుయాడెడ్‌లో వేతనాల భాగం 1980వ దశకంలో 30.4శాతం నుండి 2014-21కి 16శాతానికి పడిపోయింది. అసంఘటిత కార్మికుల స్థితి మరీ ఘోరం. కొనుగోలుశక్తి పడిపోయిన దేశంలోని కోట్లాది కష్టజీవుల గురించి ఈ ప్రభుత్వానికి ఖాతరే లేదులాగుంది. మోడీ చెప్పే నాల్గవ కులం మహిళలు. పైన చెప్పిన రైతుల, వ్యవసాయ కూలీల, కార్మికుల, ముఖ్యంగా 90శాతంపైగా ఉన్న అసంఘటిత కార్మికుల్లో కోట్లల్లో స్త్రీలున్నారు. ఆయన చందాకొచార్ గురించి, ఇంద్రనూయి గురించీ, నీతూ అంబానీ గురించి మాట్లాడితే వారంతా ఎప్పటికీ మోడీ పక్షమే.

ఇటీవల సీఎస్‌డీఎస్-లోక్‌నీతి సర్వే వెలువడింది. మోడీ పదేళ్ళ పాలన ధనికులకే ప్రయోజనం చేకూర్చిందన్న అభిప్రాయం ఎల్లెడలా వచ్చిందని సదరు నివేదిక పేర్కొంది. నిరుద్యోగం, ముఖ్యంగా గ్రామీణ నిరుద్యోగం ఒక తీవ్ర సమస్యగా ఉందని 2024 ఎన్నికల్లో ఆర్థికాంశాలే కీలకం కాబోతున్నాయని ఆ సర్వే తేల్చింది.

నిజాలివి కాగా బీజేపీకే 370 అని, ఎన్‌డీయేకి 400 దాటబోతున్నాయని మోడీకి మచ్చికైన మీడియా వెల్లడిస్తోంది. మరో పదిహేను రోజుల్లో రానున్న మేడేకి నినాదాలిచ్చి బాగా లొల్లి చేస్తే మోడీ కల చెదురుతుంది. జూన్ 4న ఫలితాలొచ్చే వరకైనా ఆయన్ని ప్రశాంతంగా ఉండనివ్వండి.



చావ రవి
9490300571

ప్రాంతాలు, యాజమాన్యాలు, క్యాడర్లు, కులాలు, మతాల అంతరాలను అధిగమించి రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ ఒకే సంఘం ఉండాలనే ఆశయంతో చారిత్రక అవసరంగా 1974 ఆగస్టు 10న ఏర్పడిన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) లక్ష్యాలు, ఆశయాల స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) పురోగమిస్తున్నది. హక్కులు బాధ్యతలు ఉద్యమ నేత్రాలుగా, అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో దశాబ్దకాలంగా సేవలందిస్తూ ఉపాధ్యాయుల మన్ననలు పొందుతూ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుతున్నది. 2014 ఫిబ్రవరిలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు బిల్లును పార్లమెంటు ఆమోదించి అపాయింటెడ్ డేట్‌గా జూన్2ను ప్రకటించినందున, 2014 ఏప్రిల్ 13న తెలంగాణ ప్రాంత పది జిల్లాల నుంచి తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యుటీఎఫ్) రాష్ట్ర కమిటీ ఏర్పాటైంది. 2014 సెప్టెంబర్ 24న రవీంద్రభారతిలో వేలాదిమంది ఉపాధ్యాయులతో రాష్ట్ర విద్యా సదస్సు నిర్వహించి ఆనాటి విద్యామంత్రి, విద్యావేత్తల సమక్షంలో తెలంగాణ విద్యారంగంపై డాక్యుమెంటును విడుదల చేశారు. టీఎస్‌యూటీఎఫ్ డాక్యుమెంటులో ప్రస్తావించిన అంశాలే తదనంతర కాలంలో విద్యావేత్తల డిమాండ్లుగా మారటం విశేషం. విద్యారంగం అభివృద్ధి పట్ల ప్రభుత్వం వైపునుండి ఏ మాత్రం చొరవ లేకపోవటం చేత ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించి, ప్రజలు కోరుకున్న విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందించాలని, పిల్లలందరికీ నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. పొందే హక్కు ప్రజలది. 'ఊరి బడి బాగుకై కదలండి' అంటూ 2015 జనవరి, ఫిబ్రవరి నెలల్లో తొమ్మిది జిల్లాల్లో 18 రోజులపాటు విద్యాయాత్ర నిర్వహించింది. ఆ యాత్ర ప్రజలపై మంచి ప్రభావం చూపింది. రాష్ట్ర వ్యాప్తంగా 5వేలకు పైగా గ్రామాల్లో తల్లిదండ్రులు ముందుకొచ్చి ఉపాధ్యాయుల సహకారంతో తమ పాఠశాలలో ఇంగ్లీషు మీడియం ప్రారంభించుకున్నారు. అయితే ప్రభుత్వం ఆ పాఠశాలలకు అదనపు ఉపాధ్యాయులనుగానీ, తరగతి గదులను

రాజీలేని పోరాట పంథా... టీఎస్‌యూటీఎఫ్



గానీ ఇవ్వకుండా వారి ఉత్సాహాన్ని నీరుగార్చింది.

నూతన రాష్ట్రం ఆవిర్భవించినప్పటికీ పాలకుల వర్గ స్వభావంలో మార్పు రానంతకాలం ప్రజలకు ఒరిగేదేమీ ఉండదని, ఉపాధ్యాయులు వివిధ వర్గాల శ్రామికులు, సాధారణ ప్రజలతో మమేకమై ఐక్య ఉద్యమాలు, పోరాటాల ద్వారా మాత్రమే తమ హక్కులను సాధించుకోగలరని టీఎస్‌యూటీఎఫ్ విశ్వాసం. అందుకనుగుణంగా ముందుగా సంఘ నిర్మాణాన్ని పటిష్టం చేసుకుంటూ ఇతర ఉపాధ్యాయ, ఉద్యోగ, ప్రజా సంఘాలతో ఐక్య కార్యాచరణను నిర్వహించింది. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్పీసీ) ఏర్పాటులో, 57 ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదికగా జెసిటియు ఏర్పాటు కావటంలో టీఎస్‌యూటీఎఫ్ చురుకైన పాత్ర పోషించింది. ఐక్య వేదిక పోరాట పిలుపుతోనే స్పాట్ వాల్యుయేషన్ రేట్లు రెట్టింపయ్యాయి. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు జరిగాయి. 2018 మే 16 న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులను ప్రగతి భవన్‌కు పిలిచి ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. ఐక్య ఉద్యమాల బలమేమిటో జెసిటియు రుజువు చేసింది. రెండోసారి అధికారం చేపట్టిన టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఉద్యోగుల పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్న తరుణంలో యుయస్పీసి, జాక్టో చొరవ తీసుకుని 79 సంఘాలతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, పబ్లిక్ సెక్టార్ అండ్ కాంట్రాక్టు ఉద్యోగుల ఐక్య వేదికను ఏర్పాటుచేసి 2020 మార్చి 13న చలో అసెంబ్లీ పోరాటాన్ని చారిత్రాత్మకంగా నిర్వహించటంలోనూ, తదనంతరం పిఆర్సీ, పదోన్నతుల సాధన కోసం 2020 డిసెంబర్ 29న యూఎస్పీసీ, జాక్టో ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహణలోనూ టీఎస్‌యూటీఎఫ్ చురుకైన పాత్ర పోషించింది. కక్షసాధింపుగా ప్రభుత్వం యూఎస్పీసీ, జాక్టో నాయకులపై బనాయించిన అక్రమ కేసులో నేను కూడా ఉన్నాను.

పిఆర్సీ నివేదిక బయట పెట్టాలని పోరాటం, 7.5శాతం ఫిట్మెంట్ ఆమోదయోగ్యం కాదని చరిత్రలో తొలిసారి సచివాలయం ఎదుటే పిఆర్సీ నివేదిక ప్రతులను తగులబెట్టి నిరసన తెలపడం, త్రిసభ్య కమిటీ వద్ద పిఆర్సీ నివేదికలోని అసంబద్ధాలను కూలంకషంగా వివరించి 30శాతం ఫిట్మెంట్ ప్రకటించాల్సిన అనివార్యతను ప్రభుత్వానికి కల్పించటంలో టీఎస్‌యూటీఎఫ్ క్రియాశీలక పాత్ర పోషించింది. రాష్ట్రపతి ఉత్తర్వులు - 2018 అమలు సందర్భంగా ఏకపక్షంగా జీవో 317ను విడుదల చేసినప్పుడు స్థానికత పునాదులపై ఏర్పడిన తెలంగాణలో ఉద్యోగుల విభజనలో స్థానికతకు చోటులేకపోవటాన్ని ముందుగా ప్రశ్నించింది. యూఎస్పీసీ ఆధ్వర్యంలో పెద్దయెత్తున పోరాటం చేసింది. టీఎస్‌యూటీఎఫ్ రాజీలేని పోరాట పంథా పాలకుల ఆగ్రహానికి గురైంది. 2019 నుండి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు అదర్ డ్యూటీ సౌకర్యం నిలిపివేసినా, అక్రమ కేసులు పెట్టినా, వ్యక్తిగతంగా టార్గెట్ చేసి పత్రికల్లో వార్తలు రాసి బెదిరించినా భయపడలేదు. పాలకులకు సరెండర్ కాలేదు. నిరంతరం ఉపాధ్యాయుల పక్షాన నికరంగా నిలబడి పోరాడింది టీఎస్‌యూటీఎఫ్. వివిధ యాజమాన్యాల ఉపాధ్యాయుల సమస్యలపై సెక్టార్ వారీగా విభాగాలను ఏర్పాటు చేసి ఆయా ఉపాధ్యాయులను సంఘటితం చేసి ఉద్యమాలు నిర్వహించి కొన్ని ఫలితాలను సాధించింది. కోవిడ్ లాక్‌డౌన్ కాలంలో ఉపాధి కోల్పోయిన పేదల కోసం రూ.50 లక్షలకు పైగా విరాళాలు సేకరించి నిత్యావసర సరుకులు పంపిణీ చేసింది. అఖిల భారత ఉపాధ్యాయ ఉద్యమంలో సైతం టీఎస్‌యూటీఎఫ్ క్రియాశీలకపాత్ర పోషిస్తున్నది. సంఘ నిర్మాణాన్ని బలోపేతం చేస్తూ, సైద్ధాంతిక నిబద్ధతను పెంపొందించుకుంటూ ఈ ప్రస్థానాన్ని కొనసాగించడానికి టీఎస్‌యూటీఎఫ్ కార్యకర్తలందరూ పునరంకితమౌతున్నారు.

(నేడు టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం)

నేతన్నల ఐక్య పోరాటమిచ్చిన సందేశమేమిటి?



ఎస్. వీరయ్య

సాంచల సందడే సిరిసిల్ల గుండెచప్పుడు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వాల నిర్వాకంతో సిరిసిల్ల సాంచలు(పవర్‌లూమ్స్) ఆగిపోయాయి. ఫలితంగా 30వేల నేత కార్మిక కుటుంబాలు బజారున పడ్డాయి. నలభై ఎనిమిది రోజులపాటు నేత కార్మికుల అలుపెరుగని ఐక్యపోరాట ఫలితంగా విజయం సాధించారు. సాంచల సందడి మళ్లీ మొదలైంది. "ఉరిసిల్ల కాదిది... పోరుసిల్ల" అని కార్మికవర్గం నిరూపించింది. ఇద్దరిని కోల్పోయినప్పటికీ, పాత 'ఉరిసిల్లగా మారకుండా కార్మికులకు పోరాటం పట్ల విశ్వాసం బలపడింది. సిరిసిల్ల 'సిరి' భద్రతకు పోరుబాటే తప్ప మరో మార్గం లేదని రుజువైంది.

సీఐటీయు నాయకత్వంలో సాగిన నేతన్నల సుదీర్ఘ పోరాటం ఐక్య పోరాటంగా మారింది. పెట్టుబడి పెట్టిన యజమానులు, సాంచల ఆసాములు కూడా కలిసిరావటంతో ఐక్యకార్యాచరణ కమిటీ ఏర్పడింది. కార్మికులు సిరిసిల్ల పట్టణమంతా పాదయాత్ర చేయ టంతో ఆసాములు, పెట్టుబడి పెట్టినవారు, ఇతరులలో కూడా విశ్వాసం కలిగింది. 42వ రోజు నాటికి జేఏసీ రూపం తీసుకున్నది. సంపూర్ణ ఐక్యతకు బాటలు వేసింది. సహజంగానే మొదట యజమానులు, ఆసాములు గత, ప్రస్తుత పాలకులనే నమ్ముకున్నారు. వేతన సవరణ, కార్మికుల హక్కుల విషయంలో తమతో పోరాడిన కార్మికవర్గంతో కలిసి పోరాడటానికి భేషజాలు అడ్డువచ్చాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుకుని పరిష్కరించుకోవచ్చునను కున్నారు. కానీ సమస్య తీవ్రత రీత్యా, 42రోజుల పోరాటం తర్వాతనైనా ఐక్యపోరాటానికి సిద్ధపడటం అనివార్యమైంది. పట్టుదలతో సాగిన కార్మికుల పోరాటం వారిని ఆ దిశలో అడుగులు వేసేందుకు ప్రోత్సహించింది.

గత పాలకులు బతుకమ్మ చీరల బకాయిలు రూ.273 కోట్లు చెల్లించలేదు. కార్మికులకు నేరుగా అందవల్సిన దారం సబ్సిడీ రూ.18కోట్లు ఇవ్వలేదు. కార్మికుల పొదుపు సొమ్ముకు ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు, విద్యుత్తు సబ్సిడీ కూడా బకాయి పెట్టింది. మరోవైపు కేంద్రంలో మోడీ ప్రధాని కాగానే జాతీయ చేనేత బోర్డు, జాతీయ టెక్స్‌టైల్ బోర్డులను రద్దు చేసారు. యూపీఏ కాలం నుంచి ఇంట్లోనే పవర్‌లూం నడిపే విధంగా ప్రోత్సహిస్తూ వచ్చిన హౌజ్ కం వర్క్‌షెడ్ పథకం, మహాత్మాగాంధీ బునకర్ బీమా యోజన, ఐసిఐసిఐ లాంబార్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీంలను రద్దు చేసారు. వీటన్నింటినీ మించి చేనేత, పవర్‌లూమ్ వస్త్ర ఉత్పత్తుల మీద, ముడిసరుకుల మీద జీఎస్టీ పేరుతో పన్ను 12శాతానికి పెంచారు. ఫలితంగా సిరిసిల్ల నేత పరిశ్రమ సంక్షోభంలో పడ్డది. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బాధ్యతగా వ్యవహరించలేదు. నేతన్నలను ఆదుకునేందుకు సకాలంలో చర్యలు తీసుకోలేదు. కరెంట్ బిల్లుల మీద సబ్సిడీ బకాయిలున్నాయన్న పేరుతో, యూనిట్ రూ.2 కాకుండా రూ. 8 చొప్పున, వడ్డీతో సహా చెల్లించాలని విద్యుత్తు అధికారులు ఒత్తిడి చేసారు. ఒక్కొక్క ఆసామి లక్షల రూపాయలు బకాయి ఉన్నారన్న నెపంతో మీటర్లు డిస్కనెక్ట్ చేసారు. ప్రభుత్వం కూడా కొత్తగా గుడ్డ ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వలేదు. ఆసాములు, యజమానులు ఉత్పత్తిని ఆపేసారు. కేంద్రంలో మోడీ సర్కారు, రాష్ట్రంలో కేసీఆర్ సర్కారుల నిర్వాకం ఫలితంగా నేతన్నల జీవితాలు దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. పోరాటం ప్రారంభమైంది. పోరాటం సాగుతుండగానే పార్లమెంటు ఎన్నికలు ప్రకటించారు. అయినా పోరాటం కొనసాగించక తప్పలేదు. కార్మికుల గుండెచప్పుడు ఆగకుండా ఉండాలంటే పోరాటం అనివార్యమైంది.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి బడా వస్త్ర పరిశ్రమలు, విదేశీ బహుళజాతి సంస్థల మీద మోజు ఎక్కువ. అవి లాభాలు గడించాలంటే చేనేత, పవర్‌లూం పరిశ్రమలు మిగలొద్దు. అందుకే వాటి మనుగడకోసం నడుస్తున్న



పథకాలన్నీ మోడీ ప్రధాని అయిన తర్వాత రద్దు చేసారు. 'పీఎం మిత్రా' పేరుతో 2023 మార్చి 17న ఒక పథకం ప్రవేశపెట్టారు. దీనికి '5ఎఫ్ విజన్' అని ముద్దుపేరు పెట్టారు. ఇందులో భాగంగానే వరంగల్ నగరంలో రెండువేల ఎకరాల భూమి సేకరించి, బ్రాండెడ్ బడా కంపెనీల కోసం మెగా కాకతీయ టెక్స్‌టైల్ పార్క్ స్థాపనకు వేగంగా మౌలిక వసతులు కల్పిస్తున్నారు. అసంఘటితంగా వస్త్ర పరిశ్రమ ఉన్నదనీ, దీనివల్ల ప్రయోజనం లేదనీ ప్రధాని భావించారట! అందుకు బడా పరిశ్రమలకు పెద్దపీట వేసారట! ఈ విషయం కేంద్రమంత్రి పియూష్ గోయల్ ప్రకటించారు. మరోవైపు, నాటి ముఖ్యమంత్రి కూడా అదే విధానం చేపట్టారు. ఇక సాధారణ వ్యక్తిగత పవర్‌లూమ్ పరిశ్రమకు భవిష్యత్తు ఉంటుందా? మోడీతో చేతులు కలిపి నేతన్నల పొట్ట కొట్టే విధానం చేపట్టిన ఫలితమే నేటి సిరిసిల్ల సంక్షోభానికి మూలం. అంతేకాదు. 'కార్మికుడే యజమాని' పేరుతో ఒక పథకం రూపొందించి ఆనాటి ప్రభుత్వం వర్క్‌షెడ్స్ నిర్మించింది. కానీ 50శాతం సబ్సిడీతో ప్రతి కార్మికుడికీ నాలుగు పవర్‌లూమ్స్ ఇస్తామన్న ప్రభుత్వం, బ్యాంకు అప్పులకు ఏర్పాట్లు చేయలేదు. ఇప్పుడు ఆ వర్క్ షెడ్లు పడావుపడి ఉన్నాయి. తొండలు గుడ్లు పెడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించిన మెగా టెక్స్‌టైల్ పార్క్ వైపు మొగ్గిన ఫలితమే ఇది. ఇప్పుడు ఉన్నట్టుండి ముప్పైవేల మందికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపించగల పరిస్థితి చిన్న సిరిసిల్ల పట్టణానికి లేదు. పైగా దీని ప్రభావం ఇతర వ్యాపారాల మీద కూడా పడింది. అమ్మకాలు మందగించాయి.

రోడ్డునపడ్డ నేతన్నలను పౌరులుగా గానీ, శ్రమను అమ్ముకుని బతుకుతున్న కార్మికులుగా గానీ పాలకపార్టీలు పరిగణించలేదు. వారి కుటుంబాల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించాయి. మరోదారి లేని కార్మికులు ధర్నాలు, ప్రదర్శనలు, వంటావార్పు, భిక్షాటన, పాదయాత్ర వంటి రూపాలలో పోరాడారు. సభ్య సమాజం వీరి పట్ల సంఘీభావం ప్రదర్శించింది. అన్నదానం సందర్భంగా కూరగాయల వ్యాపారులు బాగా స్పందించారు. వారి వృత్తి లేకుండా తాము కూడా బతకలేమనీ, ఎన్ని కూరగాయలైనా ఇవ్వడానికి సిద్ధపడ్డారు.

నలభై ఎనిమిది రోజుల ఈ పోరాటంలో ఎక్కడా కనిపించని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, ముగింపు దశలో వేలుపెట్టి, ఎన్నికల కోసం వాడుకునేందుకు ప్రయత్నించారు. బండి సంజయ్ ఒకరోజు దీక్ష చేస్తానన్నాడు. మోడీ తప్పుడు విధానాలు అమలు చేసినపుడు బండి సంజయ్ పార్లమెంటు సభ్యులు. సిరిసిల్లలో కానీ, పార్లమెంటులో గానీ మోడీ ప్రభుత్వ విధానం మార్చుకోవాలని చెప్పలేదు. అప్పుడాయనకు దీక్ష చేయాలని కూడా అనిపించలేదు. కేటీఆర్ మంత్రిగా ఉన్నపుడే, కేసీఆర్ పాలనలోనే ఈ సమస్యకు పునాది పడ్డది. అప్పుడు జోక్యం చేసుకోలేదు. పరిష్కారానికి ప్రయత్నించనే లేదు. ఇప్పుడు మాత్రం కార్మికులు పోరాడాలని కేసీఆర్ చెప్పారు. కేటీఆర్ పేజీలకు పేజీలు ముఖ్యమంత్రికి లేఖ రాసారు. పైగా తమవల్లనే సమస్య పరిష్కారమైనట్టు సోషల్ మీడియాలో ప్రచారం మొదలుపెట్టారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల స్వార్థ రాజకీయ ప్రయోజనాలకోసం సమస్యను రాజకీయం చేయవద్దనీ, ఇది నేతన్నల ఐక్య పోరాట విజయమనీ జేఏసీ ప్రకటించడంతో తోకముడిచారు. పోరాటాలంటే సహించని బీఆర్ఎస్ నాయకత్వం, ఏప్రిల్ 6న నేతన్నల గర్జన సభలో పాల్గొనాలని ప్రయత్నించటం నేతన్నలకు ఆశ్చర్యం కలిగించింది. ఎన్నికల ప్రయోజనం కోసం వాడుకునే ప్రయత్నాన్ని గమనించిన జేఏసీ, అందుకు అంగీకరించలేదు. నలభైఆరు రోజుల కార్మికుల పోరాటం పట్ల ముఖం చాటేసిన బండి సంజయ్, కేటీఆర్‌లు చివరలో హడావుడి చేయటంతో సిరిసిల్ల జనం ముక్కుమీద వేలేసుకున్నారు.

ఈ పోరాట కాలంలో సీఐటీయూ నాయకులు, నేతన్నల బృందంతో పాటు ఆరుసార్లు సంబంధిత శాఖ మంత్రిని కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. కమిషనర్‌తో కూడా చర్చించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రిని కలిసారు. ఏప్రిల్ 6న సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములుతో కలిసి సీఐటీయూ నాయకులు, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావుతో సుదీర్ఘ చర్చల ఫలితంగా పరిష్కారానికి తాము బాధ్యత తీసుకున్నారు. అదే విషయం వేలాదిమంది పాల్గొన్న నేతన్నల గర్జన సభలో ప్రకటించటం జరిగింది. ఆమేరకు ఏప్రిల్ 8వ తేదీన మరోసారి ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకుల చర్చల అనంతరం, మంత్రి పొన్నం ప్రభాకర్ సిరిసిల్ల చేరుకుని, సమస్యను పరిష్కరిస్తూ బహిరంగ ప్రకటన చేసారు. రెండు, మూడు రోజులలో యార్న్ సబ్సిడీ, ఇతర బకాయిలు విడుదలకు అంగీకరించారు. విద్యుత్తు సబ్సిడీ చెల్లిస్తామనీ, ప్రభుత్వ శాఖల నుంచి బట్ట ఉత్పత్తికి ఆర్డర్లు ఇస్తామని ప్రకటించారు. ఫలితంగా యజమానులు 10వ తేదీ నుంచి సాంచలు నడుస్తాయని ప్రకటించారు. నేతన్నల కుటుంబాలలో ఆనందం వెల్లివిరిసింది.

> గత పాలకులు బతుకమ్మ చీరల బకాయిలు రూ.273 కోట్లు చెల్లించలేదు. కార్మికులకు నేరుగా అందవల్సిన దారం సబ్సిడీ రూ.18కోట్లు ఇవ్వలేదు. కార్మికుల పొదుపు సొమ్ముకు ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు, విద్యుత్తు సబ్సిడీ కూడా బకాయి పెట్టింది. మరోవైపు కేంద్రంలో మోడీ ప్రధాని కాగానే జాతీయ చేనేత బోర్డు, జాతీయ టెక్స్‌టైల్ బోర్డులను రద్దు చేసారు. యూపీఏ కాలం నుంచి ఇంట్లోనే పవర్‌లూం నడిపే విధంగా ప్రోత్సహిస్తూ వచ్చిన హౌజ్ కం వర్క్‌షెడ్ పథకం, మహాత్మాగాంధీ బునకర్ బీమా యోజన, ఐసిఐసిఐ లాంబార్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీంలను రద్దు చేసారు. వీటన్నింటినీ మించి చేనేత, పవర్‌లూమ్ వస్త్ర ఉత్పత్తుల మీద, ముడిసరుకుల మీద జీఎస్టీ పేరుతో పన్ను 12శాతానికి పెంచారు. ఫలితంగా సిరిసిల్ల నేత పరిశ్రమ సంక్షోభంలో పడ్డది. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బాధ్యతగా వ్యవహరించలేదు. నేతన్నలను ఆదుకునేందుకు సకాలంలో చర్యలు తీసుకోలేదు.

చేనేత వృత్తినీ, కులాన్నీ ఒకటిగా చూడలేమని ఈ పోరాటం మరోసారి రుజువు చేసింది. కార్మికులు, ఆసాములు, యజమానులలో 95శాతం ఒకే కులం నుంచి వచ్చినవారు. అయినప్పటికీ అదే కులానికి చెంది, ఇతర వ్యాపారాలలో స్థిరపడ్డవారు ఈ పోరాటంవైపు కన్నెత్తి చూడలేదు. కులసంఘం నాయకులు కూడా పాలకపార్టీల నాయకులతో దోస్తానాకు ప్రాధాన్యతనిచ్చారు తప్ప నేత కార్మికుల పోరాటాన్ని పట్టించుకోలేదు. అందుకే ఇది కార్మికవర్గ పోరాట విజయం. కార్మికులు, ఆసాములు, వైపన్, వార్పిన్, గుమాస్తాలు, యజమానుల ఐక్యపోరాట విజయం. భవిష్యత్తు కార్మికోద్యమానికి ఈ పోరాటం అనేక అనుభవాలనిచ్చింది.

ఆ శక్తుల్ని అధికారానికి దూరం చేయడమే అంబేద్కర్‌కిచ్చే నివాళి



స్కైలాబ్‌బాబు
9177549646


ప్రపంచం గర్వించే మేధస్సు ఆయనది. దేశంలో అనేకమందిని ప్రభావితం చేసిన మహనీయుడాయన. అంబేద్కర్‌ను కేవలం రాజ్యాంగం రాసిన, రిజర్వేషన్లు ప్రతిపాదించిన వ్యక్తిగా మాత్రమే చూస్తారు. అంబేద్కర్ ఆశయ విరోధులు సైతం ఆయనను కొనియాడుతున్నారు ఆయన లక్ష్యాలు, ఆశయాలు అర్థం చేసుకోకుండా వాటిలో పది పైసలవంతు ఆచరించని వాళ్లు కూడా అంబేద్కర్ విగ్రహానికి దండలు వేసి దండాలు పెడుతున్నారు. వేల సంవత్సరాల మనుస్మృతి శూద్రులు అస్పృశ్యులను చదువు సంపదకు దూరం చేసింది. ప్రకృతి సహజ సిద్ధ భూమి, నీరు, గాలి వెలుతురుకు దూరం చేసింది.

సకల సమస్యలకు కర్మ గ్రహచారం పేరుతో అస్పృశ్యులు అణిచివేతకు గురవుతున్నారని గ్రహించి 1927 డిసెంబర్ 25న మహాద్ పట్టణంలో చౌదార్ చెరువు మంచి నీళ్లపోరాటాన్ని మనుస్మృతిని తగలబెట్టడంతో అంబేద్కర్ ప్రారంభించాడు. స్త్రీ సమానత్వం కోసం అహర్నిశలు కృషి చేశాడు. నాడు పార్లమెంటులో స్త్రీలకు ఆస్తి హక్కు, వారసత్వపు హక్కు, దత్తత హక్కు విడాకుల హక్కు, ఇతర స్త్రీల రక్షణ కోసం హిందూ కోడ్ బిల్లు ప్రవేశపెట్టాడు. దాన్ని నాటి కాంగ్రెస్ అంగీకరించకపోతే పార్లమెంటులో ఆయన కేంద్ర క్యాబినెట్ మంత్రికి రాజీనామా చేసి బయటికి వచ్చారు. దేశంలో సగభాగం ఉన్న మహిళల తరపున రాజీనామా చేసిన వ్యక్తి అంబేద్కర్. కార్మిక వర్గం కోసం అంబేద్కర్ 1948లో కనీస వేతన చట్టాన్ని రూపొందించాడు. ప్రసూతి సెలవులు కల్పించాడు. అంతకంటే ముందే కమ్యూనిస్టుల నాయకత్వంలో బొంబాయిలో జరిగిన నూలు మిల్లు కార్మికుల పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని సంపూర్ణ సంఘీభావం తెలిపాడు. మతం, దేవుడు రాజకీయాలలో, అధికారంలో ఉండకూడదని చెప్పాడు. మతం రాజ్యాన్ని ఆవహిస్తే దేశం ఉన్మాదంగా మారుతుందని ఆయన ఆనాడే హెచ్చరించారు

ఏ సమాజమైనా మార్పు చెందాలంటే ఆర్థిక విప్లవమే ప్రాముఖ్యమైనదిగా భావిస్తూ అది సాధించే దానికంటే ముందే సాంఘిక సాంస్కృతిక విప్లవాల్ని దాటుకొని రావాలన్నాడు. ఆర్థిక సామాజిక అంతరాలు పరస్పర పోషకాలుగా ఉంటాయని, ఒక దానిని విస్మరించి మరోదాన్ని సాధించడం సాధ్యం కాదంటాడు. రాజ్యాంగంకంటే ముందు రాష్ట్రాలు మైనార్టీలు అనే పుస్తకంలో భూమి మొత్తం జాతీయకరణ జరగాలని, పరిశ్రమలలో కార్మికులకు యాజమాన్య వాటా ఉండాలన్నాడు. మహారాష్ట్రలో కొంకణా ప్రాంతంలో రైతులపై వేస్తున్న కోటి అనే పన్నుకు వ్యతిరేకంగా ఆయన ప్రత్యక్ష పోరాటంలో పాల్గొన్నాడు. అంబేద్కర్ ఇంత సుదీర్ఘ లక్ష్యం ఆశయాలు కలిగి ఉన్నాడు.

పదేండ్ల కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ పాలకులు అంబేద్కర్‌కు మొక్కడం, ఆయన ఆశయాలను తొక్కడం చేస్తున్నారు. ప్రధానంగా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం పనికిరాదని నాడే ఆర్ఎస్ఎస్ బహిరంగంగా ప్రకటించింది. తమ ప్రాచీన భారత రాజ్యాంగం మనుస్మృతి మాత్రమే అని నిస్సిగ్గుగా ప్రకటించింది 2023 ఫిబ్రవరి 25వ తేదీన తెలుగు యూనివర్సిటీలో ఆర్ఎస్ఎస్ కార్యకర్త కృష్ణారెడ్డి రచించిన ప్రాచీన భారత రాజ్యాంగం మనుస్మృతి గ్రంథ ఆవిష్కరణ సభ పెట్టగా విద్యార్థులు ప్రతిఘటించటంతో కేశవ్ మెమోరియల్ స్కూల్‌కు మార్చారు అక్కడ కూడా అడ్డుకోవడంతో తాత్కాలికంగా వాయిదా వేశారు. అంతేకాదు ఇటీవల కాలంలో కర్నాటక బీజేపీ ఎంపీ అనంతకృష్ణ హెగ్డే 400 సీట్లు బీజేపీకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని బాహాటంగా ప్రకటించాడు. గతంలో నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ బాజాప్తా భారత రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పాడు. కేవలం ఆ ఇద్దరు ఎంపీల మాటలుగా భావించలేము ఆర్ఎస్ఎస్-బీజేపీ నాలుకతో మాట్లాడినట్లుగా భావించాలి. రాజ్యాంగంలోని నాలుగు మూలస్తంభాలైన ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, ఫెడరలిజం, సామాజిక న్యాయాలను సర్వనాశనం చేస్తున్నారు. ఇద్దరు సీఎంలని తమ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా జైల్లో నిర్బంధించారు. అనేకమంది ప్రతిపక్ష నాయకులను లొంగిపోతే తమ పార్టీలో చేర్చుకొని పవిత్రులుగా భావించడం, ఎదిరించి పోరాడితే దోషులుగా నిలబెట్టడానికి ఈడి, సిబిఐని తమ జేబు సంస్థలుగా వాడుకుని వేధించడం చేస్తున్నారు.

సామాజిక న్యాయాన్ని సమాధి చేసే దిశగా బీజేపీ పాలన సాగుతున్నది. దేశంలోని నవరత్నాల వంటి ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతున్నది. ప్రయివేటురంగంలో రిజర్వేషన్లు ఉండవు. రిజర్వేషన్లు కోల్పోతే సామాజిక న్యాయముండదు. కేంద్ర బీజేపీ సర్కార్ నూతన విద్యా విధానం పేరుతో ఉన్నత విద్యకు అట్టడుగు పేదలను దళితులను దూరం చేసే కుట్రకు ఒడిగట్టింది. నూతన విద్యా విధానంలో రిజర్వేషన్లు ఉండవు. మేనేజ్‌మెంట్ కోటాలోనే ప్రతిఒక్కరూ చేరాల్సిందే. కోట్ల రూపాయలు ఉన్నవారే ఉన్నత చదువు కొనుక్కుంటారు. దళితులకు ఉన్నత విద్య దక్కకుండా చేస్తున్నది. బీజేపీ ఈ పదేండ్ల కాలంలో దళితులపైన 300 రెట్లు దాడులు,దౌర్జన్యాలు పెరిగాయి. ప్రత్యేకించి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు మహిళలకు ఏమాత్రం రక్షణ లేకుండా అభద్రతలో జీవిస్తున్నారు. యూపీ యోగి ఆదిత్యనాథ్ పరిపాలనలో హత్రాస్‌లో జరిగిన దళిత యువతి గ్యాంగ్ రేప్ సంఘటనకు దేశం అవాక్కయింది. యూపీలో ఓ నదిలో స్నానం చేసిన దళిత మహిళను బట్టలూడదీసి నగ్నంగా కర్రలతో



> బీజేపీ మతం ప్రాతిపాదికగా దేశాన్ని ఏలాలనుకుంటోంది. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని అమలు చేయజూస్తోంది. మరోసారి ఎన్నికైతే మతం తప్ప ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, ఫెడరలిజం, సామాజిక న్యాయం ఇవేమీ ఉండవు. ఫలితంగా దేశం అధోగతి పాలవడం ఖాయం. ఈ పాలన ఇలాగే కొనసాగితే విద్వేషాలు, ఉద్రిక్తతలు, అల్లర్లు, మానవ మారణహోమం తప్ప ఏమి మిగలదు.

చితకబాది హింసించారు. నరేంద్ర మోడీ సొంత రాష్ట్రం గుజరాత్ లోని ఉనా పట్టణంలో దళిత యువకుడు ప్రదీప్ రాథోడ్ గుర్రం ఎక్కినందుకు దాని పైనుంచి కింద పడేసి కొట్టి చంపేశారు.

నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో ఇచ్చిన లెక్కల ప్రకారం 2018 నుంచి దళితులపై అత్యాచారాలలో బీజేపీ పాలిత రాష్ట్రాలు ముందు పీఠినే ఉన్నాయి. 2014 -15 నుండి 2019-20 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో దళితులకు 7.51 లక్షల కోట్ల రూపాయలు రావాల్సి ఉండగా, కేవలం 20.8శాతం మాత్రమే కేటాయించింది 2017-18 సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని రద్దు చేసింది. 2019-20 నుంచి 2023-24 సంక్షేమ పథకాలలో కేవలం 10.6శాతం మాత్రమే దళితులకు కేటాయించింది. ఇందులో 3.3శాతం మాత్రమే ఖర్చు చేసింది. దళితులు అక్షరాస్యతలో సైతం నేటికీ వెనుకబడి ఉన్నారు. దేశం సగటు 73శాతం ఉండగా దళితుల్లో 66శాతం ఉన్నట్లుగా పేర్కొన్నారు. నూటికి 60 శాతం మంది దళితులకు గుంట భూమి లేదు. దళితుల్లో 2022 నాటికి నిరుద్యోగ రేటు 8.4 నమోదయింది. కేంద్ర, రాష్ట్ర సంబంధాలు రోజురోజుకీ బలహీన పడుతూ కేంద్ర ఆధిపత్యం చెలాయిస్తూ రాష్ట్రాల హక్కుల్ని హరిస్తున్న తీరు బాహాటంగా వ్యక్తమవుతున్నది. దేశంలో మైనార్టీలను ద్వితీయ శ్రేణి పౌరులంటూ సీఏఏ పేరిట హింసిస్తున్నది మతం ప్రాతిపాదికగా పౌరసత్వాన్ని నిర్దేశించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. మైనారిటీ మతాలపై మూక దాడులకు పాల్పడుతున్నది. 2017 నుండి 2022 మధ్యకాలంలో 2009 మతోన్మాద దాడులు, 2022-23 కాలంలో 720 చర్చిలపైన దాడులు జరిగాయి. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా స్వయంగా ప్రధానమంత్రి మత క్రతువుల్లో పాల్గొన్న స్థితి జనవరి 22న అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్టలో చూసాము. పదేండ్ల బీజేపీ పాలనలో 2014 కంటే ముందు ఇచ్చిన వాగ్దానాలు ఏమీ అమలుకు నోచుకోలేదు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మాట నీటి మూటగా మారింది.

బీజేపీ మతం ప్రాతిపాదికగా దేశాన్ని ఏలాలనుకుంటోంది. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని అమలు చేయజూస్తోంది. మరోసారి ఎన్నికైతే మతం తప్ప ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, ఫెడరలిజం, సామాజిక న్యాయం ఇవేమీ ఉండవు. ఫలితంగా దేశం అధోగతి పాలవడం ఖాయం. ఈ పాలన ఇలాగే కొనసాగితే విద్వేషాలు, ఉద్రిక్తతలు, అల్లర్లు, మానవ మారణహోమం తప్ప ఏమి మిగలదు. అందుకే మతోన్మాద శక్తుల్ని అధికారానికి దూరం చేయడం, రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే అంబేద్కర్‌కి మనమిచ్చే నిజమైన నివాళి.

(ఏప్రిల్ 5-14 వరకు పూలే, అంబేద్కర్ జన జాతర సందర్భంగా)

'అందరికీ ఇండ్లు' ఉత్తిదే

గూడే లేని పట్టణ పేదలు 83 శాతం

- కిక్కిరిసిపోతున్న నగరాలు, పట్టణాలు
- తాకిడి తట్టుకోలేక చేతులెత్తేస్తున్న కేంద్రం
- ఇస్తున్న సాయమూ అంతంతే
- లబ్దిదారులపైనే అధిక భారం



న్యూఢిల్లీ : పట్టణాలు, నగరాలలో నివాస గృహాలు లేని వారందరికీ గూడు కల్పించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రారంభించిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ పథకం లక్ష్యానికి ఆమడ దూరంలో నిలిచింది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి 1.18 కోట్ల కుటుంబాలకు గృహ వసతి కల్పిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అందులో నాలుగో వంతు కుటుంబాలకు మాత్రమే ఇప్పటి వరకూ ఆ సౌకర్యం చేకూరింది. అంటే లక్ష్యానికి దూరంగా చాలా తక్కువ మందికే గృహ నిర్మాణం జరిగింది.

కానీ ప్రభుత్వ వాదన మరోలా ఉంది. ఇప్పటికే 80 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు అంటున్నారు. కానీ వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఇప్పటికీ 83 శాతం మంది పట్టణ పేదలకు గూడు లేదు. మురికివాడల్లో నివసించే పేదల కోసం ఈ పథకం కింద కేవలం 2.96 లక్షల కుటుంబాలకు మాత్రమే ఇళ్లు నిర్మించి ఇచ్చారు. అంటే డిమాండ్‌లో 20 శాతం మాత్రమే నెరవేరింది. ఒకవేళ ఈ సంవత్సరాంతానికి మరో 37 శాతం ఇండ్లు నిర్మించి ఇస్తారని అనుకున్నా దేశంలో ఇంకా 2.4 కోట్ల మంది గూడు కోసం ఎదురు చూస్తూనే ఉంటారు.

1985 నుంచే పథకాలు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం గృహ వసతి కలిగి ఉండడం ప్రజల ప్రాథమిక హక్కు. పేదలకు ఇండ్లు నిర్మించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 1985లో తొలిసారిగా ఇందిరా ఆవాస్ యోజన పథకాన్ని తీసుకొచ్చింది. అప్పటి నుండి రెండు దశాబ్దాల పాటు గ్రామీణ పేదలను దృష్టిలో ఉంచుకొని గృహ నిర్మాణం చేసింది. ఆ తర్వాత పట్టణ పేదలపై దృష్టి సారించింది. 2007లో నేషనల్ అర్బన్ హౌసింగ్ అండ్ హాబిటెట్ పాలసీ (ఎన్‌యూహెచ్‌హెచ్‌పీ)ని రూపొందించింది. అయితే ఇది పెద్దగా ఫలితాన్ని ఇవ్వలేదు. అనంతరం రాజీవ్ ఆవాస్ యోజన, రాజీవ్ రిన్ యోజన వంటి పథకాలు వచ్చాయి. చివరగా 2015లో పీఎంఏవై-యూ పథకాన్ని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చింది.

పెరుగుతున్న పట్టణ జనాభా

2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 31 శాతం మంది లేదా 37.7 కోట్ల మంది భారతీయులు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. తాజా అంచనాల ప్రకారం ప్రస్తుతం పట్టణ జనాభా 50 కోట్లకు చేరుకుంది. 2030 నాటికి 40 శాతం మంది భారతీయులు పట్టణ ప్రాంతాల్లోనే నివసిస్తారని అంచనా. దేశంలోని నగరాలు, పట్టణాలు ప్రజలతో కిక్కిరిసిపోతున్నాయి. అటు పేదల సంఖ్య కూడా పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో వారికి నివాస గృహాలు నిర్మించి ఇవ్వడం ప్రభుత్వాలకు సవాలుగా మారింది. మూడు లక్షల రూపాయల కంటే తక్కువ వార్షిక ఆదాయం ఉన్న కుటుంబాలను ఆర్థికంగా బలహీన వర్గాలుగా (ఈడబ్ల్యూఎస్), మూడు నుంచి ఆరు లక్షల రూపాయల ఆదాయం ఉన్న కుటుంబాలను తక్కువ ఆదాయ వర్గంగా (ఎల్ఐజీ), ఆరు నుండి పద్ధెనిమిది లక్షల రూపాయల ఆదాయం ఉన్న కుటుంబాలను మధ్య తరగతి ఆదాయ వర్గంగా (ఎంఐజీ)గా ప్రభుత్వం వర్గీకరించింది. ఆదాయాన్ని బట్టి గృహ నిర్మాణం కోసం రుణాలు అందజేస్తోంది. అందులో కొంత మొత్తాన్ని సబ్సిడీగా ఇస్తోంది.

లబ్దిదారుడి పైనే అధిక భారం

పీఎంఏవై-యూ పథకాన్ని ప్రారంభంలో 2015-16, 2021-22 ఆర్థిక సంవత్సరాల మధ్యకాలానికే పరిమితం చేశారు. ఇప్పుడు దానిని ఈ సంవత్సరం డిసెంబరు 31 వరకూ పొడిగించారు. గృహ నిర్మాణానికి అయ్యే వ్యయంలో కేంద్ర ప్రభుత్వం 24.4 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 16 శాతం భరిస్తాయి. మిగిలిన 59.6 శాతం ఖర్చును లబ్దిదారుడే భరించాల్సి ఉంటుంది. దీనిని బట్టి మొత్తం పెట్టుబడి వ్యయంలో కేంద్రం భరించేది పాతిక శాతం లోపేనని అర్థమవుతోంది. మరో మాటలో చెప్పాలంటే కేంద్రం వాటా రూ.2.03 లక్షల కోట్లు. లబ్దిదారుల పైన 60 శాతం లేదా రూ.4.95 లక్షల కోట్ల భారం పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1.33 లక్షల కోట్ల మొత్తాన్ని సమకూర్చాల్సి ఉంటుంది.

ప్రభుత్వ పాత్ర పరిమితమే

పీఎంఏవై-యూ వెబ్‌సైట్ ప్రకారం ఈ సంవత్సరం జనవరి 29 నాటికి 80.02 లక్షల ఇండ్ల నిర్మాణం పూర్తయింది. వీటిలో 3.41 లక్షల ఇండ్లను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జవహర్‌లాల్ నెహ్రూ అర్బన్ రెన్యువల్ మిషన్ కింద మంజూరు చేశారు. కచ్చా ఇంటిలో నివసిస్తూ పక్కా ఇల్లు నిర్మించుకుందామని అనుకునే వారిని ప్రభుత్వం బీఎల్‌సీ కేటగిరీ కింద చేర్చింది. ఇంటి నవీకరణకు రూ.10 లక్షల ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇందులో కేంద్ర సాయం రూ.1.5 లక్షలు మాత్రమే. ఈ కేటగిరీ కిందే అత్యధికంగా 62 శాతం ఇండ్లు మంజూరయ్యాయి. ఈ కేటగిరీ కింద నిర్మించే ఇండ్లలో ప్రభుత్వ పాత్ర చాలా పరిమితంగానే ఉంటుంది. నవీకరణ ఖర్చును లబ్దిదారునితో కలిసి పంచుకుంటే దాని బాధ్యత తీరిపోతుంది. జాగా కేటాయింపు, నిర్మాణం, వనరుల సమీకరణ వంటి విషయాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర ఏమీ ఉండదు. ఇక రుణంతో అనుసంధానించిన సబ్సిడీ పథకం (సీఎల్ఎస్ఎస్)లో గృహ రుణాల వడ్డీ రేటుపై కొంత సబ్సిడీ ఇస్తారు. ఈ పథకం కింద 21 శాతం మంది లబ్దిదారులు ఉన్నారు. ఇందులో కూడా ప్రభుత్వ పాత్ర పరిమితమే. మొత్తంగా చూస్తే భూమి ఉన్న వారికే ఇండ్లు నిర్మించి ఇస్తున్నారు. లేదా రుణం పొందేందుకు వారికి అర్హత అయినా ఉండాలి. మురికివాడల్లో నివసించే వారిని పక్కా ఇండ్లకు తరలించడం కూడా ఈ పథకంలో ఓ భాగమే. అయితే ఈ కేటగిరీ కింద కేవలం 2.5 శాతం లబ్దిదారులు మాత్రమే ఉన్నారు.

ఇండ్ల కొరత ఎక్కువే

పట్టణ ప్రాంతాల్లో మురికివాడల్లో నివసిస్తున్న వారు, పట్టణాలకు వలస వస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం దేశంలోని మురికివాడల్లో 2.42 కోట్ల మంది జీవనం సాగిస్తున్నారని అంచనా. అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుంటే ఈ ఏడాది చివరినాటికి పట్టణ ప్రాంతాల్లోని 3.18 కోట్ల కుటుంబాలకు గృహ వసతి అవసరం అవుతుంది. 2022 నాటికే పట్టణ ప్రాంతాల్లో 4.4 కోట్ల నుంచి 4.8 కోట్ల వరకూ ఇండ్ల కొరత ఉన్నదని ఓ అంచనా. వివిధ సర్వేలు, అంచనాలను విశ్లేషిస్తే ప్రస్తుతం పట్టణాల్లో 3.18 కోట్ల నుండి ఐదు కోట్ల వరకూ ఇండ్ల కొరత ఉంది.

రాష్ట్రాల వారీగా...

త్రిపుర, మిజోరం, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో ఇండ్ల కోసం ఎదురు చూస్తున్న పట్టణ పేదల సంఖ్య అధికంగా ఉంది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో 70 శాతం మందిని పథకంలో చేర్చారు. అసోం, ఉత్తరప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఒడిషా రాష్ట్రాల్లో సగం మంది మాత్రమే లబ్దిదారులుగా ఎంపికయ్యారు. ఇక రాజస్థాన్, బీహార్, కేరళ, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో అర్హత ఉన్న వారితో పోలిస్తే లబ్దిదారుల సంఖ్య బాగా తక్కువగా ఉంది. గృహ నిర్మాణాలను అత్యధికంగా పూర్తి చేసిన రాష్ట్రాల్లో గోవా, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాలైన డయ్యూ డామన్, ఢిల్లీ, చండీఘర్, పాండిచ్చేరిలోనూ ఇదే పరిస్థితి. యాభై శాతం ఇళ్ల నిర్మాణం పూర్తయిన రాష్ట్రాల్లో బీహార్, ఆంధ్రప్రదేశ్, మణిపూర్, మిజోరం, మేఘాలయ, సిక్కిం, అండమాన్ నికోబార్, జమ్మూకాశ్మీర్ ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాలు మాత్రం బాగా వెనుకబడ్డాయి.



రెండేండ్ల కాల పరిమితితో గుర్తింపు పత్రం ఇవ్వాలి

- ఎస్‌సీఈయూ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి

నవతెలంగాణ-గోదావరిఖని

రెండు సంవత్సరాల కాల పరిమితితో గుర్తింపు పత్రం ఇవ్వాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎస్‌సీఈయూ (సీఐటీయూ)) రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. సింగరేణి ఆర్జీ-1 జీడీకే 2వ ఇంక్లైన్‌లో నూతన ఫిట్ కమిటీ పరిచయ కార్యక్రమ సమావేశాన్ని ఆర్జీ-1 ఉపాధ్యక్షులు ఆసరి మహేష్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. సింగరేణిలో గుర్తింపు సంఘాల ఎన్నికలు జరిగి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు గుర్తింపు పత్రం ఇవ్వకపోవడం కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా పక్కదారి పట్టించడమేనని అన్నారు. గుర్తింపు పత్రం ఇవ్వకపోయినప్పటికీ గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఎర్రజెండానే కార్మికుల సమస్యల పరిష్కారానికి మార్గమని నమ్మిన కార్మికులు ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలిపిస్తే.. గుర్తింపు పత్రం తీసుకోకపోవడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వంతో సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, అనేక రకాలుగా విమర్శలు చేసిన మీరు ఈ రోజూ అదే పరిస్థితి ఉన్నా ప్రశ్నించకపోవడం కార్మికుల హక్కులను తాకట్టు పెట్టడటమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి ప్రభుత్వంతో పోరాడేందుకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్జీ-1 కార్యదర్శి మెండే శ్రీనివాస్, ఆరేపల్లి రాజమౌళి, ఆసరి మహేష్, కారం సత్తయ్య, పి.శ్రీనివాసరావు, వంగల రాములు, ఏ.శంకరన్న, పి.సమ్మయ్య, కే.కుమార్, భీమానాయక్, జనార్ధన్, టి.శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.



ఈ నెల 19 నుంచి 28 వరకు మోడల్ ఈఏపీసెట్

- 30న మోడల్ నీట్ పరీక్ష
- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, టి.నాగరాజు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఈ నెల 19 నుంచి 28 వరకు మోడల్ ఈఏపీసెట్, ఈ నెల 30న మోడల్ నీట్ పరీక్షలు నిర్వహించనున్నట్టు స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి, రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయంలో మోడల్ పరీక్షలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈఏపీసెట్‌ను ఆన్‌లైన్‌లో, నీట్‌ను ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామనీ, ఎంట్రీ ఫీజు వంద రూపాయలని తెలిపారు. ప్రతిఏటా విద్యావేత్త చుక్కారామయ్య, సీనియర్ ప్రొఫెసర్ల సౌజన్యంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పరీక్షలపై సరైన అవగాహన లేక గ్రామీణ ప్రాంత విద్యార్థులు మార్కులు కోల్పోతున్నారనీ, విద్యార్థుల్లో పోటీ పరీక్షల భయం పోగొట్టేందుకు, మానసిక స్థైర్యం పెంచేందుకు ఈ మోడల్ సెట్‌లు దోహదపడుతున్నాయని చెప్పారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి బహుమతులను అందజేస్తామనీ, మరిన్ని వివరాల కోసం 94900 98292, 82476 72658 నెంబర్లను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. ఎంసెట్, జేఈఈ, నీట్ కోచింగ్‌ల పేరుతో ప్రయివేటు సంస్థలు దందా చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం తనకేం పట్టనట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్పొరేట్ కాలేజీలు ప్రత్యేక క్యాంపస్‌లు పెట్టి లక్షలాది రూపాయలను విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నాయని చెప్పారు. ఇలాంటి కాలేజీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు అచ్చిన లెనిన్, కార్యదర్శి ఎం. అశోక్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు జానుగరి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ కుప్ప కూలడం ఖాయం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ- గజ్వేల్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కుప్పకూలిపోవడం ఖాయమని, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని శోభా గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీజేపీ పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ఈ ఎన్నికల్లో బీజేపీ ప్రజలు తగిన బుద్ధి చెప్పి ఇంటికి పంపిస్తారని అన్నారు. మోడీ పదేండ్ల పాలనలో నిరుద్యోగం, దారిద్ర్యం, ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. పేదలపై భారాలు మోపి కార్పొరేట్లకు లాభాలు చేకూర్చడం తప్ప బీజేపీ పాలనలో చేసిందేమీలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతాన్ని రాజకీయాలకు వాడుకోవడం ద్వారా లబ్దిపొందాలని చూస్తున్న బీజేపీ కుట్రల్ని దేశ ప్రజలు అర్థం చేసుకుని తగిన గుణపాఠం నేర్పబోతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారని అన్నారు. రాష్ట్రంలో 14 పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలిపించుకుంటుందని స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, కేసీఆర్‌కు వచ్చిన మెజార్టీ కన్నా ఒక్క ఓటు తనకు ఎక్కువ ఇవ్వాలని కోరారు. తాను గెలిస్తే గజ్వేల్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెడతానని చెప్పారు. జిల్లా మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యేలు నర్సారెడ్డి, మైనంపల్లి హనుమంతరావు కొండంత అండగా ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మల్లన్న సాగర్, కొండపోచమ్మ జలాశయంలో ఇక్కడ ప్రాంత ప్రజలను ముంచిన వ్యక్తి అని అన్నారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ.. సిద్దిపేట, గజ్వేల్ తనకు రెండు కండ్లు లాంటివని, ఈ రెండు నియోజకవర్గాల్లో పార్లమెంట్ ఎన్నికల తర్వాత విస్తృతంగా పర్యటించి కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. నర్సారెడ్డి, తాను గజ్వేల్ నియోజకవర్గంలో ప్రత్యేక ట్రస్టు ద్వారా పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో మెదక్ పార్లమెంటు ఇన్‌చార్జి ప్రమోద్ కుమార్, దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నాయిని యాదగిరి, సర్దార్ ఖాన్, నరేందర్ రెడ్డి, నక్క రాములు గౌడ్, సురేష్, అజ్గర్, తదితరులు పాల్గొన్నారు.

మనువాదాన్ని ఓడిద్దాం..! రాజ్యాంగాన్ని గెలిపిద్దాం..!

- అంబేద్కర్, ఫూలే స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకుందాం
- సీఐటీయూ ఆధ్వర్యంలో సహపంక్తి భోజనాలు



నవతెలంగాణ-సంగారెడ్డి

మహనీయులు.. ఏప్రిల్ 6న కార్మికోద్యమ నేత బీటీ రణదివే జయంతి, ఏప్రిల్ 11న సామాజికవేత్త మహాత్మా జ్యోతిబాపూలే జయంతితో పాటు ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని.. ఏప్రిల్ 6 నుంచి 14వ తేదీ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ వారోత్సవాలు నిర్వహిస్తున్న విషయం విధితమే. అందులో భాగంగా శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో కులమతాలకతీతంగా సహపంక్తి భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జీ.జయరాజు, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.మాణిక్యం పాల్గొని మాట్లాడారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల వివక్షను అంతం చేయకుండా సామాజిక న్యాయం సాధ్యం కాదన్నారు. పాలకుల విధానాలు కుల వివక్షను పెంచేలా ఉన్నాయని తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మనువాద విధానాలతో కార్మిక వర్గానికి తీవ్రం నష్టం వాటిల్లుతోందని, వారి ఐక్యతను దెబ్బతీస్తున్నదని ఆరోపించారు. నేటికీ కులం పేరుతో అవమానాలు, దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంపై మనువాదులు దాడి చేస్తున్నారన్నారు. మనువాదాన్ని ఓడించి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్మిక వర్గ హక్కుల కోసం పోరాటం చేస్తూనే సమాజంలో నెలకొన్న దుర్మార్గమైన కుల వివక్షను అంతమొందించేందుకు సీఐటీయూ కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ భారత దేశంలో మాత్రమే ఉన్నదన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి మాట్లాడుతూ.. శ్రమ దోపిడీతోపాటు సామాజిక దోపిడీ కూడా కొనసాగుతున్నదన్నారు. మహనీయులు అంబేద్కర్, ఫూలే, బీటీ రణదివేల స్ఫూర్తితో కుల వివక్షను కూకటి వేళ్లతో పెకిలించాలన్నారు. కార్మికవర్గాన్ని ఐక్యం చేస్తూ కార్మికుల హక్కుల కోసం పోరాడుతూనే, సమాజంలో నెలకొన్న కుల వివక్షను అంతం చేయడంలో భాగంగానే సహపంక్తి భోజనాలను ప్రతియేడు మహనీయుల మాసంలో నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సువర్ణ, రాజు, యాదగిరి, నర్సింలు, సుగుణ, నరసమ్మ, యాదయ్య, దత్తు, శోభ, రాజేష్, లక్ష్మణ్ మల్లేశం, రాజేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లష్కర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- కాంగ్రెస్ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్
- మతతత్వ బీజేపీకి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి : వీహెచ్
- ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తి దానం : డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేసి పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో తనను గెలిపించి లష్కర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని చే నెంబర్ చౌరస్తాలోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రోహిన్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. బీజేపీ మత రాజకీయాలు చేస్తున్నదని, ఆ పార్టీ అభ్యర్థి కిషన్ రెడ్డికి పార్లమెంట్ ఎన్నికల్లో కనీసం డిపాజిట్ కూడా దక్కదని అన్నారు. కేంద్ర మంత్రిగా అంబర్‌పేట నియోజకవర్గానికి ఒక పైసా కూడా ఖర్చు చేయలేదని తెలిపారు. ఐదు సంవత్సరాలు గడిచిపోయినా అంబర్‌పేట ఫ్లైఓవర్ పనులు పూర్తి కాకపోవడం సిగ్గుచేటన్నారు. గతంలో కొన్ని పరిస్థితుల వల్ల తాను పార్టీ మారానని.. మళ్లీ సొంత గూటికి తిరిగి రావడంతో పక్షికి రెక్కలు వచ్చిన విధంగా ఉందన్నారు. ప్రతి కార్యకర్త ప్రతి రోజూ 50 మంది ఓటర్లను కలిసి కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను వివరించి వారిని చైతన్యం చేయాలని తెలిపారు. బీఆర్ఎస్ తనపై కోర్టులో కేసు వేసిందని, దానికి సమయం వచ్చినప్పుడు కోర్టులోనే సమాధానం చెప్తానని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు సరైన సమయంలో అవకాశాలు కల్పిస్తామన్నారు. మాజీ పీసీసీ అధ్యక్షులు వి. హనుమంతరావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అవినీతి ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తే నిజమైన కాంగ్రెస్ వారికి అన్యాయం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని శాఖల్లో అవినీతి జరిగిందని ఆరోపించారు. నయీం ఆస్తుల విషయంలో పోలీసులతో బీఆర్ఎస్ కుమ్మక్కై కొట్టేసిందని, వాటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మతతత్వ బీజేపీకి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని, దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. డాక్టర్ రోహిన్ రెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడానికి తెలంగాణ నుంచి కనీసం 14 సీట్లు గెలవాలన్నారు. ఐదేండ్లు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి.. బీజేపీ కార్యకర్తలకూ సహాయం చేయని దౌర్భాగ్యస్థితిలో ఉన్నారని విమర్శించారు. బీఆర్ఎస్ త్వరలోనే ఖాళీ అవుతుందని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తి దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, డీసీసీ మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ, మాజీ కార్పొరేటర్లు దిద్ది రాంబాబు, గరిగంటి శ్రీదేవి రమేష్, పులి జగన్, జ్ఞానేశ్వర్ గౌడ్, నారాయణస్వామి, సీనియర్ నాయకులు తోలుపునూరి కృష్ణ గౌడ్, లక్ష్మణ్, శంభుల శ్రీకాంత్ గౌడ్, లక్ పతి యాదగిరి గౌడ్, పోలినేని రామ్మోహన్ రావు తదితర నాయకులు పాల్గొన్నారు.

బెయిలివ్వండి

- ఎన్నికల ప్రచారానికి వెళ్లాలి
- ఢిల్లీ కోర్టులో మనీశ్ సిసోడియా పిటిషన్


(ఫైల్)

న్యూఢిల్లీ: ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆప్ కీలక నాయకుడు మనీశ్ సిసోడియా మరోసారి ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు. ఎన్నికల్లో తమ పార్టీ తరఫున ప్రచారానికి వెళ్లేందుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. సిసోడియా పిటిషన్‌ను స్వీకరించిన సీబీఐ, ఈడీ ప్రత్యేక కోర్టు.. దర్యాప్తు సంస్థలకు నోటీసులు జారీ చేసింది. ఆయన అభ్యర్థనపై స్పందనలు తెలియజేయాలని ఆదేశించింది. అనంతరం బెయిల్ పిటిషన్ విచారణను న్యాయస్థానం ఈనెల 20కి వాయిదా వేసింది. ఢిల్లీలోని మద్యం స్కాంకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో గతేడాది ఫిబ్రవరి 26న సీబీఐ అధికారులు సిసోడియాను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సైతం ఆయనను కస్టడీలోకి తీసుకున్నది. అప్పటి నుంచి ఆయన తీహార్ జైల్లో ఉన్నారు. ఈ కేసుల్లో బెయిల్ కోరుతూ ఆయన పలుమార్లు పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ న్యాయస్థానాల్లో ఊరట లభించలేదు. కాగా, ఇదే కేసులో ఆప్ నేత ఎంపీ సంజయ్‌సింగ్‌కు బెయిల్ లభించటం, ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు రావటంతో బెయిల్ లభించొచ్చనే ఆశలో మనీశ్ ఉన్నట్టు తెలుస్తున్నది.

రాష్ట్రపతి పాలనకు బీజేపీ కుట్ర

- ఢిల్లీ ప్రభుత్వాన్ని అస్థిరపర్చే ప్రయత్నాలు : ఆప్ మంత్రి అతిశి ఆగ్రహం

న్యూఢిల్లీ: ఢిల్లీలో ప్రభుత్వాన్ని అస్థిరపర్చి, రాష్ట్రపతి పాలన విధించేందుకు బీజేపీ కుట్ర పన్నుతున్నదని ఆప్ ఆరోపించింది. ఈ మేరకు బీజేపీపై ఆప్ మంత్రి అతిశి ఆగ్రహం వ్యక్తం చేశారు. విశ్వసనీయ వర్గాల ద్వారా ఈ విషయం తమకు తెలిసిందన్నారు. "ఢిల్లీలో ఆప్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు రంగం సిద్ధమైంది. ఇందు కోసం కుట్రలు జరుగుతున్నాయి. ఎలాంటి ఆధారాలు లేకుండా కేజ్రీవాల్‌ను తప్పుడు కేసులో అరెస్టు చేశారు. గతంలోని అనుభవాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి.

వలు విభాగాల్లో ఖాళీలు ఉన్నప్పటికీ.. అధికారులను కేటాయించటం లేదు. ఎన్నికల తేదీలు ప్రకటించిన నాటి నుంచి అధికారులు సమావేశాలకు హాజరుకావటం మానేశారు. ఈ కుట్రలో భాగంగానే సీఎం వ్యక్తిగత కార్యదర్శి (పీఎస్)ని పదవి నుంచి తొలగించారు. రానున్న రోజుల్లో దేశ రాజధానిలో రాష్ట్రపతి పాలన విధించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది" అని ఆమె అన్నారు. లిక్కర్ స్కాం కేసులో సీఎం కేజ్రీవాల్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆప్ నేతలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. మోడీ సర్కారు కేంద్ర ఏజెన్సీ సంస్థలను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తున్నదనీ, ప్రతిపక్ష నేతలను ఉద్దేశపూర్వకంగానే ఇబ్బందులు పెడుతున్నదని ఆరోపిస్తున్నారు.

బీఆర్ఎస్ సోషల్ మీడియా సమన్వయకర్తల నియామకం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా సమన్వయకర్తలను నియమిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గానికి అభిలాష్ రావు రంగినేని, మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజకవర్గానికి ఆశాప్రియ ముదిరాజ్‌ను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కో ఆర్డినేటర్లుగా నియమించారు.

చికెన్ ధరలు హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 146
రిటైల్ (లైవ్)	రూ. 168
స్కిన్‌తో	రూ. 244
స్కిన్‌లెస్	రూ. 277

హైదరాబాద్‌లో.. బంగారం ధరలు

(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	73,310	▲ 1090
22 క్యారెట్లు	67,200	▲ 100
కిలో వెండి	90,200	▲ 1500

బిజినెస్

టీసీఎస్‌లో భారీగా తగ్గిన ఉద్యోగులు

- గతేదాది 13వేల మందికి కోత..!
- క్యూ4లో రూ.12,435 కోట్ల లాభాలు



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ఐటి కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్)లో ఉద్యోగుల సంఖ్య తగ్గింది. 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో 1,759 ఉద్యోగులు తగ్గారు. గడిచిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఉద్యోగుల్లో 13,249 మంది మేర తగ్గారు. ఆ మొత్తం మంది మానేశారా..? లేకా తొలగించారా అనేది స్పష్టత లేదు. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగుల సంఖ్య నికరంగా 22,600 పెరగడం విశేషం. తాజా గణాంకాల ప్రకారం మార్చి 31 నాటికి టిసిఎస్‌లో 6,01,546 మంది ఉద్యోగులున్నారు. మొత్తం సిబ్బందిలో 35.6 శాతం మహిళలు కాగా.. 152 దేశాలకు చెందినవారు ఉన్నారని టిసిఎస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సిఒఒ) ఎన్ గణపతి సుబ్రమణియన్ తెలిపారు. ఉద్యోగుల వలసల రేటు 12.5 శాతానికి తగ్గిందని టిసిఎస్ చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మెరుగైన పనితీరు కనబరిచిన వారికి రెండంకెల ఇంక్రిమెంట్ ఉంటుందని ఆయన వెల్లడించారు. గతేడాది కొత్త నియామకాలు 6,333కు తగ్గాయి. నాలుగో త్రైమాసికంలో కేవలం 821 మంది కొత్త ఉద్యోగులను మాత్రమే తీసుకుంది.

గడిచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో టిసిఎస్ నికర లాభాలు 9 శాతం పెరిగి రూ.12,434 కోట్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది క్యూ4లో రూ.11,058 కోట్ల లాభాలు నమోదయ్యాయి. ఇదే సమయంలో రూ.59,162 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ4లో రూ.61,237 కోట్లకు చేరింది. తుది డివిడెండ్ కింద ప్రతీ షేర్‌పై రూ.28 చెల్లించడానికి ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. గడిచిన త్రైమాసికంలో తమ కంపెనీ మెరుగైన ప్రగతిని కనబర్చిందని గణపతి సుబ్రమణియన్ అన్నారు. వర్థమాన మార్కెట్ల వృద్ధి మరింత పటిష్టతను పెంచిందన్నారు. శుక్రవారం బిఎస్ఇలో టిసిఎస్ షేర్ విలువ 0.45 శాతం పెరిగి రూ.4,000.30 వద్ద ముగిసింది.

మార్చిలో 4.85 శాతంగా రిటైల్ ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ : ఈ ఏడాది మార్చిలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ) 4.85 శాతంగా నమోదయ్యిందని కేంద్ర గణంకాల శాఖ తెలిపింది. ఇంతక్రితం మాసం ఫిబ్రవరిలో 5.09 శాతంగా ఉందని పేర్కొంది. గడిచిన నెలలో పట్టణ సిపిఐ 4.14 శాతంగా, గ్రామీణ ద్రవ్యోల్బణం 5.45 శాతంగా నమోదయ్యింది. ఆహార ద్రవ్యోల్బణం 8.66 నుంచి 8.52 శాతానికి దిగి వచ్చింది. దేశంలో ద్రవ్యోల్బణం తగ్గుతున్నప్పటికీ.. ఇప్పటికీ నిర్దేశిత 4 శాతం ఎగువనే నమోదవుతోందని ఇటీవల ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. రెండేండ్ల క్రితం 2022 ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 7.8 శాతం గరిష్టానికి ఎగిసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సాధారణ వర్షపాతం నమోదైతే రిటైల్ ద్రవ్యోల్బణం 4.5 శాతంగా ఉండొచ్చని ఆర్‌బిఐ అంచనా వేసింది.

ఎఐతో వారానికి మూడు పని దినాలే

- బిల్‌గేట్స్ అంచనా



న్యూఢిల్లీ : కృత్రిమ మేధా (ఎఐ)తో మనుషుల పనులు సులభతరం అవుతాయని మైక్రోసాఫ్ట్ అధిపతి బిల్‌గేట్స్ అన్నారు. పని గంటలు కూడా తగ్గుతాయన్నారు. అధునాతన టెక్నాలజీతో వారానికి మూడు పనిదినాల విధానం అందుబాటులోకి రావొచ్చన్నారు. మైక్రోసాఫ్ట్ ఎఐ ప్రాజెక్టులకు సారథ్యం వహిస్తున్న బిల్‌గేట్స్ ఎఐతో సమూల మార్పులు రానున్నాయని పేర్కొన్నారు. కార్పొరేట్ ప్రపంచంలో ఎఐ కీలక మార్పులకు దారితీయనుందన్నారు. దశాబ్దాలుగా అనుసరిస్తున్న వారానికి ఐదు పని దినాల పద్ధతికి ఎఐతో స్వస్తి పలికే అవకాశం ఉందన్నారు. వారానికి మూడు రోజులు మాత్రమే పనిచేసే సమాజంలోకి మనం మారితే అది ఆమోదయోగ్యమేనని అన్నారు. ఇక మరో ఐదేళ్లలో ఎఐ మానవ మేథస్సును అధిగమిస్తుందని ట్విట్టర్ అధిపతి ఎలన్ మస్క్ అంచనా వేశారు. వచ్చే ఏడాది నుంచే మానవుడి కంటే ఎఐ తెలివిగా వ్యవహరించడం ప్రారంభిస్తుందని ట్వీట్ చేశారు. కాగా.. మస్క్ అభిప్రాయంతో మెటా చీఫ్ ఎఐ సైంటిస్ట్ యాన్ లికున్ విభేదించారు. ఎఐ మానవుల కంటే తెలివి మీరబోదని విశ్లేషించారు.

సెన్సెక్స్ 800 పాయింట్ల పతనం



ముంబయి : అంతర్జాతీయ ప్రతికూల పరిణామాలతో దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో భారీ నష్టాలు చవి చూశాయి. ముఖ్యంగా అమెరికాలో అంచనాలు మించి ద్రవ్యోల్బణం నమోదయ్యిందనే వార్తలు సూచీల్లో ప్రతికూలతను పెంచాయి. ప్రస్తుత ఏడాదిలో మూడు సార్లు వడ్డీ రేట్లు తగ్గింపు ఉంటుందన్న ఆశలను ద్రవ్యోల్బణ గణాంకాలు నీరుగార్చాయి. అదే విధంగా పెరిగిన చమురు ధరలు మదుపర్ల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఈ పరిణామాలతో శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ ఉదయం 74,890 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం ఒత్తిడిలోనే కొనసాగింది. మధ్యాహ్నం తర్వాత అమ్మకాలు వెల్లువెత్తడంతో తుదకు 793 పాయింట్లు పతనమై 74,245 వద్ద ముగిసింది. నిఫ్టీ 234.40 పాయింట్ల నష్టంతో 22,519 పాయింట్లకు జారింది. సెన్సెక్స్‌లో టాటా మోటార్స్, టిసిఎస్, నెస్లే ఇండియా మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి.

ఫిబ్రవరిలో ఐఐపీ 5.7 శాతం

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాదిలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి)5.7 శాతానికి పెరిగిందని గణంకాల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇంతక్రితం జనవరిలో 3.8 శాతంగా చోటు చేసుకుంది. 2023 ఇదే ఫిబ్రవరిలో 6 శాతం వృద్ధి నమోదయ్యింది. 2023 అక్టోబర్‌లో రికార్డ్ స్థాయిలో 11.9 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. 2023-24 ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి కాలంలో పారిశ్రామికోత్పత్తి సూచీ 5.9 శాతానికి చేరింది. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో 5.6 శాతం పెరుగుదల చోటు చేసుకుంది.

బంగారం @ రూ.75వేలు..!

- కొనడం కష్టమే..



న్యూఢిల్లీ : బంగారం ధర రాకెట్ కంటే వేగంగా పెరుగుతోంది. సామాన్యుడు కొనలేని స్థాయికి చేరింది. పది గ్రాముల బంగారం ధర పన్నులతో కలుపుకుని ఏకంగా రూ.75వేల మార్క్‌ను తాకింది. ఒక్క పూటలోనే వెయ్యి రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ ప్రకారం.. శుక్రవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.1,090 పెరిగి రూ.73,310కు చేరింది. 22 క్యారెట్ల ధర రూ.1,000 ఎగిసి రూ.67,200 వద్ద నమోదయ్యింది. దీనికి 3 శాతం జిఎస్‌టి అదనం. కిలో వెండిపై రూ.1,500 పెరిగి రూ.86,,500గా నమోదయ్యింది.

అంతర్జాతీయంగా పసిడికి గిరాకీ పెరగడంతో ధరలు ఎగుస్తున్నాయని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు (32 గ్రాములు) బంగారం ధర 2,388 డాలర్ల వద్ద నమోదవుతోంది. సిరియాలోని తమ రాయబార కార్యాలయంపై దాడికి ప్రతీకారంగా ఎప్పుడైనా ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి చేయొచ్చన్న వార్తలు పసిడికి మరింత డిమాండ్‌ను పెంచింది.

పది విద్యార్థులకు 'ప్రయివేటు' గాలం

సీటు రిజర్వ్ చేసుకుంటే 20నుంచి 30 శాతం రాయితీ

- విద్యార్థులను చేర్పించాలని అధ్యాపకులపై ఒత్తిడి
- టార్గెట్ పూర్తిచేస్తే.. అదనపు వేతనం, : ఉద్యోగం పదిలమంటూ ఆఫర్
- విద్యార్థుల పేరెంట్స్‌ను ఆకర్షించేందుకు కొన్ని కాలేజీల్లో పీఆర్వోల నియామకం



నవతెలంగాణ-సిటీబ్యూరో

'సార్ మీ ఇంట్లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న పిల్లలున్నారా? ఉంటే మా కాలేజీలో చేర్పించండి. ఫలితాలు వచ్చిన తర్వాత అయితే ఫీజు ఎక్కువగా ఉంటుంది. ముందే రిజర్వు చేసుకుంటే ఫీజులో 25 నుంచి 30 శాతం రాయితీ లభిస్తుంది. ఎంసెట్, నీట్‌లో ఉచిత శిక్షణ ఇస్తాం..' పదోతరగతి పరీక్షలు రాసిన తల్లిదండ్రులకు ప్రయివేటు, కార్పొరేట్ ఇంటర్మీడియట్ కాలేజీల పీఆర్‌వోలు, అధ్యాపకులు ఇస్తున్న ఆఫర్ ఇది.

పదోతరగతి వార్షిక పరీక్షలు మార్చి 18 ప్రారంభమై.. ఈనెల 2న ముగిసిన విషయం తెలిసిందే. వాస్తవానికి టెన్త్ పరీక్షలు ప్రారంభం కాకముందు నుంచే పలు కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల వేట ప్రారంభించాయి. ఇందుకోసం కొన్ని కాలేజీలు ప్రత్యేకంగా పీఆర్‌వోలను నియమించుకోగా, ఇంకొన్ని కాలేజీలు విద్యార్థులను చేర్పించే బాధ్యతను ఇప్పటి వరకు ఆయా కాలేజీల్లో పనిస్తున్న అధ్యాపకులకు అప్పగించాయి. విద్యార్థులను చేర్పించే విషయంలో ఒక్కొక్కరికీ ఒక్కోరకమైన టార్గెట్ ఇచ్చినట్టు తెలిసింది. టార్గెట్ పూర్తి చేసిన వారికే వేతన పెంపు, కొలువు పదిలంగా ఉంటుందని భరోసా కల్పిస్తున్నాయి. ఇంటర్ పరీక్షలు పూర్తి అయిపోయినా అధ్యాపకులకు ఆయా కళాశాలలు సెలవులు ఇవ్వలేదు. పదో తరగతి పరీక్షలు పూర్తి చేసిన విద్యార్థుల ఇండ్లకు అధ్యాపకులు వెళ్లి వారిని ఆకర్షించే పనిలో పడ్డారు. కాలనీలు, బస్తీలు, అపార్టుమెంట్లు తిరుగుతున్నారు. గ్రేటర్‌లోని పలు జూనియర్ కళాశాలల్లో పనిచేసే ఉద్యోగులు, అధ్యాపకులు ఇదే పనిలో నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో గురుకుల జూనియర్ కళాశాలలకు ఉన్న డిమాండ్ రీత్యా ప్రయివేట్ కాలేజీల యాజమాన్యాలు ముందుగానే ఫీజు డిస్కౌంట్లు.. పలు ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా చాలా కాలేజీలు ఇవే చేస్తున్నాయి. పక్క రాష్ట్రాల కాలేజీల యాజమాన్యాలు కూడా ఇక్కడ ప్రచారం చేయడం గమనార్హం. పెద్ద కాలేజీలు అయితే డిసెంబర్ నుంచీ ఇదే పనిలో ఉన్నాయి.

ఆకర్షయణీయంగా.. ఆకట్టుకునేలా..

ప్రయివేట్ కాలేజీలు విద్యార్థులను ఆకర్షించేందుకు తమ కాలేజీలను అందంగా.. ఆకర్షణీయంగా సిద్ధం చేస్తున్నాయి. అలాగే నగర శివారు ప్రాంతాల్లో మైదానాలు ఉన్నాయని అందులో పేర్కొంటున్నాయి. పదో తరగతి చదివే పిల్లల జాబితాలను, ఫోన్ నెంబర్లు సేకరించి వారి ఇండ్లకు మధ్యవర్తులను, దళారులను పంపి ఆఫర్లతో ఆకర్షిస్తున్నారు.

చేరే వరకే డిస్కౌంట్లు.. ఆ తర్వాత అంతే

హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో పలు కళాశాలలు ఫీజుల మోత మోగిస్తున్నాయి. ఇంటర్‌లో చేరేటప్పుడు ఫీజులో 20 శాతం నుంచి 30 శాతం రాయితీ ఇస్తున్నారు. పదిలో మార్కుల ఆధారంగా రాయితీ మరింత పెరుగుతుందని చెబుతున్నారు. కానీ విద్యార్థి సదరు కళాశాలలో చేరిన తర్వాత ఏడాది పూర్తి ఫీజును ఏదో ఒక రూపంలో వసూలు చేస్తారిన పలువురు అంటున్నారు. ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్ అంటూ అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారు. ఒక్కసారి విద్యార్థులు ఆయా కళాశాలల్లో చేరాక ఏదో రూపంలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా.. పట్టించుకునే వారు లేకుండాపోతున్నారని విద్యార్థి సంఘాలు అంటున్నాయి.

కాలేజీల ప్రలోభాలకు తల్లిదండ్రులు గురికావొద్దు - దాసరి ఒడ్డెన్న, డీఐఈవో, హైదరాబాద్

విద్యార్థులు తల్లిదండ్రులు ప్రయివేట్ కాలేజీల మాయమాటలకు, ప్రలోభాలకు గురికావొద్దు. టెన్త్ పరీక్షల ఫలితాలు వచ్చాకే.. కళాశాలల్లో అడ్మిషన్ తీసుకోవాలి. ఫలితాలు వెల్లడి తర్వాత అనుమతులున్న కాలేజీల జాబితాను ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో ఉంచుతాం. ఏ కాలేజీలో ఏ విధమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయనే వివరాలు పొందుపరుస్తాం. వాటన్నింటినీ పరిశీలించిన తర్వాతే అడ్మిషన్ తీసుకోవాలి. కాలేజీలు చెప్పే మాటలు నమ్మి తల్లిదండ్రులు ముందే డబ్బులు కట్టి మోసపోవద్దు.

టెన్త్ ఫలితాలు రాకముందే కాలేజీల అడ్మిషన్‌ల దందా - కె. ఆశోక్ రెడ్డి, కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ, హైదరాబాద్

పదో తరగతి పరీక్షల ఫలితాలు రాకముందే ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్ల పేరుతో అప్పుడే దందా షురూ చేశారు. పీఆర్వోలను పెట్టి ముందే అడ్మిషన్లు తీసుకుంటే రాయితీ ఇస్తామని.. రిజల్ట్ వచ్చిన తర్వాత అడ్మిషన్ తీసుకుంటే ఎక్కువ ఫీజులు చెల్లించాల్సి వస్తుందని చెబుతున్నాయి. ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం టెన్త్ క్లాస్ పరీక్షలు ఫలితాలు వచ్చిన తర్వాత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. నగరంలో కొన్ని ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలలు ఇప్పటికే 90శాతం అడ్మిషన్లు నిండిపోయాయని బోర్డు పెడుతున్నాయి. ఆ కాలేజీలపై ఇంటర్ బోర్డు తక్షణమే చర్యలు తీసుకోవాలి. ధనార్జనే లక్ష్యంగా పనిచేసే కాలేజీల ఉచ్చులో తల్లిదండ్రులు పడొద్దు. ఇంటర్ బోర్డు అనుమతులు ఉన్నా కళాశాలల్లోనే అడ్మిషన్లు తీసుకోవాలి.

జర్నలిస్టుల జీవితాలు ఆందోళనకరం

- తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి
- యువ ఫొటో జర్నలిస్టు నర్రె రాజేష్ సంస్మరణ సభ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

వృత్తిలో సవాళ్లు, విపరీతమైన పని ఒత్తిడి, సమయ పరిమితులు, తక్కువ వేతనాలతో జర్నలిస్టుల జీవితాలు ఆందోళనకరంగా మారుతున్నాయని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. యువ ఫొటో జర్నలిస్టు నర్రె రాజేష్ 41 ఏండ్ల వయస్సులో మన మధ్య నుంచి ఆకస్మికంగా అదృశ్యం కావడం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన నర్రె రాజేష్ సంస్మరణ సభను శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు అనుమళ్ల గంగాధర్ అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సభలో కె.శ్రీనివాస్ రెడ్డితో పాటు రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.విరహత్ అలీ, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ప్రధాన కార్యదర్శి శిగా శంకర్ గౌడ్, నర్రె రాజేష్ సతీమణి లావణ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్రె రాజేష్ కుటుంబానికి లక్ష రూపాయల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు.

అనంతరం కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పత్రికల్లో వార్తలకు సాక్ష్యంగా నిలిచేది ఫొటోలేనని, ఆందోళనలు, హింసాత్మక సంఘటనలు తమ కెమెరాల్లో బంధించడానికి ఫొటో, వీడియో జర్నలిస్టులు పడే తిప్పలు వర్ణనాతీతమన్నారు. వారు ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటూ వారి చుట్టూ ఉన్న కఠినమైన వాస్తవ చిత్రాలు ప్రపంచం ముందుంచేందుకు ప్రయత్నిస్తారని తెలిపారు. హింసాత్మక సంఘటనలు చిత్రించే సమయంలో మరణించడం, గాయాలవడంతో పాటు వృత్తి ఒత్తిడితో ఫొటో జర్నలిస్టుల ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని అన్నారు. నర్రె రాజేష్ ఎంతో బాధ్యతగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించారని కొనియాడారు.

మీడియాకు ఫొటో జర్నలిస్టులు కండ్లు, చెవుల లాంటి వారన్నారు. పాత్రికేయ వృత్తి అభద్రతా, అత్యంత ప్రమాదకరమైనటు వంటిదని ప్రజాస్వామిక దేశాలకు ఐక్యరాజ్య సమితి ఎప్పుడో సూచించిందని గుర్తు చేశారు. ఫొటో, వీడియో జర్నలిస్టుల ఆరోగ్య భద్రతపై మీడియా సంస్థల యాజమాన్యాలు దృష్టి సారించాలని సూచించారు. నర్రె రాజేష్ భార్యకు పెన్షన్‌తో పాటు ఆయన పిల్లలకు విద్యనందించడానికి మీడియా అకాడమీ సహాయం అందజేస్తుందన్నారు. కె.విరాహత్ అలీ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో లాఠీలను, తూటాలను, కేసులను లెక్కచేయకుండా ఫొటో జర్నలిస్టులు పోషించిన సాహసవంతమైన పాత్ర అభినందనీయమన్నారు. ఫొటో, వీడియో జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు తమ సంఘం నాటి నుండి నేటి వరకు అహర్నిశలు కృషి చేస్తోంద న్నారు. ఎప్పుడూ చిరునవ్వుతో పలకరించే రాజేష్ ఆకస్మిక మృతి తమను ఎంతో కలచివేసిందని, అతని కుటుంబానికి చేయూతనిస్తామని పేర్కొన్నారు. హెచ్‌యూజే అధ్యక్షులు శిగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ .. నర్రె రాజేష్ మృతితో తమ సంఘం క్రియాశీలక సభ్యుడిని కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, జేఎన్‌జేహెచ్ఎస్ అధ్యక్షులు బొమ్మగాని కిరణ్ కుమార్, అనిల్, అధిక సంఖ్యలో ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

మాదిగలకు కాంగ్రెస్ అన్యాయం

- దామోదరకు మంత్రి వర్గంలో విలువ లేదు
- విలేకర్ల సమావేశంలో మందకృష్ణ మాదిగ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మాదిగలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోందని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో మూడు రిజర్వ్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్కటి కూడా మాదిగలకు కేటాయించకపోవటమేంటని ప్రశ్నించారు. కడియం కావ్యకు టికెట్ ఎలా ఇస్తారని నిలదీశారు.

మాదిగలకు అన్యాయం చేస్తే ఆ పార్టీని బొందపెడతామని హెచ్చరించారు. ఇప్పటికైనా అభ్యర్థులను మార్చాలని డిమాండ్ చేశారు. లేదంటే 17నుంచి కాంగ్రెస్ గోబ్యాక్ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు.

గాలి బీభత్సం.. భారీ వర్షం..

- రోడ్డు పాలైన మక్కలు. ఆందోళనలో రైతులు : పిడుగుపాటుకు మహిళ మృతి



నవతెలంగాణ -మహబూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి/ తిమ్మాజిపేట/ ఉప్పునుంతల

ఈదురు గాలులు, భారీ వర్షాలతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీభత్సం సృష్టించింది. అక్కడక్కడ కురిసిన వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చేతికొచ్చిన మొక్కజొన్న నీళ్ల పాలయింది. వరి, మామిడి రైతులు భారీగా నష్ట పోతున్నారు. తిమ్మాజీపట మండలం నేరళ్లపల్లిలో కురిసిన భారీ వర్షానికి 100 క్వింటాళ్ల మొక్కలు నీటిపాలయ్యాయి. వరి, మామిడి రైతులు విలవిలలాడుతున్నారు. ఈదురు గాలులకు తిమ్మాజిపేట, అచ్చంపేట ప్రాంతాల్లో ఉన్న మామిడి తోటల్లో కాయలు నేలపాలయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలో వివిధ గ్రామాల్లో శుక్రవారం కురిసిన వర్షానికి అక్కడక్కడ కల్లాల్లో, రోడ్లపై ఆరబెట్టిన వరి, మొక్కజొన్న పంట తడిసి ముద్దయ్యాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం అందించాలని సీపీఐ(ఎం) నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. పిడుగుపాటులో మరణించిన శ్యామలమ్మ కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం అందివ్వాలని కోరారు.

కొట్టుకుపోయిన మొక్కజొన్న

మారేపల్లి గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డి రెండు ఎకరాలు మొక్కజొన్న సాగు చేయగా 80 క్వింటాల వరకు పంట పండింది. దీంతో అతను రెండు రోజులుగా మారేపల్లి - నేరాలపల్లి గ్రామాల మధ్యలో ఉన్న రహదారిపై మొక్కజొన్నను ఆరబెట్టగా శుక్రవారం కురిసిన వర్షానికి మొత్తం కొట్టుకుపోయింది. ఆరుగాలం కష్టపడి పంట చేతికి రావడంతో వర్షానికి కొట్టుకపోవడంతో రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పిడుగు పడి మహిళ మృతి

నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం తాడూర్ గ్రామానికి చెందిన చెందిన మహిళా రైతు గుండమోని శ్యామలమ్మ (34) శుక్రవారం తన వ్యవసాయ పొలంలో పశువులకు నీరు తాపుతుండగా సాయంత్రం నాలుగు గంటల సమయంలో పడిన పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. శ్యామలమ్మకు భర్త పర్వతాలు, ముగ్గురు కుమారులు అశోక్, నరేష్, యశ్వంత్ ఉన్నారు.

ప్రపంచ గమనం

రష్యా లేకుండా ఉక్రెయిన్ శాంతి చర్చలు 'నాన్సెన్స్' - పుతిన్



మాస్కో : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్విట్జర్లాండ్‌లో ఉక్రెయిన్ పైన జరగనున్న శాంతి సమావేశాన్ని ఎగతాళి చేశాడు. రష్యా దౌత్యపరమైన పరిష్కారానికి సిద్ధంగా ఉందని, అయితే అది లేకుండా చర్చలు జరపడం "అర్థంలేనిది" అని ఆయన అన్నాడు. చర్చలకు రష్యాను ఆహ్వానించలేదు. ఉక్రెయిన్ సంఘర్షణకు శాంతియుత ముగింపును మాస్కో తిరస్కరించలేదని గురువారం బెలారసియన్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకాషెంకోతో జరిగిన సమావేశంలో పుతిన్ పునరుద్ఘాటించాడు. కానీ రష్యా తన ప్రయోజనాలను విస్మరించి విధించిన ఒప్పందాలను అంగీకరించదని ఆయన నొక్కి చెప్పాడు.

ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనపై జూన్‌లో అంతర్జాతీయ సదస్సును నిర్వహించాలనే స్విట్జర్లాండ్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ, దానికి మాస్కోను ఆహ్వానించలేదని పుతిన్ పేర్కొన్నాడు. "అక్కడ మనం చేయవలసింది ఏమీ లేదని వారు అనుకుంటారు. అదే సమయంలో మనం లేకుండా ఏదీ పరిష్కరించబడదని వారు అంటున్నారు. మేము అక్కడికి వెళ్లడం లేదు కాబట్టి (ఇది ఇప్పుడు ఒక రకమైన అర్థంలేనిదిగా మారింది) "అని రష్యా నాయకుడు అన్నాడు. "మేము చర్చలకు నిరాకరిస్తున్నామని వారు అంటున్నారు. మమ్మల్ని ఆహ్వానించలేదు. కానీ మేము తిరస్కరిస్తున్నామని వారు చెబుతున్నారు. "ఇది చాలా విచారకరంగా లేకపోయినా తమాషాగా ఉంది," అతను ముగించాడు.

శాంతి సమావేశంలో రష్యా లేకుండా పశ్చిమ దేశాలు ఏకీభవించగల ఏకైక విషయం ఏమిటంటే "యుద్ధాన్ని తీవ్రతరం చేయడం" అని లుకాషెంకో వ్యాఖ్యానించాడు.

"రష్యా లేకుండా, మనం ఏ శాంతి ప్రక్రియ గురించి మాట్లాడుతున్నాము? రష్యా లేకుండా శాంతి పరిష్కారం సాధ్యం కాదు" అని బెలారసియన్ నాయకుడు పేర్కొన్నాడు. రష్యా చేసిన శాంతి ప్రయత్నాలు సంఘర్షణ ప్రారంభ దశలో టర్కీలో ప్రధాన చర్చలకు దారితీశాయని పుతిన్ చెప్పాడు. మార్చి 2022లో ఇస్తాంబుల్‌లో జరిగిన చర్చల సందర్భంగా, ఉక్రేనియన్ ప్రతినిధి బృందం రష్యా నిబంధనలలో కొన్నింటిని మొదట అంగీకరించిందని ఆయన గుర్తు చేశాడు. అయితే, "పశ్చిమ దేశాల ఒత్తిడి కారణంగా ఉక్రెయిన్ ఈ ఒప్పందాలను అమలు చేయలేదు."

యుద్ధరంగంలో రష్యాను ఓడించలేమని ఉక్రెయిన్ ఇప్పుడు గ్రహించిందని, అయితే చర్చలకు నిరాకరించడం ద్వారా అది తనను తాను మరో మార్గం లేని స్థితికి చేర్చుకుందని పుతిన్ అన్నాడు. వ్లాదిమిర్ పుతిన్ అధికారంలో ఉన్నంత వరకు శాంతి చర్చలు జరపకూడదని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ 2022లో ఒక చట్టంపై సంతకం చేశాడు. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సూత్రప్రాయంగా సిద్ధంగా ఉన్నామని రష్యా పదేపదే ప్రకటించింది. అయితే ఉక్రెయిన్, దాని పాశ్చాత్య మద్దతుదారులు చర్చల కోసం అవాస్తవమైన ముందస్తు షరతులను విధిస్తున్నారని రష్యా అంటోంది.

ఐక్యరాజ్య సమితి వైఫల్యం ఇజ్రాయిల్‌ను శిక్షించడం అనివార్యం చేస్తోంది - ఇరాన్



జెరూసలెం : ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తన విధినిర్వహణలో విఫలమైనందున సిరియాలో తన దౌత్య మిషన్‌పై దాడి చేసినందుకు ఇజ్రాయెల్‌ను శిక్షించాల్సిన బాధ్యత ఇరాన్‌పై ఉందని ఇరాన్ గురువారం ఐక్యరాజ్య సమితికి తెలిపింది. ఏప్రిల్ 1 వైమానిక దాడిలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కుడ్స్ ఫోర్స్‌కు చెందిన ఇద్దరు జనరల్స్‌తో సహా ఏడుగురు ఇరాన్ అధికారులు మరణించారు. దాడికి బాధ్యత వహిస్తున్నట్లు ఇజ్రాయెల్ అధికారికంగా ప్రకటించలేదు.

"డమాస్కస్‌లోని మా దౌత్య ప్రాంగణంపై జియోనిస్ట్ రాజ్యం చేసిన దాడిని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఖండించి, తదనంతరం నేరస్థులను న్యాయస్థానానికి తీసుకువచ్చినట్లయితే, ఈ మోసపూరిత పాలనను శిక్షించాల్సిన అవసరం ఇరాన్‌కు తప్పివుండేదే" అని ఎక్స్ (గతంలో ట్విట్టర్)లో ఇరాన్ మిషన్ పోస్ట్ చేసింది. ఇజ్రాయెల్ చేసిన పనికి "తప్పక శిక్షించబడాలి" అని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అన్నారు. డ్రోన్ దాడుల నుంచి బాలిస్టిక్ క్షిపణి దాడుల వరకు ప్రతీకారం తీర్చుకోవచ్చనే ఊహాగానాలకు ఇజ్రాయెల్, అమెరికా ఇంటెలిజెన్స్ అంచనా వేస్తున్నాయి.

ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ అన్ని సెలవులను రద్దు చేసి ఇజ్రాయెల్ ఒక వారం పాటు ప్రతిస్పందన కోసం ఎదురు చూస్తోంది. ముస్లింల పవిత్ర మాసం రంజాన్ ముగింపు, ఈద్-అల్-ఫితర్ పండుగ తర్వాత 24-48 గంటల్లో ఇరాన్ దాడి జరగబోతోందని అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా తెలిసిందని వివిధ వార్తా సంస్థలు రాశాయి. బ్రెంట్ ఆయిల్ ఫ్యూచర్స్ బ్యారెల్‌కు $90 కంటే ఎక్కువగా పెరిగాయి. ఒకవేళ ఇజ్రాయిల్ పైన క్షిపణి దాడి జరిగితే ఇరాన్‌లోని అణు కేంద్రాలపై దాడి చేసేందుకు ఇజ్రాయెల్ సిద్ధమవుతోందని బ్రిటీష్ మీడియా పేర్కొంది. అమెరికా ప్రభుత్వం టెహ్రాన్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయిల్‌కు మద్దతునిస్తుందని ప్రకటించింది. అయితే ఇజ్రాయెల్ దాడుల్లో అమెరికన్ యుద్ధ విమానాలు చేరతాయా, లేదా అనే విషయం ఇంకా అధికారికంగా ధృవీకరించబడలేదు.

రూ.500 బోనస్ ఇవ్వకపోగా...

- మద్ధతు ధర కూడా దక్కనివ్వడం లేదు : బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వకపోగా, కనీస మద్ధతు ధర కూడా దక్కనివ్వడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణ రెడ్డి ,మాజీ ఎమ్మెల్సీ ఎం..శ్రీనివాస్ రెడ్డితో కలిసి పల్లా మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు జనగామలో 193 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 440 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. మార్కెట్ యార్డుకు 4 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తే దళారులు, వ్యాపారులు మద్ధతు ధర కంటే రూ.700 తక్కువగా రూ.1,530 మాత్రమే ఇస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు.

ఎన్నికలకు ముందు రూ.500 బోనస్ ఇచ్చి, కనీస మద్ధతు ధర రూ.2,500కు కొనుగోలు చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రైతులు నష్టపోయిన మొత్తాన్ని వారి బ్యాంకు అకౌంట్లలో వేయాలని ఆయన డిమాండ్ చేశారు. కరోనా సమయం లోనూ ధాన్యాన్ని కనీస మద్ధతు ధరకు కొన్న ఘనత కేసీఆర్ దని గుర్తుచేశారు. వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రమంతటా రైతులు దళారుల చేతుల్లో మోసపోతున్నారని తెలిపారు. మొక్కజొన్న పంట కూడా రాబోతుందనీ, ఎన్నికల కోడ్ పేరుతో సీఎం, మంత్రులు తప్పించుకోవాలనుకుంటే వదిలేది లేదని హెచ్చరించారు. రైతులకు మద్ధతు ధర దక్కేలా వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సామ్రాజ్యవాద, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం

ఏఐకేఎస్, ఎఐఏడబ్ల్యూయూ జాతీయ ప్రధాన కార్యదర్శులు విజూ కృష్ణన్, బి. వెంకట్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని ఏఐకేఎస్, ఎఐఏడబ్ల్యూయూ జాతీయ ప్రధాన కార్యదర్శులు విజూ కృష్ణన్, బి. వెంకట్ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 10న సెనెగల్ రాజధాని సాలెదాకర్‌లో ప్రారంభమైన అంతర్జాతీయ వ్యవసాయాధారిత శ్రామిక యూనియన్ ఐదో మహాసభలకు 85 దేశాల నుండి 125 సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. భారత్ నుండి రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ప్రతినిధుల బృందం పాల్గొంది. ఈ మహాసభలో సామ్రాజ్యవాద దోపిడీ, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులు చేజిక్కించుకోవడం, సామ్రాజ్యవాదులు తమ లాభాపేక్ష కోసం పర్యావరణాన్ని దెబ్బతీయడం, ప్రకృతి వనరులైన సహజ సంపదను దోచుకోవడం, వ్యవసాయ రంగం నుండి రైతాంగాన్ని వెళ్లగొట్టడం, కార్పొరేట్ శక్తులు వ్యవసాయ భూముల్ని చేజిక్కించుకోవడం, ప్రాథమిక హక్కుల్ని కాలరాయడం, ఎగుమతి ఆధారిత పంటలను ప్రోత్సహిస్తూ ఆహార ధాన్యాల ఉత్పత్తులను దెబ్బతీయడం వల్ల ఎదురవుతున్న ఆహార భద్రత, ఫలితంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న



సమస్యలు, వీటిపై ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న పోరాటాలు, వాటిని పక్కదోవ పట్టించేందుకు మితవాద శక్తుల ప్రయత్నాలు, పాలిస్తీనాపై ఇజ్రాయిల్, అమెరికాలు సాగిస్తున్న యుద్ధం, క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎదుర్కొంటూ నిలిచి ముందుకుసాగడం వంటి అంశాలపై చర్చించారు. అనంతరం ఇండియా నుండి ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడారు. ప్రపంచంలో లాగే తమ దేశంలో కూడా పాలక వర్గాల దన్నుతో కార్పొరేట్లు వ్యవసాయ రంగాన్ని తన గుప్పెట్లోకి లాక్కుంటున్నారని తెలిపారు. ఫలితంగా దేశంలో పేద ప్రజానీకానికి ఆహార భద్రత కొరవడుతోందని అన్నారు. శ్రమించి పండించిన రైతాంగానికి గిట్టుబాటు ధర హామీ లేదన్నారు. దోపిడీ వ్యతిరేక శక్తులపై పోరాటాలు దేశవ్యాప్తంగా ముమ్మరంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ఇందుకు సంవత్సరంపైగా సాగిన చారిత్రాత్మక రైతు పోరాటం తార్కాణమన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా సాగుతున్న పోరాటాలకు భారతీయులు అండగా నిలుస్తున్నారని, రాబోయే కాలంలో ఆ సంఘీభావ పోరాటాన్ని విస్తృతం చేస్తామని తెలిపారు. అంతకుముందు యూనియన్ అంతర్జాతీయ కార్యదర్శి జనరల్ జూలియన్ హక్ నివేదికను ప్రవేశ పెట్టారు. ఎఫ్ఎస్ఎమ్, డబ్ల్యూఎఫ్టీయూ ప్రధాన కార్యదర్శి పంపిస్ క్రీట్సిస్ తమ సందేశాన్ని అందించారు.

ఈ మహాసభకు టీయూఐ అధ్యక్షులు అలీయూ ఎన్డీఏ (సెనగల్), విజూ కృష్ణన్(ఇండియా), మొహ్మద్ యలియా(పాలిస్తీనా) సహిద్ అబూబకర్(ఈజిప్ట్), డు టీన్ డంగ్ (వియత్నాం) అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ మహాసభలో అఖిల భారత కిసాన్ సభ (అజయ్ భవన్) నేత రావుల వెంకయ్య, బీకేఎంయూ నేతలు విజయేంద్ర సింగ్ నిర్మల్, గుల్జార్ సింగ్ గోరియ ఎఐఏడబ్ల్యూయూ నేత విక్రమ్ సింగ్ తదితరులతో కూడిన భారత బృందం పాల్గొంది.

లోక్‌సభ ఎన్నికలకు
సిరా సిద్ధం
అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సరఫరా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికలకు చెరగని సిరా సిద్ధంగా ఉంది. మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ లిమిటెడ్ (ఎంపీవీఎల్) తయారు చేసే ఇంక్‌ను దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సరఫరా చేసింది. కర్ణాటక ప్రభుత్వ సంస్థ ఎంపీవీఎల్ 1962 నుండి ఎన్నికల సంఘం కోసం ఈ ఇంక్‌ను తయారు చేస్తోంది. దేశంలో అత్యధికంగా 80 లోక్‌సభ నియోజకవర్గాలున్న ఉత్తరప్రదేశ్‌కు అత్యధికంగా సిరా సరఫరా చేయబడినది.

ఒకే ఓటరు బహుళ ఓటింగ్‌ను నిరోధించడానికి ఎడమ చేతి చూపుడు వేలుకు ముదురు ఊదా రంగు గుర్తును ఉంచే ఇంక్ రాస్తారు. ఈ సిరా ఇంక్ 25 కంటే ఎక్కువ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

2024 సార్వత్రిక ఎన్నికలకు రూ. 55 కోట్ల ఖర్చుతో 26.55 లక్షల (వయల్స్ సంఖ్య) బాటిల్స్ ను తయారు చేశారు. అదే 2019లో రూ. 36 కోట్లతో 25.98 లక్ష బాటిల్స్ సరఫరా చేశారు. ఉత్తర ప్రదేశ్‌కి 2024లో రూ.15.30 కోట్లతో 3.58 లక్షల వయల్స్, 2019లో రూ.14.59 కోట్లతో 3.64 లక్షల వయల్స్ సరఫరా చేశారు.

ఒక్క వయల్‌ను 700 మంది ఓటర్ల వేళ్లకు ఉపయోగిస్తారు. దేశవ్యాప్తంగా 12 లక్షలకు పైగా పోలింగ్ స్టేషన్లున్నాయి.

26.55 లక్షల ఇంక్ వయల్స్ వాడుతున్నారు. మహారాష్ట్రకు 2.68 లక్షలు, పశ్చిమ బెంగాల్ 2 లక్షలు, బీహార్ 1.93 లక్షలు, తమిళనాడు 1.75 లక్షలు, తెలంగాణ 1.50 లక్షలు, మధ్యప్రదేశ్ 1.52 లక్షలు, కర్ణాటకలో 1.32 లక్షలు, రాజస్థాన్ 1.30 లక్షలు, ఆంధ్రప్రదేశ్ 1.16 లక్షలు, గుజరాత్ 1.13 లక్షలు, కేరళ 63,000, పంజాబ్ 55,000, హర్యానా 42,000, ఢిల్లీ 35,000, జమ్మూ కాశ్మీర్ 30,000, జార్ఖండ్ 1.30 లక్షలు, మణిపూర్‌కు 75,380 వయల్స్‌ను పంపించారు.

ఎంపీవీఎల్ సాంప్రదాయ సీసాకు ప్రత్యామ్నాయంగా మార్కర్ పెన్ను అభివృద్ధి చేయడానికి ప్రయత్నం జరుగుతోంది. చెరగని సిరా తయారీలో ఉపయోగించే ముఖ్యమైన పదార్థమైన సిల్వర్ నైట్రేట్ ధరలో హెచ్చుతగ్గుల కారణంగా గత ఎన్నికల్లోనే సీసా ధర రూ.160 ఉండగా ఇప్పుడు అది కాస్తా రూ.174కి పెరిగింది.

వరంగల్ బీఆర్ఎస్
ఎంపీ అభ్యర్థిగా సుధీర్ కుమార్
ప్రకటించిన కేసీఆర్

అన్ని స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన గులాబీ పార్టీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ ను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. దీంతో గులాబీ పార్టీ రాష్ట్రంలోని మొత్తం 17 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్లైంది. కాగా హన్మకొండ జిల్లా వాసి, మాదిగ సామాజికవర్గానికి చెందిన డాక్టర్ సుధీర్ కుమార్ ఆ జిల్లా పరిషత్ చైర్మన్‌గా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. 2001 నుండి తెలంగాణ ఉద్యమకారుడిగా, బీఆర్ఎస్ పార్టీకి విధేయునిగా, అధినేతతో కలిసి పని చేస్తున్న సుధీర్ కుమార్ సరైన అభ్యర్థి అంటూ ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ ముఖ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మేరకు అందరితో చర్చించి వారి సలహాలు, సూచనల మేరకు అధినేత కేసీఆర్, సుధీర్ కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి ప్రకటించారు.

ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన ఐదు సీట్లు పోగా మిగతా 12 సీట్లలో ఆరు సీట్లను బీఆర్ఎస్ బీసీలకు కేటాయించింది. మరో ఆరు స్థానాల్లో ఓసీ అభ్యర్థులను బరిలో నిలిపింది. మహబూబాద్ నుంచి మహిళా అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవితకే తిరిగి టిక్కెట్ ఇచ్చింది.

మొత్తం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థుల జాబితా ఇదే

1. ఖమ్మం - నామా నాగేశ్వర్ రావు (ఓసీ).
2. మహబూబాబాద్ (ఎస్టీ) - మాలోత్ కవిత.
3. కరీంనగర్ - బోయినిపల్లి వినోద్ కుమార్ (ఓసీ).
4. పెద్దపల్లి (ఎస్సీ) - కొప్పుల ఈశ్వర్.
5. మహబూబ్ నగర్ -మన్నె శ్రీనివాస్ రెడ్డి (ఓసీ).
6. చేవెళ్ల- కాసాని జ్ఞానేశ్వర్ (బీసీ).
7. వరంగల్ (ఎస్సీ) - డాక్టర్ మారేపెల్లి సుధీర్ కుమార్.
8. నిజామాబాద్ - బాజి రెడ్డి గోవర్ధన్ (బీసీ).
9. జహీరాబాద్ - గాలి అనిల్ కుమార్ (బీసీ).
10. ఆదిలాబాద్ (ఎస్టీ) - ఆత్రం సక్కు (ఆదివాసీ).
11. మల్కాజ్ గిరి - రాగిడి లక్ష్మా రెడ్డి (ఓసీ).
12. మెదక్ - పీ వెంకట్రామి రెడ్డి (ఓసీ).
13. నాగర్ కర్నూల్ (ఎస్సీ) - ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.
14. సికింద్రాబాద్- తీగుళ్ల పద్మారావు గౌడ్ (బీసీ).
15. భువనగిరి- క్యామ మల్లేశ్ (బీసీ).
16. నల్లగొండ - కంచర్ల కష్ణారెడ్డి (ఓసీ).
17. హైదరాబాద్ - గడ్డం శ్రీనివాస్ యాదవ్ (బీసీ).



బీజేపీ, బీఆర్ఎస్ వైఫల్యాలకు నిరసనగా
14న కరీంనగర్‌లో దీక్ష
కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు ఆ రెండు పార్టీల కుట్ర : మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుట్ర చేస్తున్నాయని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఆ రెండు పార్టీల వైఫల్యాలకు నిరసనగా ఈనెల 14న కరీంనగర్‌లో దీక్ష చేయనున్నట్టు వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ఓట్లు అడిగేందుకు మోడీకి ఏం హక్కు ఉందని ప్రశ్నించారు. 'తెలంగాణకు బీజేపీ చేసిందేంటి? కొత్త రాష్ట్రానికి పదేండ్లలో బీజేపీ ఇచ్చిందేంటి? దేశాన్ని అదాని, అంబానీకి అమ్మడం తప్ప మోడీ ఏం చేశారు? బీజేపీని వ్యతిరేకిస్తే ఈడీ, సీబీఐలతో ఇబ్బంది పెడుతున్నారు. రాముడి ఫోటో పక్కన మోడీ ఫోటో ఎలా పెడుతారు. అభివృద్ధి ఏం చేశారని అడిగితే అది పక్కన పెట్టి గాలి కబుర్లు, సొల్లు కబుర్లు చెబుతున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాముడిని రాజకీయాల కోసం వాడుకోవడం తప్పు అని విమర్శించారు. సికింద్రాబాద్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. చేనేత కార్మికులకు బీజేపీ అన్యాయం చేసిందని విమర్శించారు. ప్రకృతి వైపరీత్యాలకు నార్త్ ఇండియాలో ఎలా ఆదుకుంటున్నారో, సౌత్ ఇండియాలో కూడా అలాగే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మిషన్ కాకతీయ నీళ్లు ఎటు పోయాయని ప్రశ్నించారు. మేం తాగినమా,? మీరు తాగారా? అని బీఆర్ఎస్ నేతలనుద్దేశించి ఎద్దేవా చేశారు. గుర్తింపు కోసమే కొందరు బీజేపీ నాయకులు కాంగ్రెస్ మంత్రులపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్లు మంత్రిగా ఉన్న హరీశ్‌రావు బుద్ధుండే మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు. 'మాకు ఒక్క వేలు చూపిస్తే.. మేం నాలుగు వేళ్ళు చూపెడుతాం' అని హెచ్చరించారు. రాష్ట్ర ఏర్పడటంపై మోడీ అవహేళన చేశారనీ, తెలంగాణ అమరులను ప్రధాని అవమానించారనీ, అలాంటి బీజేపీకి ఓట్లు ఎలా వేస్తారని ప్రశ్నించారు.

జమ్ముకాశ్మీర్ రాష్ట్ర హోదా, అసెంబ్లీ ఎన్నికలకు
ఎంతో సమయం లేదు : ప్రధాని మోడీ

ఉదంపూర్ : జమ్ముకాశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఎంతో సమయం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. శుక్రవారం జమ్ముకాశ్మీర్‌లోని ఉధంపూర్ పట్టణంలో జరిగిన బిజెపి ఎన్నికల ప్రచారంలో మోడీ మాట్లాడారు. జమ్ముకాశ్మీర్‌కు ఎప్పుడు రాష్ట్రహోదా ప్రకటిస్తారో, ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తారనే విషయాన్ని మాత్రం మోడీ స్పష్టం చేయలేదు. జమ్ముకాశ్మీర్‌కు ఆర్టికల్ 370ను రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తున్న పార్టీలను 'మొఘల్ మనస్తత్వం' ఉన్న పార్టీలని వ్యాఖ్యానించారు. ఉధంపూర్ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ పోటీ చేస్తున్నారు. భారత రాజ్యాంగాన్ని, డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గౌరవిస్తుందని ప్రధాని మోడీ తెలిపారు. రాజ్యాంగాన్ని రద్దు చేయబోమని అన్నారు. శుక్రవారం రాజస్థాన్‌లోని బార్మర్‌లో ఎన్నికల ప్రచారంలో మోడీ పాల్గొన్నారు. అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ ఎస్‌సిలు, ఎస్‌టిలపై వివక్ష చూపిందని, ఎమర్జెన్సీ విధించి అంబేద్కర్ రాజ్యాంగాన్ని రద్దు చేయాలని చూసిందని మోడీ ఆరోపించారు. ప్రస్తుతం కూడా కాంగ్రెస్ దేశవ్యతిరేక శక్తులకు అండగా నిలుస్తోందని అన్నారు. బార్మర్ లోక్‌సభ స్థానం నుంచి బిజెపి తరుపున కేంద్ర సహాయ మంత్రి కైలాష్ చౌదరి బరిలో ఉన్నారు.

అమెరికా, జపాన్, దక్షిణ కొరియా సంయుక్త నావికా విన్యాసాలు

యుఎస్ఎస్ థియోడర్ రూజ్‌వెల్ట్‌లో : వివాదాస్పద తూర్పు చైనా సముద్ర జలాల్లో అమెరికా, జపాన్, దక్షిణ కొరియాలు సంయుక్తంగా మూడు రోజుల పాటు నావికా విన్యాసాలు నిర్వహించాయి. అమెరికాకు చెందిన యుఎస్ఎస్ థియోడర్ రూజ్‌వెల్ట్ నేతృత్వంలో అమెరికా విమాన వాహక నౌకల బృందం ఈ విన్యాసాల్లో పాల్గొంది. మరోవైపు వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, జపాన్, ఫిలిప్పీన్స్ నేతలతో చర్చలు జరుపుతున్నారు. ఈ ప్రాంతంలో చైనాను ఎదుర్కొనేందుకు గానూ భాగస్వామ్య దేశాల మధ్య సంఘీభావాన్ని మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నంలో ఒకవైపు సైనిక విన్యాసాలు, మరోవైపు దౌత్య చర్చలకు సిద్ధపడ్డారు. ఏప్రిల్ 10 నుండి 12వరకు జరిగిన ఈ విన్యాసాల్లో దక్షిణ కొరియాకు చెందిన గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్లు, జపాన్ యుద్ధ నౌకలు పాల్గొన్నాయి.

త్రిపురలో ద్విముఖ పోటీ

న్యూఢిల్లీ బ్యూరో : ఈశాన్య రాష్ట్రం త్రిపురలో రెండు లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. గిరిజన ప్రజలు అత్యధికంగా ఉన్న రాష్ట్రంలో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమ త్రిపుర లోక్‌సభ స్థానానికి ఏప్రిల్ 19న తొలిదశలో, తూర్పు త్రిపుర స్థానానికి ఏప్రిల్ 26న రెండవ దశలో ఎన్నికలు జరగనున్నాయి. అక్కడ ప్రచారం హోరెత్తుతోంది. సిపిఎం సారథ్యంలోని ఇండియా ఫోరం, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ పోటీ చేస్తున్నాయి. ఇక్కడ ద్విముఖ పోటీ ఉంది. నెగ్గడం కోసం అన్ని పార్టీలు శ్రమిస్తున్నాయి.

'రాచరికం' వైపు బీజేపీ

ఎస్‌టి రిజర్వ్‌డ్ సీటు తూర్పు త్రిపురలో రాజకుటుంబానికి చెందిన వారసురాలు కీర్తి సింగ్ దేవ్ వర్మను బిజెపి పోటీలోకి దింపడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆమె ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో నివసిస్తున్నారు. అక్కడ ఆమె మరొక రాజకుటుంబానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకున్నారు. బిజెపి నిర్ణయం గిరిజన ప్రయోజనాలకు ద్రోహమని, రాజవంశ రాజకీయాలకు అవకాశం ఇస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి బిజెపి చర్యను గిరిజన హక్కులను "అమ్మేసుకోవడం" అని ఖండించారు. బిజెపి-తిప్ర మోత పొత్తు అపవిత్రమైనదని, అవకాశవాదమని కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన ప్రతిపక్షాలు విమర్శించాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యే సుదీప్ రారు బర్మాన్ రాష్ట్రానికి కీర్తి సింగ్ నిబద్ధతపై సందేహాలను పేర్కొంటూ ఎన్డిఎ కూటమిని బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

హింసే సమస్య

రాష్ట్రంలో నిరుద్యోగం ప్రధాన అంశంగా ఉంది. ధరలు పెరుగుదల వంటి అనేక సమస్యలను సిపిఎం, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. ఉద్యోగ నియామకాల్లో వైఫల్యాలను లేవనెత్తుతున్నారు. అలాగే రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెచ్చరిల్లుతున్నాయి. రాజకీయ హింస, దౌర్జన్యాలు పెరిగాయి. సిపిఎం, వామపక్ష కార్యకర్తలపై దాడులు, హత్యలు, సిపిఎం, ప్రజా సంఘాల కార్యాలయాలపై దాడులు వంటివి నిత్యం జరుగుతున్నాయి. ప్రతిపక్షాలను బలహీనం చేసేందుకు బిజెపి అనేక రాకాల దాడులకు దిగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికలను సజావుగా స్వేచ్ఛగా పారదర్శకంగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి వామపక్ష కూటమి విజ్ఞప్తి చేసింది.

సామాజిక పరిస్థితి

త్రిపురలో అత్యధికంగా గిరిజనులున్నారు. రాష్ట్ర రాజకీయలను గిరిజనులే నిర్ణయిస్తారు. రాష్ట్రంలో ఎస్టి 31.76 శాతం, ఒబిసి 24.48 శాతం, ఒసి 25 శాతం, ఎస్సి 17.83 శాతం ఉన్నారు. హిందువులు 83.40 శాతం, ముస్లిం 8.60 శాతం, క్రైస్తవులు 4.35 శాతం, బౌద్ధులు 3.41 శాతం ఉన్నారు. గిరిజనులలో త్రిపురి లేదా 'దెబ్బర్‌మాన్' కమ్యూనిటీ దాదాపు యాభై శాతం ఉంటారు. అయితే గిరిజనేతర జనాభా బెంగాలీలు, చాలా తక్కువ సంఖ్యలో మెయిథీ, విష్ణుప్రియ మణిపురిలు వివిధ కులాలు, ఉప కులాలకు చెందినవారిగ ఉన్నారు.

అసెంబ్లీ ఉప ఎన్నికల్లో సీపీఎం పోటీ

రాంనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికకు సిపిఎం అభ్యర్థి రతన్ దాస్ పోటీ చేస్తున్నారు. ఏప్రిల్ 19న మొదటి దశ లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఉప ఎన్నిక కూడా జరగనుంది. గత ఏడాది డిసెంబర్‌లో బిజెపి సిట్టింగ్ ఎమ్మెల్యే సూరజిత్ దత్తా మరణించడంతో రాంనగర్ స్థానం ఖాళీ అయింది.

సీపీఐ(ఎం) కాంగ్రెస్ చెరొకటి

త్రిపురలో ఇండియా ఫోరం తరపున సిపిఎం, కాంగ్రెస్ చెరొక్క స్థానానికి పోటీ చేస్తున్నాయి. బిజెపి, ఐపిఎఫ్‌టి, తిప్ర మోతా పార్టీలతో కూడిన ఎన్‌డిఎ నుంచి బిజెపి రెండు స్థానాల్లో పోటీ చేస్తోంది. ఎస్‌టి రిజర్వ్‌డ్ తూర్పు త్రిపుర నియోజకవర్గం అభ్యర్థిగా సిపిఎం నేత రాజేంద్ర రియాంగ్ పోటీ చేస్తున్నారు. మరోవైపు పశ్చిమ త్రిపుర నియోజకవర్గంలో పిసిసి అధ్యక్షుడు ఆశిష్ కుమార్ సాహా పోటీ చేస్తున్నారు. త్రిపుర తూర్పు లోక్‌సభ స్థానం నుండి సిట్టింగ్ ఎంపి రేవతికి టికెట్ నిరాకరించిన బిజెపి, ఆ స్థానంలో కీర్తి సింగ్ దేవ్ వర్మను అభ్యర్థిగా ప్రకటించింది. మాణిక్యం రాజ కుటుంబానికి చెందిన కీర్తిసింగ్ దేవ్, తిప్ర మోతా పార్టీ నేత ప్రద్యోత్ దేవ్ వర్మకు అక్క. తిప్ర మోత పార్టీ ఇటీవల ఎన్‌డిఎ కూటమిలో చేరి రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంది. పశ్చిమ త్రిపుర నియోజకవర్గం నుంచి రాజ్యసభ ఎంపి విప్లవ్ కుమార్ దేవ్ ను బరిలోకి దింపింది.

మహారాష్ట్ర ప్రతిష్టను పునరుద్ధరించడానికి ఎంవీఏ, ఇండియాను గెలిపించండి

- అవకాశవాదులను ఓడించండి
- రాష్ట్ర ప్రజలకు తుషార్‌గాంధీ, జావేద్ ఆనంద్, జిజి పరిఖ్, తీస్తా సెతల్వాద్, స్వరా భాస్కర్, వంటి 33 మంది ప్రముఖుల బహిరంగ లేఖ

ముంబయి : మసకబారిన మహారాష్ట్ర ప్రతిష్టను పునరుద్ధరించడానికి మహా వికాస్ అఘాడి (ఎంవిఎ), ఇండియా వేదికను గెలిపించాలని రాష్ట్ర ప్రజలకు 33 మంది ప్రముఖులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బహిరంగ లేఖ రాసారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న ముగ్గుర్ని (ఏక్‌నాథ్ షిండే, దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్) అధికార దాహంతో ఉన్న అవకాశవాదులుగా విమర్శించారు. అధికారం కోసం వీరు ఎవరైనైనా విడిచిపెట్టగలరని, ఎవరితోనైనా కలవగలరని లేఖలో విమర్శించారు. అలాగే లేఖలో 'ఒకప్పుడు, మహారాష్ట్ర ప్రగతిశీల విలువ ఆధారిత రాజకీయాలకు చిహ్నంగా నిలిచింది, దేశంలోనే ముందుగా ఆలోచించే రాష్ట్రంగా ఉండేది. మన గర్వకారణమైన వారసత్వంలో సంత్ తుకారాం, సంత్ జనాబాయి, సంత్ సోయారాబాయి సంత్ నామ్‌దేవ్ మహారాజ్, శివాజీ మహారాజ్, సాహూ మహారాజ్, మహాత్మా జోతిబా పూలే, సావిత్రీబాయి పూలే, ఫాతిమా షేక్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి గొప్ప వ్యక్తులు ఉన్నారు. వీరి ఘనమైన త్యాగాలు కారణంగానే మహారాష్ట్ర సామాజిక-రాజకీయలు, ఆర్థిక. సాంస్కృతిక రంగంల్లో ఒక జాతీయ ప్రమాణంగా, ఒక వెలుగురేఖగా తన హోదాను కొనసాగించింది' అని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న మూడు పార్టీల కారణంగా నేడు మహారాష్ట్ర ప్రతిష్ట మసకబారిందని విమర్శించారు. అధికారంలో ఉన్న కూటమి కేవలం అనైతిక కూటమి మాత్రమే కాదని, మోడీ, అమిత్ షాల కీలుబొమ్మ కూటమి అని ఆరోపించారు. బెదిరింపులు, ప్రలోభాలు కారణంగా రాష్ట్రంలో రెండు పార్టీలు (శివసేన, ఎన్‌సిపి) విచ్ఛిన్నమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు అధికారం కోసం పోటీ పడ్డం సహజమని అయితే ఈ పోటీ రాజ్యాంగం, ప్రజాస్వామం నిబంధనలకు కట్టుబడి ఉండాలని సూచించారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు మనస్సాక్షిని పాటిస్తూ, బాధ్యతగా ఓటువేయాలని కోరారు. తాము ఏ రాజకీయ పార్టీకి చెందని వారమని, అయితే ప్రజాస్వామ్య నిబంధనలను గట్టిగా సమర్థిస్తున్నామని అని లేఖపై సంతకం చేసిన వారు తెలిపారు. సంతకం చేసిన వారిలో జిజి పరిఖ్, రావుసాహెబ్ కసాబే, తుషార్ గాంధీ, రామ్ పునియాని, శ్యాందాదా గైక్వాడ్, తీస్తా సెతల్వాద్, ఉత్తమ్ కాంబ్లే, బిజి కోల్సే పాటిల్, సురేష్ ఖోప్డే, మేఘా పన్సారే, ఆనంద్ పట్వర్ధన్, జావేద్ ఆనంద్, ఇర్ఫాన్ ఇంజనీర్, డాల్ఫీ డిసౌజా, ఎంఎ ఖలీద్, నిరంజన్ తక్లే, శంభాజీ భగత్, డాక్టర్ సురేష్ ఖైర్నార్, జ్ఞానేష్ మహారావ్, అన్వర్ రాజన్, నందకుమార్ పాటిల్, ఉల్కా మహాజన్, అసిమ్ సరోదే, సంజయ్ ఎంజి, వర్ష దేశ్‌పాండే, డాక్టర్ సలీం ఖాన్, నూరుద్దీన్ నాయక్, సయీద్ ఖాన్, స్వర భాస్కర్, ఫిరోజ్ మితిబోర్వాలా, శరద్ కదమ్, విశాల్ హివాలే, గుడ్డి ఎస్ఎల్ ఉన్నారు.

కాశీ విశ్వనాథ ఆలయంలో డ్యూటీ చేసే పోలీసులకు అర్చకుల వేషధారణ

నుదుటిపై తిలకం యోగీ సర్కార్ వింత నిర్ణయం : సర్వత్రా విమర్శలు

వారణాసి : ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, వారణాసిలోని కాశీవిశ్వనాథ ఆలయంలో విధులు నిర్వహించే పోలీసులు అర్చకుల మాదిరిగానే ధోతి, కుర్తా ధరిస్తున్నారు. నుదుటిపై తిలకం దిద్దుకుంటున్నారు. రాష్ట్రంలోని యోగీ ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు వారణాసిలో పోలీసులు ఈ విధమైన వేషధారణతో విధుల్లో పాల్గొంటున్నారు. ఈ విషయంపై వారణాసి పోలీస్ కమిషనర్ మోహిత్ అగర్వాల్ మాట్లాడుతూ ఆలయం వద్ద విధులు నిర్వహించే పోలీసులకు ఇటీవల కమ్యూనికేషన్ నైపుణ్యాలపై మూడు రోజుల సమగ్ర శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఈ తరువాత ట్రయల్‌రన్‌లో భాగంగా 15 రోజుల పాటు పోలీసులు ధోతి, కుర్తా ధరించి ఆలయం వద్ద విధుల్లో పాల్గొంటారని తెలిపారు. 15 రోజుల ట్రయల్‌రన్



పూర్తయిన తరువాత సమీక్ష నిర్వహించి దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని అగర్వాల్ తెలిపారు. అలాగే నో టచ్ విధానాన్ని కూడా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ విధానంలో భక్తులను పోలీసులు నేరుగా తాకకుండా తాళ్లతో భక్తులను నియంత్రిస్తుంటారు.

కాగా, పోలీసులు అర్చకుల వేషధారణ చేసుకోవడం, నుదుటిపై తిలకం ధరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఎస్‌పి నాయకులు, మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ స్పందిస్తూ 'పోలీసులు అర్చకుల దుస్తులు ధరించడం ఏ పోలీస్ మాన్యువల్ ప్రకారం సరైనది?' అని ప్రశ్నించారు.

ఇలాంటి ఆదేశాలు ఇచ్చేవారిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు 'ఖండించాల్సినవి' అని పేర్కొన్నారు. రేపు ఎవరైనా మోసగాళ్లు దీనిని సద్వినియోగం చేసుకుని అమాయక ప్రజల్ని లూటీ చేస్తే యుపి ప్రభుత్వం, అధికారులు ఏం సమాధానం చెబుతారని అఖిలేష్ ప్రశ్నించారు.

కాగా, కాశీ విశ్వనాథ ఆలయంలో పోలీసులు అర్చకుల వేషధారణలో విధుల నిర్వహించడం ఇదే మొదటిసారి కాదు. 2018లోనూ దీనిని ప్రయోగాత్మకంగా పరిశీలించారు. కానీ కొన్ని కారణాలతో దీనిని నిలిపివేశారు. ఈ ఆలయాన్ని రోజుకు సుమారు 5 లక్షల మంది దర్శించుకుంటారు. దాదాపు 800 మంది పోలీసులు వివిధ షిఫ్టుల్లో అనేక స్థాయిలో విధులు నిర్వహిస్తుంటారు.

నవతెలంగాణ

8

మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్

శనివారం | ఏప్రిల్ 13, 2024 | www.navatelangana.com



చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఈసీ నగర్ మెయిన్ రోడ్డులో ఆర్కే టిఫిన్ సెంటర్‌ను కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ శుక్రవారం ప్రారంభించి ఓనర్ తులసి రాజ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాల్ రెడ్డి, ప్రభు గౌడ్, శ్రీకాంత్ యాదవ్, రాజు గౌడ్, పాండు ముదిరాజు ,భాను చందర్, ప్రభాకర్ రెడ్డి,మురళి గౌడ్,బాబు ముదిరాజ్, ప్రసాద్ రెడ్డి, విజయ్ ముదిరాజ్, వెంకట్‌రెడ్డి సదానంద,ధర్మ రెడ్డి, రామరెడ్డి, నవనీత, సంధ్య,నిర్మల,అరుణ,మున్నివసంత తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా



అనారోగ్యంతో బాధపడుతూ శ్రీకర హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న డా. ఎఎస్ రావునగర్ డివిజన్‌కు చెందిన మల్లికార్జున గుప్తను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. బాధితునికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కాప్రా


కండువా మార్చేద్దామా..!

- పార్టీ మారే యోచనలో ద్వితీయశ్రేణి నేతలు
- అధికార కాంగ్రెస్ వైపు మొగ్గు
- పార్టీని వీడిన వారు సొంత గూటికి..
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో డోర్లు తెరిచిన కాంగ్రెస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ప్రతిపక్ష పార్టీల్లో.. ముఖ్యంగా బీఆర్ఎస్ కొనసాగుతున్న నేతలు, ప్రజాప్రతినిధులు అధికార పార్టీలో చేరేందుకు సై అంటున్నారు. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్న వారు మరోసారి ఎన్నికల బరిలో నిలిచి గెలవాలన్న ఆరాటంతో కండువా మార్చుకునేందుకు రెడీ అవుతున్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పలువురు కాంగ్రెస్ వైపు తొంగి చూస్తున్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఐదింటిలోనూ బీఆర్ఎస్ వారే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. దీంతో బీఆర్ఎస్‌కు చెందిన కొందరు నాయకులు సొంత అవసరాల కోసం ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరగా.. అదే దారిలో మరికొందరు వెళ్లేందుకు ఉబలాట పడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎవరు వచ్చినా చేర్చుకునేందుకు కాంగ్రెస్ డోర్లు తెరి చింది. దీంతో పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు ఇప్పటికే హస్తం గూ



టికి చేరగా, మరికొందరు సైతం ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరిన పాత వారంతా తిరిగి సొంత గూటికి చేరడానికి మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. ఇదే సమయంలో గులాబీ పార్టీలో చాలా కాలంగా కొనసాగి పదవులు అనుభవించిన వారు సైతం పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం జరుగుతోంది.

కొనసాగుతున్న వలసలు..

అసెంబ్లీ ఎన్నికలకు ముందే కొందరు నాయకులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. మేడ్చల్ నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, కౌన్సిలర్లు, మండల, డివిజన్ నాయకులు ఇప్పటికే హస్తం గూటికి చేరారు. ఇక అసెంబ్లీ ఎన్నికల అనంతరం కూడా వలసలు కొనసాగుతున్నాయి. గతంలో కాంగ్రెస్‌లో కొనసాగి వివిధ కారణలతో గులాబీ తీర్థం పుచ్చుకున్న వారిలో చాలా మంది తిరిగి కాంగ్రెస్ వైపు తొంగి చూస్తున్నారు. ఇప్పటికే పలువురు నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇటీవలే మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌తోపాటు కీసర ఎంపీపీ సైతం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇటీవల బోడుప్పల్‌కు చెందిన దాదాపు 10 మంది కార్పొరేటర్లు అధికార పార్టీలో చేరారు.

భరోసా దొరక్క..

పార్టీ మారేందుకు రెడీ అవుతున్న నేతలను నిలువరించి, భరోసా ఇచ్చేవారు లేని పరిస్థితుల్లో పార్టీ వీడుతున్నట్టు తెలుస్తోంది. ఇటీవల ఆయా నియోజకవార్గల స్థాయిలో గులాబీ నేతలతో సమీక్ష సమావేశాలు జరిగాయి. అసెంబ్లీ ఎన్నికల ఓటమిని గుణపాఠంగా తీసుకుని పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పార్టీ ముఖ్య నేతలు పేర్కొన్నారు. అయినప్పటికీ కొందరు ప్రజాప్రతినిధులు, నేతలు పార్టీని వీడుతుండటం విస్మయం కలిగిస్తోంది. కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన వారు సొంత గూటికి వెళ్తుంటే, బీఆర్ఎస్ నుంచి గెలిచిన వారు కూడా పార్టీ వీడుతున్నారు. బోడుప్పల్, నిజాంపేట, జవహర్‌నగర్ కార్పొరేషన్లలో మేయర్‌తోపాటు కార్పొరేటర్లు, ఆయా మున్సిపాల్టీల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా జారిపోతున్నారు. దీంతో కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో బలం పడిపోతోంది. బీఆర్ఎస్ కుమ్ములాటలు సమసిపోలేదనడానికి వలసలు కూడా కారణమని స్పష్టమవుతోంది. పార్లమెంటు ఎన్నికల ముందు మరి కొందరు పార్టీ వీడే ఆలోచనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ నేతలు కూడా ఎన్నికల సమయంలో ఎక్కువ మందిని చేర్చుకుని ప్రత్యర్థులను డిఫెన్స్‌లో పడేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా గులాబీ నేతలు వలసలను నివారించడంపై దష్టి సారించి, పార్టీ కేడర్‌కు భరోసా ఇవ్వాలని ఆ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు కోరుతున్నారు.



డ్రైన్ పైప్ లైన్ పనుల పరిశీలన

నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ సమీపంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నుండి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు వరకు సీఆర్ఎంపీ ఏజెన్సీ చేపట్టిన స్ట్రోమ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ గతంలో వేసిన పైప్ లైన్ సరిపోవట్లేదని దానివల్ల డ్రయినేజీ వాటర్ పైకి పొంగుతూ వ్యర్థాలు రోడ్లపైకి చేరి దుర్వాసన వస్తోందన్నారు. దాంతో ప్రయాణికులకు, స్థానిక ప్రజలకు ఇబ్బందిగాను, అసౌకర్యంగాను ఉందన్నారు. కావున ఈ సమస్యపై త్వరితగతిన స్పందించి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ప్రభుదాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉల్లేం బాలరాజు, శేఖర్ గౌడ్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ కీసర మండల అధ్యక్షుడిగా జనగాం మహేంద్ర భూపతి

నవతెలంగాణ-కీసర



కాంగ్రెస్ పార్టీ సేవాదళ్, కీసర మండల అధ్యక్షుడిగా భోగారం గ్రామానికి చెందిన జనగాం మహేంద్ర భూపతి నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు షఫీ చేతులమీదుగా మహేంద్ర భూపతి నియమాకపు పత్రం శుక్రవారం అందుకున్నారు. ఈ సందర్భంగా మహేంద్ర భూపతి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పని చేసిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పజెప్పినం దుకు నిరంతరం పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి , జిల్లా పరిషత్ చైర్మెన్ మల్లిపెద్ది శరత్ చంద్రారెడ్డి , కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి,కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం

నవతెలంగాణ-అల్వాల్

133 డివిజన్ మచ్చ బొల్లారంలో గ్రామ దేవత బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం కన్నుల పండుగగా ప్రారంభమైంది. రిత్వికులు రాహుల్ శర్మ, సాయి దత్తు పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. బొడ్రాయికి కంకణదార చేసి



పురవీధుల్లో ఊరేగించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ మహోత్సవంలో బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్, మాణిక్య రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ దంపతులు, శ్రీనివాస్ గౌడ్ దంపతులు, శ్రీశైలం యాదవ్ దంపతులు, బొబ్బిలి సురేందర్ రెడ్డి, సర్వేశ్ యాదవ్ ,దేవేందర్ కొండల్ రెడ్డి, బీజేపీనాయకులు మల్లికార్జున్ గౌడ్, దండుగుల వెంకటేష్, విజయ రెడ్డి, శ్రీనివాస్ సుజాత, కరుణశ్రీ పద్మిని కాంగ్రెస్ నాయకులు నిమ్మ అశోక్ రెడ్డి, నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

'సోనాలికా' వార్షిక మార్కెట్ వాటా 15.3 శాతం

నవతెలంగాణ-సిటీబ్యూరో

సోనాలికా ట్రాక్టర్స్ 2024 ఆర్థిక సంవత్సరంలో దేశీయ మార్కెట్లో వద్ధి చెందిన ఏకైక ట్రాక్టర్ బ్రాండ్‌గా అవతరించడంతో పాటు మొత్తం వార్షిక మార్కెట్ వాటా 15.3శాతం (ఎస్.టి.) సాధించడం పట్ల కంపెనీ ఉత్సాహంగా ఉంది. సెన్సేషనల్ పెర్ఫామెన్స్ సోనాలికా ఇండస్ట్రీ పర్ఫామెన్స్ కంటే మెరుగ్గా పెర్ఫార్మన్స్ చేసింది. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ మాట్లాడుతూ '2024 ఆర్థిక సంవత్సరం 15.3శాతం వార్షిక మార్కెట్ వాటాతో మా ప్రయాణాన్ని ముగించినందుకు మేం సంతోషిస్తున్నాం. ఎగుమతుల్లో మాత్రం 34.4 శాతం మార్కెట్ వాటాతో భారత్ నెం.1 ఎగుమతి బ్రాండ్‌గా మా స్థానాన్ని మరింత బలోపేతం చేసుకున్నాం' అనితెలిపారు.



శ్రీ శివాంజనేయ ఆలయంలో మానస దేవి విగ్రహ ప్రతిష్ట

నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ శ్రీ శివాంజనేయ దేవస్థానంలో లింగేశ్వర స్వామి సన్నిధిలో శుక్రవారం శ్రీ వాసుకి, నవ నాగ మానస దేవి యంత్ర విగ్రహ ప్రతిష్టా మహోత్సవం శ్రీ విశ్వేశ్వరగిరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ ఆత్మానంద భారతి స్వామి పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ ఆర్ శివ కార్తిక్ శాస్త్రి దేవతామూర్తులకు యంత్ర ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, ఆలయ సంప్రోక్షణ, భక్తులకు మహా ఆశీర్వచనము, తీర్థప్రసాదోభయ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ఘట్టమనేని సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చెల్ల ప్రభాకర్, ఉపాధ్యక్షులు గణేష్ ముదిరాజ్, సభ్యులు హనుమంతు, అల్లాదుర్గం సతీష్, పవన్, అమర శ్రీనివాస్, వెంకటేష్, జనార్దన్, సుధాకర్, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను కాంగ్రెస్ అమలు పరుస్తుంది

- కాంగ్రెస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునితా మహేందర్ రెడ్డి
- కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చెయ్యాలి : తోటకూర వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-కీసర

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరుస్తుందనికాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పట్నం సునితా మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కీసరలోని కె.బీ.ఆర్ కన్వీన్షన్ హల్‌లో ఉమ్మడి కీసర మండల కాంగ్రెస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సునితా మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ముందుంటుందన్నారు. కాంగ్రెస్‌తోనే సామాన్యులకు న్యాయం జరుగుతుందన్నారు. వంద రోజుల పాలనలో 30 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత మన ప్రభుత్వానికే దక్కిందని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం, రూ. 500 కే గ్యాస్ సిలిండర్ ఇవ్వడం, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇలా పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ఎంతో కీలకమైనవని, కొన్ని రోజులు పార్టీ కోసం కష్టపడి పని చేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ స్థానాలు గెలిస్తే ఢిల్లీలో సీఎం రేవంత్‌కు బలం పెరుగుతుందని, కేంద్రంలో అధికారంలోకి వస్తే రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని, తద్వారా మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుం దన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. అంతకు ముందు కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని వారు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ మైనంపల్లి హనుమంతరావు, జిల్లా డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, జెడ్పీ చైర్మెన్ మల్లిపెద్ది శరత్ చంద్రారెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్,ఉమ్మడి కీసర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణ యాదవ్ ,వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ రెడ్డి ,కీసర గ్రామ శాఖ అధ్యక్షుడు జూపల్లి రవీందర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడ్చల్ : మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కార్యకర్తలు,నాయకులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి అన్నారు.శుక్రవారం మేడ్చల్ పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో మేడ్చల్ ఉమ్మడి మండల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు,బాగా కష్టపడి పనిచేయాలని అభ్యర్థి గెలుపునకు సహకారం అందించాలని కోరారు. నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషితో గెలుపు సాధ్యమైతుందని, ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకెళ్లి పనిచేయాలని అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో జెడ్పీ చైర్ పర్సన్ గా ఉన్నప్పుడు ప్రజల అభీష్టం మేరకు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కోట్లాది నిధులతో అభివృద్ధి పనులు చేశానని గుర్తుచేశారు. నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామన్నారు.రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిధులు తీసుకొచ్చి,అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో పోరాటం చేసి నియోజకవర్గం అభివృద్ధికి తోడ్పాటున అందిస్తానని పేర్కొన్నారు.కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ ఇన్ చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి,జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి,మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్,మండల అధ్యక్షుడు రమణారెడ్డి,మున్సిపల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,సాయి పేట శ్రీనివాస్ యాదవ్,జడ్పిటిసి శైలజ విజయానందా రెడ్డి,ఆర్.మల్లారెడ్డి,సింగరేణి పోచయ్య, వేణుగోపాల్ రెడ్డి,కౌన్సిలర్లు,ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



డబ్బులు డిమాండ్ చేసిన యూ ట్యూబర్ పై కేసు

నవతెలంగాణ-ఘట్‌కేసర్

ఇంటి నిర్మాణాలు చేపడుతున్న వారి నుంచి అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్న ఓ యూట్యూబర్ పై ఘట్ కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన ప్రకారం.. ఘట్ కేసర్ పోలీసు స్టేషన్ పరిధి అంకుషాపూర్ కు చెందిన కన్నెబోయిన రమేష్ ఘట్ కేసర్ మున్సిపల్ ఎస్ఎఫ్‌సీ నగర్ శివారు లో 190 గజాల స్థలంలో మున్సిపల్ అనుమతితో ఇంటిని నిర్మించుకుంటున్నాడు. కీసర మండలం రాంపల్లికి చెందిన యూట్యూబర్ దినేష్ కుమార్ మార్చి 31న రమేష్ నిర్మిస్తున్న ఇంటి వద్దకు నాగారం మున్సిపాలిటీ వెళ్ళాడు. అనుమతులు లేకుండా ఇంటిని నిర్మిస్తున్నావు... అడిగినన్ని డబ్బులు ఇవ్వాలని, లేనిచో ఇల్లు కూల్చి వెయిస్తానని హెచ్చరించాడు. రమేష్ తనకు అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పి చూపించాడు. 'నిబంధనలకు విరుద్ధంగా షట్టర్ నిర్మించావు. తాను 3ఎస్ యూట్యూబ్ ఛానల్ జిల్లా రిపోర్టర్‌ను.. ఇంటికి అనుమతి లేదు, నాకు రూ.20 వేలు ఇవ్వాలి లేదంటే అధికారులకు చెప్పి నీ ఇంటిని కూల్చేయిస్తా' నని హెచ్చరించాడు. దాంతో బాధితుడు ఘట్ కేసర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. కేసు నమోద చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



నూతన గాయనీ గాయకుల సినీ సంగీత విభావరి

నవతెలంగాణ-కల్చరల్

ప్రముఖ సాంస్కృతిక సంస్థ శ్యామ గాయత్రి నిర్వహణలో శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై నూతన గాయనీ గాయకులతో పాటు వర్ధమాన గాయకులు కలసి నాటి నేటి సినీ పాటలతో సందడి చేశారు ఈ సందర్భంలో జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామిక వేత్త చిల్ల రాజశేఖర్ రెడ్డి పాల్గొని గాయనీ గాయకులను సత్కరించి మాట్లాడారు. శ్యామ గాయత్రి సంస్థ నిర్వాహకురాలు శివ పార్వతి శాస్త్రీయ సంగీత గురువు వైవిధ్యత కోసం సినీ పాటల విభావరి ఏర్పాటు చేశారని తెలిపారు. అధ్యక్షత వహించిన కళా పోషకుడు గుదిబండి వెంకట రెడ్డి మాట్లాడుతూ శివ పార్వతి సంగీత సేవను ప్రశంసించారు.ప్రముఖ గాయకుడు త్రినాథ రావు నాద యోగ కల్చరల్ ఆర్గనైజేషన్ స్థాపకుడు గణపతి తదితరులు పాల్గొనగా సంస్థ కార్యదర్శి చేపూరి లక్ష్మి నివేదిక సమర్పించారు. అధ్యక్షురాలు శివ పార్వతి స్వాగతం పలికారు

మనశ్శాంతికి సితార్ ఫర్ మెంటల్ హెల్త్' కచేరీ

- సితార్ మాస్ట్రో రిషబ్ రిఖిరామ్ శర్మ



నవతెలంగాణ-బంజారాహిల్స్

దేశవ్యాప్తంగా జరుగుతున్న సితార్ ఫర్ మెంటల్ హెల్త్ టూర్‌ను సుప్రసిద్ధ సితార్ వాద్యకారుడు, హీలింగ్ మ్యూజికల్ జర్నీలో రిషబ్ రిఖిరామ్ శర్మ హైదరాబాద్‌కు తీసుకువస్తున్నారు. ఈ వేసవిలో భారతదేశం అంతటా ప్రేక్షకులను ఆకర్షించడానికి నగరంలో ఈ నెల 14 న డిస్ట్రిక్ట్ 150లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు కొనసాగుతుందని హెచ్‌ఎస్‌బీసీ ఇండియా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు.

సితార్ ఫర్ మెంటల్ హెల్త్ ప్రదర్శనకు హాజరైన వారందరికీ అసాధారణమైన, సుసంపన్నమైన అనుభవాన్ని అందిస్తుందనే వాగ్దానం చేస్తుంది. రిషబ్ రిఖిరామ్ శర్మ సితార్ పాండిత్యం, మానసిక ఆరోగ్యం, మైండ్ ఫుల్నెస్ పై ఆయన లోతైన అవగాహన, సాంప్రదాయ వినోదం సరిహద్దులను అధిగమించింది. రిషబ్ తన సంగీతం ద్వారా, శ్రోతలు విశ్రాంతి అనుభవాలను , ఓదార్పుని పొందగల ఒక మహోన్నత ప్రాంగణాన్ని సృష్టిస్తారు. ఇది ఆయనకు అతిపెద్ద పర్యటన.రెండు నెలల్లో దేశంలోని మెట్రో నగరాల్లో చెన్నై, జైపూర్, గోవా, ముంబై, పూణె, అహ్మదాబాద్, కోల్‌కతా, చండీగఢ్, బెంగళూరు,ఢిల్లీలలో రిషబ్ అలరించి ఆత్మతో ప్రతిధ్వనించేలా ఆహ్లాదకరమైన స్వరాలు భావోద్వేగాలను మిళితం చేశారని నిర్వాహకులు తెలిపారు.

'ఎస్‌జీఐఎస్'లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే





నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్‌లోని శ్రీ స్వామినారాయణ గురుకుల అంతర్జాతీయ పాఠశాలలో మొదటి బ్యాచ్ ఎల్‌కేజీ విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డే జరుపుకున్నారు. భగవాన్ స్వామినారాయణుని దీవెనతో, పూజ్య సుఖవల్లభదాస్ స్వామీజీ ఆశిస్సులతో విద్యార్థులు ఈ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలందరికీ స్వామీజీయూకేజీ కంఫ్లీషన్ సర్టిఫికెట్లను అందించి ఆశీర్వదించారు. విద్యార్థులు ఆధ్యాత్మిక గీతాలు, ఇతర సాంస్కతిక కార్యక్రమాలు వంటి పలు కార్యక్రమాలను ప్రదర్శించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం స్వామీజీ సందేశం ఇచ్చారు. స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్, ప్రైమరీ కో-ఆర్డినేటర్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులందరికీ సందేశం ఇచ్చారు. పూజ్య హరి వల్లభ స్వామీజీ పిల్లలను ఆశీర్వదించారు.

ఉన్నత విద్యా విధానంలో మార్పులు అవసరం



- తెలంగాణ మేధావుల వేదిక

నవతెలంగాణ-బంజారా హిల్స్

రాష్ట్రంలో ఉన్న ఉన్నత విద్యా విధానం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక విధంగా, ప్రయివేటు డిగ్రీ కళాశాలలో మరొక విధంగా ఉండడంతో విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరటానికి ఆసక్తి చూపడం లేదని అందుకే ప్రభుత్వ నిర్దిష్ట విద్యా విధానాలు సడలించి విద్యార్థులను స్వతంత్రంగా సబ్జెక్టులను ఎంచుకునే విధంగా తోడ్పాటు అందించాలని తద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించేందుకు కషి చేయాల్సిందిగా తెలంగాణ మేధావుల వేదిక రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి వీరస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కార్యదర్శి చింతకింది కుమారస్వామి, కోశాధికారి అక్కినపల్లి వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ప్రసంగించారు. తెలంగాణ మేధావుల వేదిక రాష్ట్ర కమిటీ నుంచి తాము ఐదు ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్యమంత్రి కార్యాలయంలో సమర్పించినట్టు తెలిపారు. అవి డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్‌లో బి.ఎ,బీకాం,బీఎస్సీ పేర్లను తీసేసి వాటన్నింటిని ఒక్క దగ్గరికి చేర్చి మొత్తం సబ్జెక్టులన్నిటిని ఒకే జాబితాగా చేయాలని, విద్యార్థులు తమకు నచ్చిన ఏవైనా మూడు సబ్జెక్టులను మొత్తం సబ్జెక్టుల నుంచి ఎంచుకునే విధంగా అవకాశం ఇవ్వాలన్నారు. మొత్తం డిగ్రీ చదువుకు ఒకే పేరుతో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ సర్టిఫికెట్‌ని ఇచ్చి విద్యార్థులు ఎంచుకున్న సబ్జెక్టుల మార్కులన్నీ పొందుపరచాలని, డిగ్రీలో చదివిన సబ్జెక్టులతో సంబంధం లేకుండా పీజీలో ఎంట్రన్స్ రాయడానికి అవకాశం ఇవ్వాలని చెప్పారు. అలాగే ఎన్ని కోర్సులైన చదువుకొని స్కాలర్షిప్ పొందడానికి అవకాశం ఇవ్వాలని,మొత్తం పీజీ కోర్సులు అన్నిటిని ఒకే పేరుతో మాస్టర్ ఆఫ్ సైన్స్ అని పొందుపరిచి ఎం.ఏ ఎం.కామ్ ఎం.ఎస్.సి పేర్లను తీసివేయాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ కిరణ్,సుభాష్,యశ్వంత్లు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో మైనంపల్లి హన్మంతరావు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



రంజాన్ పండుగ ప్రతీ ఒక్కరి జీవితంలో సంతోషాన్ని తీసుకునిరావాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మౌలాలి డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు పవిత్ర రంజాన్ మాసం అంతా ఉపవాసం ఉండి, ప్రత్యేక ప్రార్థనలతో అల్లా ఆరాధనలో ఉంటారన్నారు. ఉపవాసం ఉంటేనే పేద వాడి ఆకలి, పేదరికం అంటే ఏమిటో ప్రతి ఒక్కరికి తెలుస్తోందన్నారు. అల్లా దీవెనలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. స్థానిక ముస్లింలతో పాటు కాంగ్రెస్ నాయకులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
9
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
శనివారం | ఏప్రిల్ 13, 2024 | www.navatelangana.com

పీఎంజే జ్యువెల్లర్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కూకట్‌పల్లి

వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని, ఎఎస్ రాజు నగర్ కాలనీలో గల పీఎంజే జ్యువెలర్ షాప్‌లో నిర్వహించిన, ఎగ్జిబిషన్‌ను కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావుతో కలిసి, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానంద నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్, రవి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి కుమారుడు రెనిష్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం వారి నివాసంలో శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు పి.నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, టీపీసీసీ మాజీ కార్యదర్శి దండుగుల యాదగిరి, డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-బాలానగర్

ఎమ్మెల్యేను సత్కరించిన ముస్లిం సోదరులు



● ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/దుండిగల్

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద శుక్రవారం నియోజకవర్గానికి చెందిన పలువురు మైనారిటీ నాయకులు, ముస్లిం సోదరులు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్లా దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలన్నారు. మరొక మారు ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

'శివ సాయి కన్వెన్షన్ సెంటర్' ను ప్రారంభించిన ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్...

కుత్బుల్లాపూర్ : బోయిన్‌పల్లి డైరీ ఫామ్ రూట్‌లో శ్రీనివాస్ రెడ్డి, మనోహర ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శివ సాయి బాంకెట్ హాల్‌ను కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరంలో శుభకార్యాలు నిర్వహించుకు నేందుకు ఇలాంటి బాంకెట్ హాల్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కెఎం.గౌరీష్, గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, కిషోర్ చారి, సత్తిరెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ వెంకటేశ్వర, శివ వీరాంజనేయ స్వామి దేవస్థానం 20వ వార్షికోత్సవ పూజలు..

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, 132- జీడిమెట్ల డివిజన్ జీడిమెట్ల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర శివ వీరాంజనేయ స్వామి దేవస్థానం 20వ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దైవచింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. ఆ అన్నపూర్ణ విశ్వనాథ స్వామి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి, గాజుల రామారం డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, ఆలయ కమిటీ సభ్యులు జయరాం రెడ్డి, కృష్ణారావు, రాఘవేందర్ రావు, బీరప్ప, శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



డా.బి.ఆర్. అంబేద్కర్ 113 జయంతి వేడుకలు జయప్రదం చేయండి



● తెలంగాణ దళిత సంక్షేమ సంఘం

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలో నిర్వహించనున్న డా. బీఆర్ అంబేద్కర్ 133 వ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని తెలంగాణ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆదిముల్లా రాము పిలుపునిచ్చారు. శుక్రవారం అంబేద్కర్ భవన్‌లో అధ్యక్షులు అధిముల్లా రాము ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశ కార్యక్రమంలో అంబేద్కర్ జన్మదినం పురస్కరించుకొని జయంతి వేడుకలను జయప్రదం చేయవలసిందిగా దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అధ్యక్షులు మాట్లాడుతూ.. నవభారత నిర్మాత, ప్రపంచ మేధావి, భారతదేశ మొట్టమొదటి న్యాయ శాఖ మంత్రి, డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మెన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్ కల్పించారన్నారు. మహిళలకు ఓటు హక్కు కల్పించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుందన్నారు. రిజర్వ్ బ్యాంక్ స్థాపనలో ప్రముఖ పాత్ర వ్యవహరించి భారతదేశ పరిపాలన దశాదిశా నిర్ణయించిన మేధావి అంబేద్కర్ అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చేసిన త్యాగాలను, సమాజా నికి చేసిన సేవలను ఘనంగా స్మరించుకుని ఆయనకు ఘన నివాళులు అర్పించి జయంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాన కార్యదర్శి గీడిమెట్ల రమేష్, కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకే దీప్తి, గౌరవ అధ్యక్షుడు సుంకే రామన్, మీడియా కార్యదర్శి రవి స్టీవెన్సన్, చింత సత్యనారాయణ, రవి, పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికలకు ప్రచార రథాలు సిద్ధం



● కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో ప్రచారం కోసం ఆరు ప్రచార రథాలను ఏర్పాటు చేసుకుంది. ఈ మేరకు శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ బాలానగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి పట్నం సునీత రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా బండి రమేష్ కార్యకర్తలకు సూచించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేసింది. ఇప్పటికే కరపత్రాల పంపిణీ, చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో శేరి సతీష్ రెడ్డి, కొప్పిశెట్టి దినేష్, గాలి బాలాజీ, సాధు ప్రతాప్ రెడ్డి, బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్నకుమార్, మేకల మైకేల్, సంజీవరావు, గంధం రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ బూత్ కమిటీ సమావేశం

● హాజరు కానున్న నేతలు

నవతెలంగాణ-ఓయూ

నేటి 10 గంటలకు నఫీస్ గార్డెన్‌లో (లాలాపేట్ తార్నాక డివిజన్) కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశం ఆదాం.సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా సమావేశనికి ముఖ్యఅతిథిగా సికింద్రాబాద్ పార్లమెంటరీ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, సికింద్రాబాద్ పార్లమెంటరీ కంటెస్టెంట్ ఎమ్మెల్యేలు పాల్గొనున్నారు. సమావేశానికి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు , పాల్గొని విజయవంతం చేయాలని సీనియర్ కాంగ్రెస్ నేత అమర్నాథ్ గౌడ్ చెప్పారు.

కూన శ్రీశైలం గౌడ్‌ను కలిసిన ప్రజలు, నాయకులు..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ బస్తీలకు చెందిన ప్రజలు, పలు సంక్షేమ సంఘాల నాయకులు, ప్రతినిదులు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ని శుక్రవారం కలిశారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి సమక్షంలో కూన శ్రీశైలం గౌడ్ తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా, కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ... శ్రీశైలం గౌడ్‌కి అభినందనలు తెలియజేస్తున్నారు. పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు వివిధ కాలనీకి చెందిన ప్రజలు కూనని కలిసి స్థానికంగా ఉన్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.



ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, ఆల్విన్ కాలనీ, ఫేస్ 2 వెల్ ఫెయిర్ అసోసియేషన్ సభ్యులైన అడ్వైజర్ సమ్మారెడ్డి, ప్రెసిడెంట్ కృష్ణారావు, జనరల్ సెక్రటరీ కట్టా శ్రీనివాస్‌లను కలిశారు.ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, అనిల్ రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-కూకట్‌పల్లి

శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు, పార్టీ శ్రేణులు ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజుని శంభీపూర్ కార్యాలయంలో కలిశారు. సమస్యలను పరిష్కరించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించారు.

తెలుగులో సాహిత్య విమర్శకు ప్రాధాన్యం



నవతెలంగాణ-కల్చరల్

తెలుగులో సాహిత్య విమర్శ తక్కువగా వుందని దీనికి ప్రాధాన్యత ఇచ్చినప్పుడు ఉత్తమ రచనలు వెలువడతాయనీ రాష్ట్ర శాసన సభ తొలి సభాపతి సిరికొండ మధుసూదనాచారి అన్నారు. రమణ వెలమకని ఉత్తమ సాహితీ విమర్శకుడు అని పేర్కొన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో గాన సభ పూర్వ అధ్యక్షుడు కళా వెంకట దీక్షితులు జయంతి సందర్భంగా ఆయన పేరిట ఏర్పాటు చేసిన పురస్కారం సాహితీవేత్త విమర్శకుడు రమణ వెలమకనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి బహూకరించి మాట్లాడారు. దీక్షితులు తండ్రి కళా సుబ్బారావు నిర్వహణలో ఏర్పాటైన గాన సభ ప్రతిష్టను కొనసాగించటంలో విశేష కృషి చేశారని ప్రశంసించారు. సుదీర్ఘ కాలం అధ్యక్షునిగా దీక్షితులు ఇంటి పేరుకు తగ్గట్టుగానే కళా సేవ చేశారని ఎందరో ఔత్సాహిక కళా కారులు వేదిక ఇచ్చారని చెప్పారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ తన సోదరుడు దీక్షితులు మార్గంలో గాన సభ గౌరవం కాపాడుతున్నానని తెలిపారు. రమణ వెలమకని సాహిత్య ప్రసంగాలు మంచి సమాచారంతో పరిశోధనాత్మకం గా వుంటాయని వివారించారు. వేదిక పై కథక్ కళా కారుడు పండిట్ అంజి బాబు, శంకర్ ప్రసాద్‌లు పాల్గొని దీక్షితులుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

నాలుగేండ్ల చిన్నారిపై వీధి కుక్కల దాడి





నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సి పాలిటీ పరిధిలో గత కొద్ది నెలలుగా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నా.. పట్టించు కోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మున్సిపాలిటీ పరంగా కొంత చర్యలు తీసుకున్నప్పటికీ తూతూ మంత్రం గానే చేపట్టడం జరిగిందని ప్రజలు తెలియజేస్తున్నారు. ముఖ్యంగా సిబ్బంది కుక్కలను తీసుకెళ్లినప్పటికీ వాటిని కొంత దూరంలో వదిలి రావడంతో మళ్లీ యధావిధిగా వచ్చాయని స్థానికులు తెలియజేస్తున్నారు. తాజాగా మరో చిన్నారిపై వీధి కుక్క స్వైర విహారంతో దాడి చేయడంతో దుండిగల్ ప్రజలు ఆగ్రహం చెందుతున్నారు. శుక్రవారం ఉదయం ఆరు బైట ఆడుకుంటున్న నాలుగేండ్ల చిన్నారి అనన్య పై కుక్కలు దాడి చేసీ, తీవ్రంగా గాయరిచాయి. దీంతో పాపను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స చేపిస్తున్నారు. పాపను కరిచిన కొద్ది సేపటికే మరో మహిళ పై దాడి చేసి గాయ పరిచాయి. సదరు మహిళను సైతం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తరచూ ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్న దుండిగల్ మున్సిపాలిటీ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవట్లేరని స్తానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టించుకుని కుక్కల నుంచి చిన్న పిల్లల ప్రాణాలు కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. విషయం తెలిసిన కమిషనర్ వెంటనే డాగ్స్ టీం సిబ్బందితో కలిసి వెళ్లి బాధిత చిన్నారి కుటుంబాన్ని పరామర్శించారు. వీధి కుక్కల విషయంలో చర్యలు చేపట్టి నివారించాలని కమిషనర్ తెలిపారు.

చదువుతోపాటు మానసిక వ్యక్తిత్వ వికాసం అవసరం



నవతెలంగాణ-సిటీబ్యూరో

పిల్లలకు చదువు ఎంత ముఖ్యమో.. మానసిక వ్యక్తిత్వ వికాసం కూడా అంతే అవసరం. కౌమార దశలో పిల్లల్లో లోపించడంతో వచ్చే సమస్యలు వారి భవిష్యత్‌పై ప్రభావం చూపిస్తున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని కౌమార దశలో ఉండే అమ్మాయిల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది హెూప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్. ఈపిఐక్యూ గ్లోబల్ సొల్యూషన్స్ కంపెనీ సపోర్ట్‌తో ఎంపీఎఫ్ రెసిడెన్షియల్ క్యాంపు చిన్నారుల కోసం స్పెషల్ సెషన్ నిర్వహించింది. ఈపీఐక్యూ కంపెనీ ఇండియా హెడ్ అభయ్ గార్గ్, సీఎఫ్ఓ విజయ్, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్, మోటివేషనల్ స్పీకర్ అరుణ్‌తో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడ్ టచ్-బ్యాడ్ టచ్, లవ్ అండ్ కేర్, మెన్స్ట్రువల్ హైజీన్, కెరీర్ గైడెన్స్, మెడిటేషన్, క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈపీఐక్యూ సాయంతో దాదాపు 130 మంది అమ్మాయిలకు విలువైన, ఉపయోగకరమైన హైజీన్ కిట్స్ అందించారు. ఈ వేదికగా పిల్లలతో ఇంటరాక్ట్ అయిన ఈపీఐక్యూ యాజమాన్యం.. బాగా చదువుకుంటే అందులోనే అర్హుల వారికి తమ కంపెనీలోనే ఉద్యోగాలు కల్పిస్తామని హామీనిచ్చింది.

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు శంభీపూర్ రాజు సన్మానం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం శంభీపూర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజుని నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను కలిసి సన్మానించారు. బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మెన్ మిద్దెల బాల్ రెడ్డి, నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థికే పూర్తి మద్దతు



● ఎల్లమ్మబండ ముదిరాజ్ సంఘం

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ముదిరాజ్ సంఘం కార్యవర్గ సభ్యులు, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కి సంపూర్ణ మద్దతు తెలియచేస్తూ.. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి, వివేకానంద నగర్‌లోని ఆయన నివాసంలో ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని ముదిరాజ్ సంఘం సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం సభ్యులు మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల ముద్దు బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కి అన్ని విధాలుగా అండగా ఉండి, అఖండ మెజారిటీతో గెలిపించుకుంటాం అన్నా రు. బీసీల ఐక్యతను చాటుదాం అని, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి కానుకగా ఇస్తాం అని ముక్తకంఠంతో పిలుపునిచ్చారు. మేము అంతా ఐక్యంగా ఉండి బీఆర్ఎస్ పార్టీ విధివిధానాలకు కట్టుబడి ఉంటాం అని, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం కృషి చేస్తాం అని పేర్కొ న్నారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శేరిలింగంపల్లి డివిజ న్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేశారని, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేవిధంగా కృషి చేశారని తెలిపారు. మంచి మనసున్న వ్యక్తి ఆరెకపూడి గాంధీ నేతృత్వంలో, ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ని గెలిపించుకుంటాం అని ముదిరాజ్ సంఘం నాయకులు ముక్తకంఠంతో తెలియచేసారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే గాంధీ మాట్లాడుతూ..రాబోయే ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ప్రకటిం చారు. ఏప్రిల్ 13 న చేవెళ్లలో జరిగే కేసీఆర్ భారీ బహిరంగ సభను సమిష్టి కృషితో విజయవంత చేయాలని గాంధీ తెలియ చేసారు. అందరూ కలిసి కట్టుగా పనిచేసి, సమిష్టి కృషి తో పని చేద్దాం అని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. జోగిపేట బాల్ రాజు, తెలంగాణ ముదిరాజ్ సంఘం ఎల్లమ్మ బండ సలహాదారుడు శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



● కార్పొరేటర్ మహేందర్ కొడిచేర్ల

నవతెలంగాణ-కూకట్‌పల్లి

లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ని అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని మూసాపేట డివిజన్ పరిధిలోని నరసింహ స్వామి దేవాలయం నుంచి మూసాపేట్ కార్పొరేటర్ కొడి చెర్ల మహేందర్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటెల రాజేందర్ అత్యధిక మెజారిటీతో గెలిపించి పార్లమెంట్‌కి పంపించి, నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ మరియు బాలాజీనగర్ డివిజన్ బీజేపీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు పిట్ల మనోహర్, తూము శైలేష్, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ చారీ, మల్లేష్ గౌడ్, యాదయ్యతదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ సాధన ఉద్యమానికి కృషి

- రాష్ట్ర కార్యదర్శి రత్నాకరం కోటంరాజు



నవతెలంగాణ-ధూల్‌పేట్

సామాజిక న్యాయ సాధన ఉద్యమ కార్మికుల నిధికి కృషి చేయాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్స్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి రత్నా కరం కోటం రాజు అన్నారు. ఉద్యమ నిధి కార్మికుల నుండి వసులు చేయాలని సీఐటీయు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్స్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో గౌలిగూడ చమాన్ లేబర్ అడ్డా, బేగంబజార్ లేబర్ అడ్డాల వద్ద సామాజిక న్యాయ సాధన ఉద్యమ నిధి వసులు చేశారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీసీడబ్ల్యుయు హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తుపాకీ ఆంజనేయులు, కె. జంగయ్య, గౌలిగూడ చమాన్ లేబర్ అడ్డా అధ్యక్షులు బి. గంగపురి, సభ్యులు నర్సమ్మ , బేగంబజార్ లేబర్ అడ్డా గౌరవ అధ్యక్షులు జి. నారాయణ, కమిటీ సభ్యులు నరేష్, సూరి, తదితరులు పాల్గొన్నారు.

రేపు బీవైఎస్ 58వ వ్యవస్థాపక దినోత్సవం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారతీయ యోగ్ సంస్థాన్ (బీవైఎస్ఐ) 58వ వ్యవస్థాపక దినోత్సవంను ఆదివారం నిర్వహించనున్నట్టు సంస్థాన్ హైదరాబాద్ వెస్ట్ జోన్ అధ్యక్షులు వై.కృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సికింద్రాబాద్ పికెట్‌లోని కంటోన్మెంట్ పార్కులో ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు "జీవించు-జీవించనివ్వు" అనే నినాదంతో ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎవరైనా ఉచితంగా పాల్గొనొచ్చని చెప్పారు.

సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈవో మధుకర్ నాయక్, ఇండియన్ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ అకాడమీ చైర్మెన్ డాక్టర్ ఆనంద్ ప్రభు తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం అందరికీ అల్పాహార వితరణతో కార్యక్రమం ముగుస్తుందని వివరించారు. మనుషులందరూ సమానమనే భావనను పెంపొందించడమే సంస్థాన్ లక్ష్యమని తెలిపారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగించుకోవాలి



- తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు కార్యదర్శి ఎన్.సోమయ్య

నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ బాలోత్సవ అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు కార్యదర్శి ఎన్.సోమయ్య తెలిపారు. తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో మే 5 నుండి 20 వరకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్ లింగంపల్లి లో 15 రోజుల క్యాంప్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను టీపీఎస్‌కే హాల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు ఇల్లు పీకి పందిరేయక మానరు సుమా వీరి అల్లరి భారీ నుంచి తప్పించుకోవాలంటే చాలామంది తల్లిదండ్రులు ఎంచుకునే పరిష్కారమే సమ్మర్ క్యాంప్ అన్నారు. హైదరాబాద్ లో సమ్మర్ క్యాంపు అంటే రూ.10 వేల నుండి రూ.20 వరుకు చెల్లించాల్సిందే మన తెలంగాణ బాలోత్సవం ఉచిత సమ్మర్ క్యాంపు మే 5 నుండి 20 వరుకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్ లింగంపల్లి హైదరాబాద్ అందమైన విశాలమైన హాలులో ఏకకాలంలో అటు, ఆటలు ఇటు విజ్ఞానాన్ని అందించి ఉత్సాహాన్ని ఉల్లాసానందించే ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందామన్నారు. చిన్నారుల్లో జ్ఞాపకశక్తిని ఫోకస్ చేసి మెరుగు పరిచే విజ్ఞానం, వినోదం, విజ్ఞాన యాత్రలు ,సైన్స్ వండర్ షోలు క్యాంపు సమ్మర్ ప్రత్యేకతలను సంతరించుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం కమిటీ సభ్యులు ఎన్.శంకర్, రేష్మ ,విజిత పాల్గొన్నారు.

తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చిస్ 4వ వార్షికోత్సవం



- తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చిస్స్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చిస్స్‌కు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు రావడానికి స్వాగతిస్తున్నామని టీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ భాస్కర్ అన్నారు. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చస్ 4వ వార్షికోత్సవం శుక్రవారం రామ్ కోఠి లోని వెస్లీ సెంటినరీ చర్చి లో నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల ప్రధాన చర్చిలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం..తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చిస్స్ చైర్మెన్‌గా బిషాప్ పద్మారావు, వైస్ చైర్మెన్‌గా ఎంఏ డానియల్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ టి.భాస్కర్, కోశాధికారిగా రాబర్ట్ సూర్య ప్రకాష్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ బోర్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా టీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ టి భాస్కర్ మాట్లాడుతూ.. టీసీసీకేఎన్‌సీసీఐ గుర్తింపు రావడం తమకు సంతోషం కలిగించిందన్నారు. పేద, అణగారిన వర్గాలకు చేయూతను అందిస్తున్నామ న్నారు. కులమతాలకు అతీతంగా అభివృద్ధి కోసం తోడ్పాటు అందిస్తామన్నారు. దళితులు, మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలపై పోరాడుతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టీసీసీని బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రూబన్ మార్క్, ఫిలిప్ రాజ్, జ్యోతి సుందర్, విజయ పద్మారావు, స్టీవెన్, జాన్ రవీందర్, తిమోతి, వివిధ జిల్లాలకు చెందిన చర్చిల ప్రతినిధులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు



- గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్.

నవతెలంగాణ-ముషీరాబాద్

కలుషిత మంచి నీటి సరఫరా సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. డివిజన్ లోని చిక్కడపల్లి లోని స్ట్రీట్ నెంబర్ 1, 2 బాపు నగర్ పరిసరాల ప్రాంతాల్లో కలుషిత మంచి నీటి సరఫరా సమస్యను ఎదుర్కొంటున్నామని స్థానికులు, కాలనీ వాసులు చేసిన ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించారు. సమస్య పునరావృత్తం కాకుండా మూడు రోజుల్లో సమస్యను సిబ్బంది పరిష్కరిస్తారని, అలాగే డివిజన్ వ్యాప్తంగా ఉన్నలో ప్రెషర్ సమస్యను కూడా పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్, స్థానిక కాలనీ వాసులు శ్రీకాంత్, లక్ష్మణ్ గౌడ్, రంగనాథ్,వసంత్ సర్దేశముఖ్, తదితరులు పాల్గొన్నారు.

మే 29,30 తేదీల్లో బాల సాహిత్య సమ్మేళనం

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో మే 29,30 తేదీల్లో హైదరాబాదులో బాల సాహిత్య సమ్మేళనం నిర్వహిస్తుందని రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పాఠశాల విద్యార్థులు, తెలుగు ఉపాధ్యాయులు, బాల సాహితీవేత్తలు, బాలల కోసం రచనలు చేస్తున్నవారు పాల్గొంటారని పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో తెలుగు భాషావికాసం, బడి పిల్లల్లో రచనా భిరుచి పెంపొందించడం, పత్రికల్లో బాలల రచనలకు ప్రచురణావకాశాలు, కథలు చెప్పడంలో మెలకువలు, సంగీతం, నృత్యం,నాటకం, చిత్రలేఖనం, శిల్పం వంటి లలిత కళల పైన ప్రాథమిక అవగాహన మొదలైన సదస్సులు, గోష్టులు జరుగుతాయని తెలిపారు. ప్రతినిధులుగా పాల్గొనదలిచేవారు ఈనెల 30వ తేదీలోగా 960 3727 234 వాట్సాప్ నెంబర్ కు వివరాలు పంపి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శాంతా వసంతా ట్రస్టు వ్యవస్థాపకులు పద్మభూషణ్ డాక్టర్ కే.ఐ వరప్రసాదరెడ్డి వారి మాతృమూర్తి శాంతమ్మ సంస్మరణార్థం గత కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమాల నిర్వహణకు ఆర్థిక సౌజన్యం అందిస్తున్నారని శివారెడ్డి, చెన్నయ్య వివరించారు.

శోభా యాత్రలో ఎలాంటి రాజకీయ ప్రచారాలకు అనుమతి ఉండదు

- శ్రీరామ నవమి పండుగ సమన్వయ సమావేశంలో పోలీస్ కమీషనర్ కొత్తకోట శ్రీనివాస రెడ్డి





నవతెలంగాణ-ధూల్‌పేట్

శ్రీరామ నవమి శోభా యాత్రలో ఎలాంటి రాజకీయ చిహ్నాలు, రాజకీయ ప్రసంగాలకు అనుమతి ఉండదనీ పోలీస్ కమీషనర్ కొత్తకోట శ్రీనివాస రెడ్డి అన్నారు. రాబోయే శ్రీరామ నవమి పండుగ పురస్కరించుకుని మంగళ్‌హాట్‌లోని సీతారాంబాగ్‌లోని ద్రౌపది గార్డెన్‌లో అంతర్-విభాగాల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీరామనవమి ఉత్సవ సమితి సభ్యులు, ఆర్అండ్‌బీ, విద్యుత్, అగ్నిమాపక, ఆర్టీఏ, టీఎస్ఆర్‌టీసీ, వాటర్ వర్క్స్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ర్యాలీ ప్రాంతాలలో చెట్ల నరికివేత, బారికేడింగ్, రోడ్ల మరమ్మతులు, వీధి దీపాలు, మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను వారు వివరించారు. గత సంవత్సరం ఊరేగింపులో జాప్యానికి కారణమైన కీలక సమస్యలను సరిదిద్దాలని నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరామ నవమి పండుగ సజావుగా జరిగేందుకు రాబోయే ఎన్నికలకు సంబంధించి, మేము భారత ఎన్నికల సంఘం జారీ చేసిన నైతిక నియమావళిని అనుసరిస్తామనీ, అందరూ అనుసరించాలన్నారు. శోభా యాత్రలో ఎలాంటి రాజకీయ చిహ్నాలు లేదా రాజకీయ ప్రసంగాలకు అనుమతి ఉండదన్నారు. ఇతరత్రా అత్యవసర పరిస్థితుల కోసం హైదరాబాద్ కంట్రోల్ రూమ్‌ను వెంటనే సంప్రదించాలని, శోభాయాత్రకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు. "శోభా యాత్ర సిటీ పోలీసులు విస్తృతమైన భద్రత ప్రణాళికను రూపొందించారు. ఉత్సవ సమితి సభ్యులు ఉప ఊరేగింపులను సరైన పద్ధతిలో ప్రధాన ఊరేగింపు మార్గంలో కలుసుకునేలా సహకరించాలన్నారు. ప్రజలు కూడా పోలీసులకు, వాలంటీర్లకు సహకరించి పండుగను ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఈ సమావేశంలో గత సంవత్సరం శోభాయాత్రలో ఏర్పడిన ఇబ్బందులు, సమస్యలు అదనపు ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులు ఇచ్చిన సూచనలు, సలహాలను స్వీకరించినట్లు తెలిపారు. శ్రీరామ నవమి శోభ యాత్రను ప్రశాంతంగా నిర్వహించుకుందామన్నారు. ఉత్సాహానికి హద్దులు దాటవద్దని.. భక్తులు అధికారులకు సహకరించాలనీ సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, శోభాయాత్రలో రాజకీయ జెండాలు, రాజకీయ ప్రసంగాలు లేకుండా చూసుకోవాలన్నారు. కావాల్సిన జాగ్రత్తలు, సూచనలు వివిధ విభాగాల అధికారులతో, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ లతో కలిసి ప్రణాళికలు సిద్ధం చేశారు.

హనుమాన్ వ్యాయామశాల సందర్శన..

శోభాయాత్ర వెళ్లే మార్గాలను ఆదివారం తెలుసుకున్నారు. ఆ మార్గాల అనుసంధానం ఆధారంగా సూచనలు చేశారు. అనంతరం నిర్వాహకులు జోనల్ కమిషనర్ బి.హేమంత్ సహదేవ్ రావు, ఇతర శాఖల అధికారులు 6.8 కి.మీ మేర ఊరేగింపు మార్గాన్ని పరిశీలించారు. హనుమాన్ వ్యాయామశాలను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్ విక్రమ్ సింగ్ మాన్, కార్ హెడ్ క్వార్టర్స్ అదనపు కమీషనర్ వి సత్యనారాయణ, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ బి హేమంత్ సహదేవ్ రావు, డిప్యూటీ కమిషనర్లు టీఎస్ పిడిసిఎల్, ఆర్ అండ్ బీ, మెడికల్, వాటర్ వర్క్స్ సీనియర్ అధికారులు , ఫైర్, ఆర్టీఓ ఉత్సవ సమితి సభ్యులు డా.భగవంత రావు, కృష్ణ, ఆనంద్ సింగ్, గోవింద్ రాఠి, కిరోడి మాల్ సమావేశానికి హాజరయ్యారు.

సమసమాజ పాలన జగన్‌తోనే సాధ్యం

- 14న కూకట్‌పల్లిలో 'మేమంతా సిద్ధం' వైయస్ఆర్‌సీపీ అభిమానుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-బంజారాహిల్స్

సమసమాజ పాలన జగన్‌తోనే సాధ్యమని వైఎస్ఆర్‌సీపీ అభిమానుల ఆత్మీయ సమ్మేళన నిర్వహణ కమిటీ నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివద్ధి, సంక్షేమ పాలన కొనసాగాలంటే జగన్‌తోనే సాధ్యమని.. వైయస్ఆర్‌సీపీ అభిమానులు జగన్ గెలుపు కోసం అహర్నిశలు శ్రమించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. "నగరంలో స్థిరపడ్డ ఏపీ వాసులు మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిని చేద్దాం" అంటూ ఈనెల 14న కూకట్‌పల్లి ఎస్. కె. ఎస్.ఆర్ గార్డెన్స్‌లో వైయస్ఆర్‌సీపీ అభిమానుల ఆత్మీయ సమ్మేళనని నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కమిటీ నాయకులు రాఘవ, జయవర్ధన్ రెడ్డి, నౌరోజిరెడ్డిలతో కలిసి శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో సుబ్రహ్మణ్యం రెడ్డి ఆవిష్కరించి ప్రసంగించారు. వారు మాట్లాడుతూ పేదల జీవితాలలో వెలుగులు రావాలన్నా, సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగాలన్నా తిరిగి జగనన్న ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. విద్యా వైద్య రంగాలలో జగన్ తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయాలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఏపీలోని ప్రతీ కుటుంబం సంక్షేమ పథకాలు అందుకొని సంతోషంగా ఉన్నారని చెప్పారు. ప్రతీ పేదవాడి కండ్లల్లో ఆనందం కోసం నిరంతరం శ్రమించే జగన్ కోసమే ఈ సభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్వరాష్ట్రంలో జరగనున్న ఎన్నికల కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. టార్గెట్ 175/175 అనే నినాదంతో ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, చంద్రారెడ్డి, సదాశివరెడ్డి, సురేంద్ర, శ్రీనివాస్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



- ఫలకనుమా ఇన్‌స్పెక్టర్ ఆది రెడ్డి

నవతెలంగాణ-ధూల్‌పేట్

శ్రీరామ నవమి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఫలకనుమా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి అన్నారు. ఈ నెల 17న శ్రీరామ నవమి పండుగ సందర్భంగా జంగంమెట్ ప్రాంతంలో ఆయన జంగంమెట్ మార్కెట్, రవీందర్ నాయక్ నగర్ కాలనీ హనుమాన్ టెంపుల్‌లో పర్యటించారు. శ్రీరామ నవమి ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులకు కలసి శ్రీరామ నవమి కార్యక్రమం విషయలు తెలుసుకున్నారు. ప్రశాంతమైన వాతావరణంతో పాటు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, రవీందర్ నాయక్, నగర్ కాలనీ ప్రెసిడెంట్. ఏ. కృష్ణ నాయక్, శ్రీను, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి గ్రూప్స్ పోస్టులు పెంచాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి గ్రూప్ 1,2,3,4 పోస్టులు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం నిరుద్యోగులు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి విద్యానగర్ బీసీ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీ ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ గ్రూప్-1 సర్వీస్ కింద 503 పోస్టులు ప్రకటించారు. కానీ డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోటా పోస్టులు కరెక్టుగా లెక్కిస్తే 1600కు, గ్రూప్-2 సర్వీస్ కింద 783 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ప్రకటించారు. వీటిని కూడా కరెక్టుగా లెక్కిస్తే 2200 లకు, గ్రూప్-3 పోస్టులు 1383 వాస్తవంగా 3వేలకు పైగా ఉన్నవి, గ్రూప్-4 సర్వీస్ కోటా కింద 8500 పోస్టులు ప్రకటించారు. ఇవి 25 వేలకు పైగా ఉంటాయి. టీచర్ పోస్టులు 11వేలు ప్రకటించారు. పీఆర్‌సీ రిపోర్ట్ ప్రకారం 25 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాల పోస్టులు, ఆదర్శ పాఠశాల పోస్టులు వేరువేరుగా జరపడంతో మెరిట్ అభ్యర్థులు ఈ మూడు నాలుగు రకాల యాజమాన్యాల పాఠశాలలో మెరిట్ ఉన్న ఒకే అభ్యర్థి సెలెక్ట్ అవుతారు. ఒకే యాజమాన్యం పాఠశాల లో జాయిన్ అవుతారు. సెలెక్ట్ అయిన మిగతా మూడు వృధా అవుతాయి. అందుకే ఆప్షన్ పద్ధతి పెట్టడం, వెయిటింగ్ లిస్ట్ పెట్టడం, అన్ని ఫలితాలు ఒకేసారి ప్రకటించడం లాంటి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. కొత్త తరాన్ని యువతరాన్ని డైరెక్టు రిక్రూట్ మెంట్ ద్వారా ప్రభుత్వ యంత్రాంగంలోకి తీసుకువస్తే సమర్థవంతమైన, అవినీతికి తావులేని పాలన లభిస్తుందని, యువత శక్తి-యుక్తులు సమాజాభివృద్ధికి ఉపయోగించవచ్చునని యువతను పాలనరంగంలోకి తీసుకువస్తే ఉత్సాహంతో, అంకిత భావంతో నిజాయితీగా పని చేస్తారని తెలిపారు. ఈ ర్యాలీలో గుజ్జా కృష్ణ, వేముల రామకృష్ణ, సి.రాజేందర్, మధుసూదన్, అనంతయ్య, నందగోపాల్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ కో ఆర్డీనేటర్స్ సమావేశం



నవతెలంగాణ-ఓయూ

బీజేపీ తార్నాక డివిజన్ పోలింగ్ బూత్ కో ఆర్డినేటర్స్, బూత్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిల సమావేశం శుక్రవారం డివిజన్ అధ్యక్షుడు రాముపర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ సికింద్రాబాద్ అసెంబ్లీ నాయకులు ప్రభారి రాజ్ భోపాల్ గౌడ్ విచ్చేశారు. పార్టీ సంస్థాగతంగా కార్యకర్తల నివేదిక పైన కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ 12, 13 వ తేదీలలో ప్రతి పోలింగ్ బూత్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శ్రీ రామనవమి సందర్భంగా పార్టీకి అతీతంగా ప్రతీ ఇంటిపైన కాషాయ ధ్వజాలు కట్టాలని తెలిపారు. ఈ నెల 19న కేంద్ర మంత్రి సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి కిషన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేస్తారని ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, వెంకటేష్ గౌడ్, పోచయ్య యాదవ్, వేణు యాదవ్, ప్రకాష్ గౌడ్, వీరన్న, అనిత, గణేష్ ముదిరాజ్, భిక్షపతి యాదవ్, రామకష్ణ, ఆకుల శ్రీనివాస, అనూష, వేణు, బూత్ కోడినేటర్స్, బూత్ అధ్యక్షులు, బూత్ ప్రధాన కార్యదర్శి లు పాల్గొన్నారు.



మైసిగండి మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, సీనియర్ నాయకులు ధాత్రిక్ నాగేందర్ బాబ్జి, అనిల్, సూరి, ధర్మరాజు,రాజేష్ తదితర నాయకులు పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట

రాబోయే భవిష్యత్ అంతా ఏఐదే

- ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో కాలేజీ విద్యార్థులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాబోయే భవిష్యత్ అంతా ఏఐదేనని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జీ. రామేశ్వర్ రావు తెలిపారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇఎస్‌సీఐ), ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) కేంద్ర మంత్రిత్వ శాఖ సహకారంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అండ్ మెషిన్ లర్నింగ్స్ ప్రాముఖ్యతపై ఒక రోజు నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇఎస్‌సీ కళాశాల ప్రాంగణంలోని చాణక్య సెమినార్ హాల్లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో నగరంలోని వివిధ కళాశాలల నుండి 200 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జీ రామేశ్వర్ రావు మాట్లాడుతూ నేటి ఇంజనీరింగ్ వ్యవస్థలో ఏఐ అండ్ ఏంఎల్ ప్రాముఖ్యత బాగా పెరిగిందన్నారు. ప్రతి రంగంలో కత్రిమ మేథస్సు కీలక పాత్ర పోషిస్తున్నదన్నారు విస్తారమైన డేటాను ఉపయోగించడం ద్వారా, ఔత్సాహిక ఇంజనీర్లకు కీలకమైన నైపుణ్యతతో కూడిన పాత్రను ఆర్టిఫిషల్ ఇంటెలిజన్స్ పోషిస్తున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం నెలకొల్పిన ఇఎస్‌సీఐ సంస్థ ఆసియాలో ఇదొక్కటే ఉందని అన్నారు. ఇఎస్‌సీఐ సంస్థ సంవత్సరానికి సుమారు 350 శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేట్ రంగాలలో పనిచేస్తున్న సుమారు 7,000 మంది ఇంజనీర్లకు వివిధ రంగాల్లో అనుభవజ్ఞులతో కావాల్సిన శిక్షణ అందుస్తున్నామని తెలిపారు. మాజీ భారత రాష్ట్రపతి, మిసైల్ సైంటిస్ట్ అబ్దుల్ కలాం కూడా ఈ కేంద్రంలో నాటి ఇంజ నీర్లకు శిక్షణ ఇచ్చారని గుర్తు చేశారు. గౌరవ అతిధులుగా హాజ రైన ఫ్యూచర్లీ ఇంక్ ఫైట్ క్లబ్ సహ వ్యవస్థాపకులు ప్రమోద్, వాల్మార్ట్ అండ్ ల్యాబ్స్, ఫైట్ క్లబ్ నుండి స్టాఫ్ డేటా సైంటిస్ట్, మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్ నితిన్ కిషోర్ తమ అనుభవాలను పంచుకున్నా రు. ఆరోగ్య సంరక్షణ, నావిగేషన్, వ్యవసాయంతో పాటు గా ఇంకా ఎన్నో రంగాలల్లో ఏఐ ఆవిష్కరణలు వచ్చాయని తెలి పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉద్యోగాలు పోతాయనే మాట తప్పన్నారు. ఏఐ ద్వారా కొత్త ఉద్యోగ అవకాశాలు పుట్టుకొ స్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ జోగినపల్లి భాస్కర్, శాంతి, శ్రీమతి దుర్గా భవాని, ఇఎస్‌సీఐ లోని ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సెల్ హెడ్ పీ.సాయి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

'42 అంతస్తుల భవన నిర్మాణానికి జీహెచ్ఎంసీ అనుమతి ఎలా ఇచ్చింది'

- వెంటనే ఆ భవన నిర్మాణ అనుమతిని రద్దు చేయాలి
- అవినీతి నిర్మూలన ధర్మ యుద్ధ సంఘం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

హైదరాబాద్ నగరం నడిబొడ్డున గన్ ఫౌండ్రీలోని మహబూబ్ కాలేజీ ఎదురుగా నిర్మిస్తున్న 42 అంతస్తుల భవన నిర్మాణానికి జీహెచ్ఎంసీ అనుమతి ఎలా ఇచ్చిందని అవినీతి నిర్మూలన ధర్మ యుద్ధ సంఘం ప్రశ్నించింది. ఈ మేరకు శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివకాంత్, ప్రధాన కార్యదర్శి ఎం.పురుషోత్తం, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ తదితరులు మాట్లాడుతూ నిత్యం జన జీవనంతో రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో 42 బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతి ఎలా ఇస్తారని, ఆ భవన నిర్మాణ అనుమతిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే కోర్టును ఆశ్రయి స్తామని వారు హెచ్చరించారు. ఈ బహుళ అంతస్తుల భవన నిర్మాణం వల్ల కాలుష్యం, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ప్రమాదం కూడా పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ 42 అంతస్తుల భవన నిర్మాణానికి జీహెచ్ఎంసీ అనుమతి ఇచ్చిందని, ఒకటిన్నర ఎకరం స్థలంలో ఇప్పటికే 22 అంతస్తులు నిర్మించడం జరిగిందన్నారు. మరో 20 అంతస్తులు నిర్మించడానికి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, ఆ పనులను వెంటనే ఆపి జీహెచ్ఎంసీ నోటీసులు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ నిర్మాణానికి అనుమతిని రద్దు చేయాలని కోరుతూ జీహెచ్ఎంసీ కమిషనర్, సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేసినట్లు వారు చెప్పారు.వెంటనే ఈ విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం జోక్యం చేసుకుని అనుమతిని రద్దు చేసి స్థానిక ప్రజలను కాపాడాలని వారు కోరారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక అక్రమ నిర్మాణాలు విచ్చల విడిగా నగరంలో కొనసాగుతున్నాయని, వాటిని వెంటనే నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
హైదరాబాద్
HMDA

శనివారం | ఏప్రిల్ 13, 2024 | www.navatelangana.com

చైన్‌స్నాచర్ అరెస్టు



నవతెలంగాణ-కాప్రా

చైన్‌స్నాచర్‌ను కుషాయిగూడా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.5,58,000 విలువగల బంగారు ఆభరణాలు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.రాచకొండ సీపీ తరుణ్‌జోషి తెలిపిన వివరాల మేరకు వరంగల్ జిల్లాకు చెందిన పుట్ట హరికృష్ణ రెండేండ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి చెంగిచెర్లలో నివాసముం టున్నాడు. కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్న హరికృష్ణ మద్యానికి, చెడు అలవాట్లకు బానిసయ్యాడు. డబ్బుల కోసం చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నాడు. సమాచారం అందుకున్న కుషాయిగూడా పోలీసులు ప్రత్యేక నిఘా వేసి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జీ.వీర స్వామీ, డీఐ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బహుజనులకు రాజ్యాధికారం దక్కినప్పుడే మహనీయులకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని అఖిల భారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సూరెపల్లి రవికుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బహుజనుల రాజ్యాధికారం-కుల సంఘాల పాత్ర అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూరెపల్లి రవికుమార్ మాట్లాడుతూ... బహుజనుల్లో రాజకీయ చైతన్యం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కుల సంఘాలు ఓటుకు అమ్ముడుపోవడం వల్ల అగ్ర కులాల వారు రాజ్యాధికారాన్ని చేపడుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. కుల సంఘాల్లో సామాజిక స్పృహ ఉండాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికార సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ అంబేద్కరిస్టు జె.బి. రాజు, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వై.కె.రత్నం, ప్రముఖ విద్యావేత్త వడ్డెపల్లి కృష్ణ, పద్మశాలి సంఘం జాతీయ నాయకులు డాక్టర్ చిక్కా దేవదాస్, కొప్పుల దేవేందర్, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-ముషీరాబాద్

బ్లూ షర్ట్స్ బ్లూ మార్చ్‌ను జయప్రదం చేయండి



- డాక్టర్ రామగల్ల సుందర్

నవతెలంగాణ-ఓయూ

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న నిర్వహించబోతున్న బ్లూ షర్ట్స్- బ్లూ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రామగళ్ళ సుందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరవెల్లి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లూ షర్ట్స్- బ్లూ మార్చ్ కరపత్రలు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రామగళ్ళ సుందర్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించుకుందాం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం అనే నినాదంతో అంబేద్కర్ వాదులు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలు అందరూ బ్లూ షర్ట్స్ ధరించి ఏప్రిల్ 14న సాయంత్రం నాలుగు గంటలకుబాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ట్యాంక్ బండ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం వరకు జరిగే బ్లూ మార్చ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బోరెల్లి సురేష్ మాట్లాడుతూ. సబ్బండ వర్గాల గొంతుక బీఎస్ఎఫ్ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో చేపడుతున్న బ్లూ షర్ట్స్ బ్లూ మార్చ్ కార్యక్రమానికి తెలంగాణ అన్ని జిల్లాల నుంచి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరవుతా రని తెలిపారు. రాజ్యాంగాన్ని రక్షించుకుందాం ప్రజాస్వామ్యన్ని పరిరక్షించుకుందాం అనే నినాదంతో సబ్బండ వర్గాలు అయినా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం వస్తే భారత రాజ్యాంగం కనుమరుగవుతుందని అందుకు ఈ దేశం మూలవాసులైన సబ్బండ వర్గాలు గొంతెత్తి అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని నీలి కవాతు నిర్వహించాలని పిలుపునిచ్చారు. బీఎస్ఎఫ్ ఓయూ ఇన్చార్జి కల్వకుర్తి శ్రీశైలం, బిఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ప్రసాద్, బిక్షం, ఆరె కంటి శ్రీకాంత్, మాదిగ జేఏసీ ఓయూ ఇన్‌చార్జి జోగు గణేష్, సీనియర్ రీసెర్చ్ స్కాలర్ ప్రభాకర్, రేవంత్,కర్ణాకర్, ప్రవీణ్, మోహన్, మధు , పాల్గొన్నారు.

రూ.13,33,19,960 నగదు సీజ్

- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా లో పరిధిలల్లో ఇప్పటి వరకు రూ.13,33,19,960 నగదు తో పాటు కోటి 87 లక్షల 98 వేల 039 రూపాయల విలువ గల ఇతర వస్తువులు, 19,902.7 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. 153 మందిపై కేసులు నమోదు చేసి 148 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన నగదు, ఇతర వస్తువులపై 312 ఫిర్యాదులు రాగా వాటిని పరిష్కరించారని, 205 మంది పై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసినట్లు, లైసెన్సు గల 2541 ఆయుధాలను డిపాజిట్ చేసినట్టు రోనాల్డ్ రోస్ తెలిపారు. గత శుక్రవారం 24 గంటల వ్యవధిలో రూ.



1,40,900 నగదు, రూ. 66,603 విలువైన వస్తువులను సీజ్ చేసినట్లు తెలిపారు. ఎక్స్ సైజ్ శాఖ ద్వారా 29.98 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకుని, ముగ్గురిపై కేసులు నమోదు చేసి నలుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నగదు ఇతర వస్తువులపై 6 ఫిర్యాదులు రాగా వాటిని పరిష్కరించామని, ఐదుగురిపై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. 29 లైసెన్స్ ఆయుధాలను డిపాజిట్ చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు 'వర్తన' 3వ సమావేశం

నవతెలంగాణ-సిటీబ్యూరో

వర్తన సాహిత్య సంస్థ అధ్వర్యాన శనివారం ఉదయం 10.30 గంటలకు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో సంస్థ మూడో సమావశం నిర్వహించనున్నారు. సభలో వాక్యం - కవితా వాక్యం అనే అంశం మీద ప్రముఖ కవి, విమర్శకులు ఏనుగు నరసింహారెడ్డి ప్రసంగిస్తారు. సభకు ప్రముఖ రచయిత కవి సి.ఎస్. రాంబాబు అధ్యక్షత వహిస్తారు. యువకవి ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ఈ సభ సందర్భంగా ఏనుగు నరసింహారెడ్డి రచించిన పుస్తకాలు అందుబాటులో ఉంటాయి.

గుడ్, బ్యాడ్ టచ్ పై పిల్లలకు అవగాహన ఉండాలి

నవతెలంగాణ-సిటీబ్యూరో



గుడ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన పిల్లలకు ఉండాలని, అప్పుడే అవి ఆరోగ్యకరమైన సంబంధాలను పెంపొందిం చడానికి సహాయపడుతుందని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా.హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. సామాజిక వేత్తలు హిమజ, లోహిత, మల్లీశ్వరీ ఆధ్వర్యంలో చాంద్రాయణ గుట్టలో ఉన్న రెసిడెన్షియల్ బ్రిడ్జ్ కోర్స్ క్యాంప్‌లో అమ్మాయిలకు స్కూల్‌లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డా హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అమ్మాయిలకు ఎటువైపు నుంచి, ఎప్పుడు, ఏ ఆపద వస్తుందో తెలియట్లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేయడం చాలా అవసరమని చెప్పారు. చిన్న చిన్న సంఘ టనలు, కథల రూపంలో తెలియ చెప్పారు. ఎదుటి వ్యక్తి ఏ విధంగా ప్రవర్తిస్తే బ్యాడ్ టచ్ కింద భావించ వచ్చో స్పష్టంగా చెప్పారు. ఉదాహ రణకు అభ్యంతరకర ప్రదే శాల్లో తాకడం, అసహజంగా ప్రవర్తించ డం, ఒంటరిగా ఎవరూ లేని చోటు కు తీసుకెళ్లడం, అభ్యంత రకరమైన పనులు చేయడం.. ఇలాంటివన్నీ చిన్న చిన్న కథల రూపంలో వారికి అర్థమయ్యే రీతిలో చెప్పారు. మంచి స్పర్శ చెడు స్పర్శ గురించిన జ్ఞానంతో పిల్లలు తమ హక్కులను నొక్కి చెప్పగలరన్నారు .అవాంఛిత శారీరక సంబంధానికి "వద్దు" అని చెప్పవచ్చన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT JANGAON
E.P.NO. 457 OF 2022 IN ARB NO. 41 OF 2016

Between:
Shriram City Union Finance Limited.. ...DHR
And
Chinthakindi Ramesh & others ...JDR

Jdr-1) Chinthakindi Ramesh, S/o. Gopal, Age : 42 yrs, Occ : Business, R/o. 10-4-38/23, Hanuman Nagar, Pochammabasthi, Hyderabad.

Whereas DHR Company above E.P for recovery of Award Amount against you for relief of Immovable Property Attachment of you, these to give you notices that you are to appear before this court in person or by a pleader on this **29th day of April 2024, At 10-30 A.M.** To show cause why execution should not be granted.

//BY ORDER OF THE COURT//
CH. NARSINGA RAO
Advocate for Dhr.
Date:8-4-2024 **Hanamakonda.**

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL (DISTRICT JUDGE) AT WARANGAL
M.V.O.P. NO. 22 OF 2023

Between:
Gugolothu Jyothi ...Petitioner
AND
1) Bhukya Suresh
2) Lakavathu Jyothi
3) Chola MS General insurance co. Ltd. ...Respondents

To
BHUKYA SURESH, S/O. B. GINDYA, AGE: 45 YEARS, OCCU: DRIVER OF CRIME VEHICLE, R/O. H.NO.7-1-414-51/C, SRINIVASA COLONY EAST, S R NAGAR, HYDERABAD DISTRICT.500038.

NOTICE

WHEREAS the Petitioner has filed the above case against you for Compensation claim petition which is posted on 23.04.2024. at 10:30 A.M for your appearance before the Honorable Principal District Judge Court at Warangal. On the said date you have to appear either personally or through your Advocate, failing which the matter will be heard and decided exparte.

// BY ORDER OF THE COURT //
Sd/-
A. KIRAN SINGH
Advocate ,
#2-5-341/1,SRI VENKATESHWARA SWAMY TEMPLE LANE, NAKKALAGUTTA, HANUNAKONDA DISTRICT.

Form No.2
Summons for Settlement of Issues
(Order V Rules 3 & 5, 20 (1-A) CPC)
IN THE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE-CUM-VI ADDITIONAL METROPOLITAN MAGISTRATE, MEDHCAL-MALKAJGIRI DISTRICT AT L. B. NAGAR
O.S.No. 2040 of 2022

BETWEEN:
Union Bank of India, Ramanthapur Branch, Rep. by its Branch Manager .....Plaintiff
AND
Venkatesh Meakala ....Defendant
To
Venkatesh Meakala , S/o M. Venkat, Aged about 45 years, Occ: Taxi Driver, R/o Q.No.1213/1, Railway Quarters, Mettuguda, Hyderabad, Telangana-500 017.

Whereas the Plaintiff Banker has instituted a suit on 14-10-2022 against you for RECOVERY OF LOAN DUE AMOUNT OF Rs.3,25,722.71 paise with consequentail interest and you are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions on the **29th** day of **April,** 2024 at 10-30 O' clock in the forenoon to answer the claim, and further you are hereby directed to file your answer (written statement) within 30 days from the date of publishing of this summon in your defense and to produce on the said day all documents in your possession or power upon which you base your defense.

Take notice that in default of your appearance and to file your written statement within 30 days the suit will be heard and determined in your absence.

(BY ORDER OF THE COURT DATED 27-03-2024)
Yours Sincerely,
NOOKA JAGANNADHAM AND ANOTHER
Advocates,
H.No.3-10-89/10, First Floor, Gokhle Nagar, Near YadaSangam Function Hall, Ramanthapur, Hyderabad-500 013.
Mobile No.9440553770, 9640597419,
e-mail Id: nooka_jagannadham@yahoo.co.in, venulawyer@gmail.com

---

Form No.2
Summons for Settlement of Issues
(Order V Rules 3 & 5, 20 (1-A) CPC)
IN THE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE-CUM-VI ADDITIONAL METROPOLITAN MAGISTRATE, MEDHCAL-MALKAJGIRI DISTRICT AT L. B. NAGAR
O.S.No.419 of 2023

BETWEEN:
Union Bank of India, Ramanthapur Branch, Rep. by its Branch Manager .....Plaintiff
AND
Bayini Raghavender @ Baini Raghavendar ....Defendant
To
Bayini Raghavender @ Baini Raghavendar S/o Hanmanna, Aged about 31 years, Occ: Cab Driver R/o H.No.4-4-81/1, 2nd Floor, Veera Reddy Nagar, Nacharam, Hyderabad, Telangana-500 076.

Whereas the Plaintiff Banker has instituted a suit on 12-06-2023 against you for RECOVERY OF LOAN DUE AMOUNT OF Rs.3,59,833.32 paise with consequentail interest and you are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions on the **29th** day of **April,** 2024 at 10-30 O' clock in the forenoon to answer the claim, and further you are hereby directed to file your answer (written statement) within 30 days from the date of publishing of this summon in your defense and to produce on the said day all documents in your possession or power upon which you base your defense.

Take notice that in default of your appearance and to file your written statement within 30 days the suit will be heard and determined in your absence.

(BY ORDER OF THE COURT DATED 27-03-2024)
Yours Sincerely,
NOOKA JAGANNADHAM AND ANOTHER
Advocates,
H.No.3-10-89/10, First Floor, Gokhle Nagar, Near YadaSangam Function Hall, Ramanthapur, Hyderabad-500 013.
Mobile No.9440553770, 9640597419,
e-mail Id: nooka_jagannadham@yahoo.co.in, venulawyer@gmail.com

---

In the Court of the Principal Junior Civil Judge, Malkajgiri Courts At: Kushaiguda
O.S.No. 327 Of 2024

Between:
1.Sri. G.Nandu Singh S/o. Late. Ganga Singh, Aged about: 65 years, Occ: Retired,
2.Sri. Pradeep Singh S/o. G.Nandu Singh, Aged about: 37 years, Occ: Private Service,
3.Sri. Praveen Singh S/o. G.Nandu Singh, Aged about: 34 years, Occ: Private Service,
4.Smt. G.Sanjana D/o. G.Nandu Singh , Aged about:30 years, Occ:House Wife, ALL 1 to 4, ARE RESIDENTS OF R/o. H. No. 26-112/8, BN 372, Road No.5, Balram Nagar, Neredmet, Malkajgiri -Medchal District, Telangana 500 047. **..Plaintiffs**
AND
1.The Tahsildar, Malkajgiri Mandal, Malkajgiri-Medchal District, Telangana 500047 .
2. All Concerned ...Defendants

Whereas the Plaintiffs have filed Suit for Declaration to Declare the Plaintiffs are the Legal heirs of the Deceased Late. Smt. G.Santosh W/o. G.Nandu Singh. If anyone has any objection or claim they may appear before the court either in person or through Advocate on **01-05-2024** at 10.30A.M., when the case is posted for hearing or the case will be decided ex-parte as per law.

By the orders of the court
S.Sainathan, Advocate, 12-13-853/12, Gokulnagar, Tarnaka, Secunderabad 500017 Mob. 9247840658, Email:s_sainathan@yahoo.co.in.

IN THE COURT OF THEHON'BLE IX JUNIORCIVIL JUDGE, CITY CIVIL COURT AT : HYDERABABAD
O. S. No.1242 of 2024

Between:-
A. Jaya and Others .... Plaintiffs
AND
1) The Thasildar, Asifnagar Mandal, Hyd.
2) All Concerned ...Defendants

Please take notice that the above named Plaintiffs have filed a suit for Declaration to Declare the Plaintiffs as legal heirs of Late Avula Mallesh and the same is stand posted on 19-04-2024, if anybody having any objection in the above suit, appear at 10:30 a.m. before this Hon' ble Court, in person or by an Advocate, failing which the Hon' ble Court will proceed with the matter as per the law.

//BY ORDER OF THE COURT//
K. SHASHI REKHA
SREE RAMULU. D
Advocates
D.No.11-1-889/10, Mahesh Nagar, Seetharambagh, Mallepally Road, Hyderabad-1,
Ph. 9346907430/9133074494

IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE, AT: RAJENDRANAGAR
O.S.No.468 OF 2023

Between: -
Chilika Ravi and others ...Plaintiffs.
And
To Whom So Ever it may Concern and 2 others ...Defendants
To
To Whom so ever it may Concern. ...Defendant No.1

Please take notice that the plaintiffs have filed the above suit for Declaration to Declare the legal heirs of the Deccased Yallala Suvarna Lakshmi, against the Defendants and the above suit is posted **to 29-04- 2024,** for appearance of the Defendant No.1. If you fail to be present or represent by any advocate on the said date and time, the matter will be decided against you in your absence,

(BY ORDER OF THE COURT)
T.SUDARSHAN,
Advocate.
Counsel for Plaintiffs.
R/o.II. No.4-7-175/1/A, Panduranga Nagar, Rajendranagar Mandal, Ranga Reddy District-48,
Cell:7981475792

IN THE COURT OF HON'BLE PRL. SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT : AT :HYDERABAD
O.S. No. 153 of 2024

Between:
Smt. Konda Sravanthi ...Plaintiff
AND
The Tahasildar, Amberpet Mandal And all concern ..Defendants
To,
All Concerned

Please take notice that, the Plaintiff has filed the above SUIT for declaration to declare her as legal heir of Late K. Pushpavathi @ Konda Pushpavathi W/o K.Satyam, who died on 28-10-2011 in respect of Suit Schedule Property and the same has been posted on 03-05-2024. If any person(s) having any objection or claims, they may appear on 03-05-2024 at 10:30 AM before the Hon'ble Court, either in person or through advocate, otherwise the matter will be decided basing the documents available on record.

SCHEDULE PROPERTY

All that the house bearing No. 2-2-185/24/52, Mega City No. 1667, Street No. 8, admeasuring 124.63 Sq.Yds pr 104.01 Sq.Mtrs, situated at Mallikarjuna Cooperative Society, Near R.K. Nagar, Amberpet, Hyderabad, and bounded by:North : 30' ft wide Road
South : Neighbors house No. 2-2-185/24/52/B
East : Plot No. 52/A
West : 18' ft wide Road

**\\ By order of the court **
M/s. K. Surender Reddy
Advocates
Plot No. 31, Sushma Sai Nagar, Vanathalipuram, Hyderabad - 70
Cell : 9948092567

IN THE COURT OF THE HON'BLE JUDGE I ADDL FAMILY COURT CITY CIVIL COURT AT: SECUNDERABAD
(In the matter of the Family Court Act, 1984)
O.P.No.515 of 2022

Between:
Mrs.Mary Asuntha, W/o Lazarus Eugene Age 37 yrs Occ Pvt Empl, R/o 11-4-322/16/8,Chilkalguda,Hyd ...Petitioner
AND
Mr.Lazarus Eugene S/o Lazarus Moses John Edward, Age about 46 yrs Occ Car Driver, C/o D.R. Krishna # 3-3-884, Near Mahalakshmi Kendra Dairy Products, Hyderabad-84. Kutbiguda, ...Respondent
To
Mr.Lazarus Eugene

Please take notice that the above petitioner has filed the above Petition under. section 10 1(x) of Divorce Act, against you seeking for decree of divorce of the marriage solemnized **on 28-05-2003,** at Our Lady of Perpetual Help, Church, Seethaphalmandi, Secunderabad, and the Hon'ble Court was pleased to post the matter **to 23-04-2024,** for you notice and appearance. You are hereby required to attend the court on the said **date 23-04-2024**, either in person or through Advocate Failing which matter will be heard Exparte. Hence this Notice

THOMAS JOSEPH LLOYD
Advocate
LEGAL WITS
ATTORNEYS AT LAW
#5-9-314/1, First Floor St. Josephs Cathedral Premises, Gunfoundry, Abids, Hyderabad-29, 9849179263

IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE RR DISTRICT AT : HAYATHNAGAR
O.S.No. 225 of 2023

Between:-
Donuri Saritha and others ....Plaintiffs
AND
Patabirama Reddy, and Another ..Defendants
To
1, Patabirama Reddy,S/o Not Known to Plaintiff,Age:45 years, Occ: Business,R/o Plot No.2, Tirumala Housing Colony, Hayathnagar old, Anmagal. R.R. District.
2, M. Kavitha,W/o Not Kown to Plaintiff,Age:46 years, Occ: Business,R/o Plot No.3, Tirumala Housing Colony,Hayathnagar old, Anmagal. R.R. District.

NOTICE

Whereas the above named plaintiffs have filed above suit for Perpetual Injunction against you in respect of the open land admeasuring Ac.0-04 1/2gts or 0.040 Hects in Sy No. 120, situated at Anmagal, Hayathnagar Village, under L.B Nagar Municipality, Hayathnagar Revenue Mandal, and Ranga Reddy District, and bounded by: North: Land belongs to G. Maisaiah & others, South:Land belongs to Nadim Bai Addullah & others, East: Land belongs Yerra Yellaiah, West: land belongs to Late Venkatamma and Shankaraiah. and the said case is posted for any claims or objections from any concerned. Hence, if any persons is/are having any claims or objections they may be appear before this Hon'ble court on 16.04.2022 at 10.30 AM, either in person are through an advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte.

// By Order of the court //
(K.Surender Reddy)
Advocate
Ph no. 9948092567

IN THE COURT OF PRINCIPAL SENIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT AT : L.B.NAGAR
O.S.No. 2630 of 2018

Between:
Bank of Baroda, Gaddiannaram Branch, Rep. by its Chief Manager Hyderabad .....Plaintiff
and
M/s. Devi Enterprises and others ....Defendants
1. M/s. Devi Enterprises Rep.by its partners R/o. Plot No.43, D. No.2-56, Shanthinagar, Vanastalipuram Hyderabad 500 070
2. Sri.Aerumella Ravi Chakravarthy s/o Sri.Ashok Rao, aged 34 years, Partner of M/s. Devi Enterprises R/o.S1, B-243, Sachivalayanagar, Vanastalipuram, Hyderabad 500 070
3. Sri.Chileveri Dhanraj s/o.Sri.Yadgiri, aged 28 years, Partner of M/s. Devi Enterprises R/o.6-1-143/2 Vanasthalihills Hayathnagar, Hyderabad 500 070

Please take notice that the above suit is filed against you for recovery of money of Rs. 6,22,000.00 and the same is posted to 22.04.2024 for your appearance. You may appear either in person or through an advocate before the said court on the said date at 10.30 A.M, failing which, the matter will be decided ex-parte.

(By Court Order)
SRINIVAS CHITTURU)
ADVOCATE
3-4-533, BARKATPURA
HYD -500 027
COUNSEL FOR PLAINTIFF

IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE RR DISTRICT AT : HAYATHNAGAR
O.S.No. 224 of 2023

Between:-
Tokalla Ram Reddy and another ....Plaintiffs
AND
Patabirama Reddy, and Another ..Defendants
To
1, Patabirama Reddy, W/o Not Known to Plaintiff, Age:45 years, Occ: Business, R/o Plot No.2, Tirumala Housing Colony,Hayathnagar old, Anmagal. R.R. District.
2, M. Kavitha,S/o Not Kown to Plaintiff,Age:46 years, Occ: Business,R/o Plot No.3, Tirumala Housing Colony,Hayathnagar old, Anmagal. R.R. District.

NOTICE

Whereas the above named plaintiffs have filed above suit for Perpetual Injunction against you in respect of the open land measuring Ac.0-03gts in Sy No.120, situated at Anmagal, Hayathnagar Village, under L.B Nagar Municipality,Hayathnagar Revenue Mandal, and Ranga Reddy District, and bounded by: North:Land belongs to G. Maisaiah & others, South:Land belongs to Nakka Mallaiah &others, East: Land belongs to Sy. No.120 part, West: land belongs to B.Swamy and Shankaraiah. and the said case is posted for any claims or objections from any concerned. Hence, if any persons is/are having any claims or objections they may be appear before this Hon'ble court on 16.04.2022 at 10.30 AM, either in person are through an advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte.

// By Order of the court //
(K. Surender Reddy)
Advocate
Ph no 9948092567

IN THE COURT OF THE MVACT CUM XI ADDL, CHIEF JUDGE CITY CIVIL COURT AT : HYDERABAD
O.P.No.: 1810 of 2022

Between:
B.Jithendhar Reddy ...Petitioner
AND
Chakali Narsimha, and others ...Respondents
To
1. Chakali Narsimha s/o. Ch. Anjaiah R/o: 1-9-18/5, Ravindra nagar, Habsiguda, Uppal, Medchal district.

please take notice that the above petitioners has filed the case for grant of compensation for the injuries sustained by him; in a motor vehicle accident with Goods vehicle bearing No.TS-08-UG-7105, which occurred on 08-04-2022, under the limits of P.S. Uppal.

The above case is posted to 06-05-2024, at 10-30 AM for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either on person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
K.ANAND REDDY
D.VENKAT RAMANA
Counsels for the Petitioner
F.No. 212, Jamuna Towers, Malakpet, Hyderabad-36.

IN THE COURT OF THE HON'BLE II ADDL JUNIOR CIVIL JUDGE CUM VII ADDL METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DISTRICT: AT : HAYATHNAGAR
O.S.NO.258 OF 2024

Between :
Dharampuri Madhavi & others. ..Plaintiffs
And
The Tahsildar, Abdullapurmet Mandal,Ranga Reddy District &others. ..Defendants

Please take notice that the above plaintiffs herein have filed the above suit for declaration to declare them as the legal heirs of the deceased Hanumanth Rao @ Dharampuri Hanumanth Rao, S/o. Late D.Pandu Ranga Chary, who died on 21-12-2020 before this Hon'ble court vide O.S.No.258 of 2024. The above suit is posted for your appearance on 29-04-2024. Hence, if any person or persons having any objection/interest in respect of the claims made by the plaintiffs may appear before the above said Hon'ble Court at 10.30 a.m. in person or through your counsel, failing which the matter will be decided in your absence according to law.

SCHEDULE OF PROPERTY

All that piece and parcel of open land bearing plot No.254 in survey No.381/AA, admeasuring 200 Sq.yds or equivalent to 167.22 Sq.meters situated at Batasingaram Village, Hayath nagar Rev Mandal Ranga Reddy District under Batasingaram Gram Panchayath and registration of Sub-Registrar office, Pedda Amberpet, Ranga Reddy District and bounded by: North : Plot No.255.South : Plot No.253
East : 33 wide Road
West : Plot No.265.

// By order of the Hon'ble Court//
Sudha Kiran Thakur
Advocate
New Santhosh Nagar, Hyderabad.
Mobile No. 9014387974.

IN THE COURT OF THE M.A.C.T-CUM XII ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURTS, AT: SECUNDERABAD.
OP NO: 84 of 2023

Between:
Annapu Reddy Annapurna & others Vs D.Durga Prasad & Another

NOTICE

To
R1.D.Durga Prasad, S/o.Late. Sri DH Gandhi, Age: Major, Occ: Business,R/o.Hno.11-9-51, Road No.1, Lakshmi Nagar Colony, Kothapet, Rangareddy, Telangana- 35.

WHEREAS the Petitioners have filed the above case against you for compensation under M.V Act and Rules and the same is posted for your appearance on **15.04.2024.**

Hence, you are requested to appear before the said Hon'ble Court, **at 10.30 AM** either in your person or through your Advocate on the said date, otherwise, the matter will be decided in your absence.

//BY ORDER//
M/s P.Srinivas, M.Dhanalakshmi, N.Raju Naik, K.Sneha, Advocates.
H.NO.6-18/1, "SHREE" NIVAS, Sreeram Nagar Colony, Anupuram, Kapra, ECIL, Hyderabad-500 062
Mobile: 9246365011. COUNSEL FOR THE PETITIONERS

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, DISTRICT R.R AT: L.B.NAGAR
I.A.No. 26 OF 2023 IN O.S.NO. 1535 OF 2015

Between:
P.Mallesh Yadav ...Petitioner/Defendant
AND
1.Anitha and others. .... Respondents/ Plaintiffs/Defendants
To,
2.Sabitha W/o Vijay Kumar D/o Late Pochaiah, Age about 37 years, Occ: Housewife, R/o D.No. 1-73, Venkatapuram (V), Saroornagar (M), District Ranga Reddy **...R 2**
4. P.Yadamma W/o Late Pochaiah, Age 70 years, Occ:Housewife, R/o D.No. 1-73, Venkatapuram (V), Saroornagar (M), District Ranga Reddy. **...R 4**
7.P.Surendar S/o Late Pochaiah Age about 43 years, Occ:Business, R/o D.No. 1-73, Venkatapuram (V), Saroornagar (M), District Ranga Reddy **..R 7**
8.K.Saritha W/o K.Prem Kumar D/o Late Pochaiah, aged about 45 years, Occ:Housewife, R/o D.No. 1-73, Venkatapuram (V), Saroornagar (M), District R. R. **...R 8**
9.P.Sangeetha W/o D/o Late Pochaiah, Age about 47 years, Occ:Housewife, R/o D.No. 1-73, Venkatapuram (V),Saroornagar (M), District Ranga Reddy. **...R 9**
.... Respondents/ Plaintiffs/Defendants

Please take notice that the above I.A.26/23 In O S..No.1535 /2015 is filed against you and others inspite of notices sent to you through Court and Post, the same were returned unserved, hence the Hon'ble Court posted above case on 24/4/2024, at 10:30 A.M. for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)
M/s.K.Vigneshwara Chary
Advocate
D.No.2-42/2, Chaithanyapuri, Hyderabad.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : AT NALGONDA
I.A. NO. 519 OF 2022 IN O.S. NO. 241 OF 2013

Between:
1.Yarida Janakamma (SINCE DIED) and Others ....Petitioners/Plaintiffs
AND
Mamilla Venkataiah (SINCE DIED) ....Responcents/Defendants
To
The Responcents/Defendants No.3 To 5
03. Mamilla Yashoda W/o Late Venkataiah, Age. 60, Occ. Agriculture R/o H.No. 17-261, Praghathi Hills, Hyderabad.
04. Mamilla Kondal S/o Late Venkataiah, Age. 40, Occ. Agriculture, R/o H.No. 17-261, Praghathi Hills, Hyderabad.
05. Mamilla Giri S/o Late Venkataiah, Age.39. Occ. Agriculture R/o H.No. 17-261, Praghathi Hills, Hyderabad.

Take notice that the Plaintiffs filed the above suit for the relief of partition and separate of possession in respect of the suit schedule property during the pendency of the suit the Defendant No.1 died and the Petitioner filed the above petition and the same is posted on 24.04.2024, for your appearance in the above case. Hence, you are here by directed to appear in person or through advocate duly instructed by you, before the Hon'ble Court on 24-04-2024 at 10.30A.M, without fail, if you failed to appear before the Hon'ble Court which the matter will be decided against you as per Law.

// BY ORDER OF THE COURT //
T. KIRAN KUMAR, TS/427/1996
B. ASHOK KUMAR, TS/1477/2009
ADVOCATES, NALGONDA.
Cell : 9866705550.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : AT NALGONDA
I.A. NO. 520 OF 2022 IN O.S. NO. 241 OF 2013

Between:
1.Yarida Janakamma (SINCE DIED) and Others ....Petitioners/Plaintiffs
AND
Mamilla Venkataiah (SINCE DIED) ....Responcents/Defendants
To
The Responcents/Defendants No.3 To 5
03. Mamilla Yashoda W/o Late Venkataiah, Age. 60, Occ. Agriculture R/o H.No. 17-261, Praghathi Hills, Hyderabad.
04. Mamilla Kondal S/o Late Venkataiah, Age. 40, Occ. Agriculture, R/o H.No. 17-261, Praghathi Hills, Hyderabad.
05. Mamilla Giri S/o Late Venkataiah, Age.39. Occ. Agriculture R/o H.No. 17-261, Praghathi Hills, Hyderabad.

Take notice that the Plaintiffs filed the above suit for the relief of partition and separate of possession in respect of the suit schedule propety during the pendency of the suit the Defendant No.1 died and the Petitioner filed the above petition and the same is posted on 24.04.2024, for your appearance in the above case. Hence, you are here by directed to appear in person or through advocate duly instructed by you, before the Hon'ble Court on 24-04-2024 at 10.30A.M, without fail, if you failed to appear before the Hon'ble Court which the matter will be decided against you as per Law.

// BY ORDER OF THE COURT //
T. KIRAN KUMAR, TS/427/1996
B. ASHOK KUMAR, TS/1477/2009
ADVOCATES, NALGONDA.
Cell : 9866705550.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : AT NALGONDA
I.A. NO. 521 OF 2022 IN O.S. NO. 241 OF 2013

Between:
1.Yarida Janakamma (SINCE DIED) and Others ....Petitioners/Plaintiffs
AND
Mamilla Venkataiah (SINCE DIED) ....Responcents/Defendants
To
The Responcents/Defendants No.3 To 5
03. Mamilla Yashoda W/o Late Venkataiah, Age. 60, Occ. Agriculture R/o H.No. 17-261, Praghathi Hills, Hyderabad.
04. Mamilla Kondal S/o Late Venkataiah, Age. 40, Occ. Agriculture, R/o H.No. 17-261, Praghathi Hills, Hyderabad.
05. Mamilla Giri S/o Late Venkataiah, Age.39. Occ. Agriculture R/o H.No. 17-261, Praghathi Hills, Hyderabad.

Take notice that the Plaintiffs filed the above suit for the relief of partition and separate of possession in respect of the suit schedule property during the pendency of the suit the Defendant No.1 died and the Petitioner filed the above petition and the same is posted on 24.04.2024, for your appearance in the above case. Hence, you are here by directed to appear in person or through advocate duly instructed by you, before the Hon'ble Court on 24-04-2024 at 10.30A.M, without fail, if you failed to appear before the Hon'ble Court which the matter will be decided against you as per Law.

// BY ORDER OF THE COURT //
T. KIRAN KUMAR, TS/427/1996
B. ASHOK KUMAR, TS/1477/2009
ADVOCATES, NALGONDA.
Cell : 9866705550.

రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ - చైతన్యపురి

ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సాజిద్ నివాసంలో ఏర్పాటు చేసిన రంజాన్ వేడుకల్లో మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఆమె వెంట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు లిక్కి ఊర్మిళా రెడ్డి, శ్రీమన్నారాయణ, మహేందర్ రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఎల్బీనగర్ -మహేశ్వరం

శనివారం | ఏప్రిల్ 13, 2024 | www.navatelangana.com







రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రచార రథాలు ఎల్బీనగర్ స్టేడియంలో సిద్ధమవుతున్నాయి.



నేను పడిన కష్టాలను మరువను

కరీంనగర్ జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలోని ఒక నిరుపేద దళిత కుటుంబంలో జన్మించి పేదరికం కారణంగా బాల్యంలో అష్ట కష్టాలు అనుభవించి స్వయంకృషితో ఎదిగానని.. అయితే తన బాల్యంలో పేదరికంతో పడ్డ కష్టాలను ఎప్పటికీ మరువనంటున్న ఖైరతాబాద్ జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్యాంసంగ్‌తో అంబేద్కర్ జయంతి సందర్భంగా నవతెలంగాణ సీనియర్ విలేకరి పులికంటి మల్లికార్జున్ ప్రత్యేక ఇంటర్వ్యూ...

నవతెలంగాణ విలేకరి : నమస్తే శ్యాంసంగ్ గారు. మీకు ముందస్తుగా అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు

శ్యాంసంగ్ : థాంక్యూ వెరీ మచ్. అలాగే అందరికీ ముందుగా అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు.

నవతెలంగాణ విలేకరి : మీ స్వస్థలము, విద్యాభ్యాస వివరాలు చెప్పండి..?

శ్యాంసంగ్ : మాది స్వస్థలం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చెల్లూరు దగ్గర ఏరువాక అనే గ్రామం. మాది నిరుపేద దళిత కుటుంబం. మాకు ఏ మాత్రం భూమి లేనందున మా తల్లిదండ్రులు ఊరిలో కూలి పనులు చేస్తుండేవారు. మేము మొత్తం ఆరుగురు సంతానం. నేను చివరి వాడిని. తరువాత ఊరిలో కూలి పనులు దొరకకపోవడంతో నా బాల్యంలోనే మేము మా గ్రామం నుండి హైదరాబాద్‌కు వలస వచ్చాము. ఇక్కడ మా తల్లిదండ్రులు కూలి పనులు చేసి మమ్మల్ని పెంచారు.

నవతెలంగాణ విలేకరి : మీ విద్యాభ్యాసం ఎక్కడ కొనసాగింది..?

శ్యాంసంగ్ : నేను ఎస్ఎస్‌సీ వరకు హైదరాబాద్‌లోని మెహబూబ్ కాలేలో చదువుకున్నాను తర్వాత ఎస్పీ రోడ్డులోని గవర్నమెంట్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాను. తర్వాత ఉస్మానియా యూనివర్సిటీలో బీఏ డిగ్రీ పాసయ్యాను.

నవతెలంగాణ విలేకరి : మరి టౌన్ ప్లానింగ్ విభాగానికి ఎలా వచ్చారు..?

శ్యాంసంగ్ : నేను డిగ్రీ పూర్తి అయిన తర్వాత కొన్ని సంవత్సరాలు జీహెచ్ఎంసీలో క్లర్క్‌గా పని చేశాను. ఆ తర్వాత నాగోల్‌లోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఒకవైపు ఉద్యోగం చేసుకుంటూనే సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా పూర్తి చేశాను. తర్వాత టౌన్ ప్లానింగ్ విభాగంలో సెక్షన్ ఆఫీసర్‌గా నా కొత్త జీవితాన్ని ప్రారంభించాను.

నవతెలంగాణ విలేకరి : ప్రస్తుతం దళితులపైన వివక్షత గతంతో పోలిస్తే ఎట్లా ఉంది?

శ్యాంసంగ్ : గతంలో కంటే దళితులపైన వివక్షత చాలావరకు తగ్గిందని నా అభిప్రాయం. దీనికి దళితులలో వచ్చిన చైతన్యం ఒక కారణం. అలాగే నేటి రోజులలో దళితులకు విద్య ప్రాముఖ్యత అర్థం అయింది. దాని వలన చాలామంది దళితులు కష్టపడి ప్రభుత్వ ప్రయివేటు రంగాలలో ఉన్నత ఉద్యోగాలు సాధించారు, సాధిస్తున్నారు. ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. దీంతో వివక్షత తగ్గింది కానీ పూర్తిగా అంతం కాలేదు.

నవతెలంగాణ విలేకరి : మరి వివక్షత పూర్తిగా అంతం కావాలంటే తీసుకోవాల్సిన చర్యలు ఏమిటని మీ అభిప్రాయం.

శ్యాంసంగ్ : సమాజంలో దళితుల పట్ల వివక్షత పోవాలంటే ముందుగా ప్రతి ఒక్కరూ విద్య ప్రాముఖ్యతను గుర్తించాలి. ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించి ఆయా రంగాలలో ఉన్నత స్థానాలకు ఎదగాలి. సమాజం మనం ఉన్నత స్థానంలో ఉంటే తప్పక మనల్ని గౌరవిస్తుంది. మరి ఆ స్థానానికి చేరుకోవాలంటే ప్రభుత్వం తనవంతుగా ప్రతీ ఒక్కరికి బెస్ట్ ఎడ్యుకేషన్ ఇవ్వడానికి తోడ్పాటు ఇవ్వాలి. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు వేరు వేరు హాస్టల్ లు అని కాకుండా కుల వివక్షత లేకుండా అందరికీ ఓకే ప్లాట్‌ఫామ్ పైన హాస్టల్స్‌ను ఏర్పరచాలి. వీటి ద్వారా వివక్షతను చాలా వరకు తగ్గించవచ్చని నా వ్యక్తిగత అభిప్రాయం.

నవతెలంగాణ విలేకరి : మీరు మీ ఉద్యోగ జీవితంలో ఏనాడైనా వివక్షత ఎదుర్కొన్నారా?

శ్యాంసంగ్ : అదృష్టవశాత్తు లేదనే చెప్పాలి. నేను నా డ్యూటీని నిబద్ధతతో చేస్తాను. అందువలన కావచ్చు ఉన్నతాధికారులు నన్ను ఎప్పుడూ గుర్తించి గౌరవించారు. నా సహ ఉద్యోగులు నాతో స్నేహపూర్వకంగా ఉన్నారు.

నవతెలంగాణ విలేకరి : ఉద్యోగ జీవితంలో మీకు తృప్తినిచ్చిన విషయాలు

శ్యాంసంగ్ : మన హైదరాబాద్ ట్రాఫిక్ కష్టాల గురించి మనందరికీ బాగా తెలుసు. ట్రాఫిక్ లో ఇరుక్కుపోతే నరకం చూస్తాము. ఇలాంటి ట్రాఫిక్ కష్టాలు తొలగించడానికి ప్రభుత్వం చేపట్టిన పథకాలలో భాగంగా సీతాఫల్మండి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో స్థల సేకరణ ఆరు నెలలలో పూర్తిచేసి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసాం. వైఎంసీఏ నుండి బేగంపేటకు రోడ్డు వెడల్పును సంవత్సర కాలంలో పూర్తి చేశాను. దీనిలో భాగంగా ఆనంద్ థియేటర్ దగ్గర ఒక చిన్న గుడి రోడ్డు మధ్యలో రావడంతో రోడ్డు విస్తరణ పని ఆలస్యం కాసాగింది. దాంతో నేను ఆ గుడి యజమానితో మాట్లాడి వ్యక్తిగతంగా నష్టపరిహారం చెల్లించి ఆ గుడిని రోడ్డు పక్కన నిర్మించాం. జూబ్లీహిల్స్ జంక్షన్ నుంచి మాదాపూర్ వరకు రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని అధికారులమంతా టీం వర్క్ చేసి మూడు నెలల్లోనే పూర్తి చేసాము. ఈ విధంగా నగర ప్రజల ట్రాఫిక్ కష్టాలను తొలగించడంలో నా పాత్ర నాకు చాలా సంతోషాన్ని, తృప్తిని ఇచ్చింది.

నవతెలంగాణ విలేకరి : మీరు ఈ స్థితికి చేరుకోవడానికి మీకు ఎలాంటి ప్రోత్సాహం లభించింది.

శ్యాంసంగ్ : నా ఉద్యోగ జీవితం తొలినాళ్లలో జీహెచ్ఎంసీలో అప్పటి ఉన్నతాధికారి ధనుంజయ రెడ్డి ఐఏఎస్, అప్పటి మా సీసీపీ పురుషోత్తం రెడ్డి నాకు ఎంతో సహాయ సహకారాలు అందించారు. అలాగే నా వ్యక్తిగత జీవితంలో నా భార్య నాకు ఎంతో తోడ్పాటును, సహాయ సహకారాలను అందించారు.

నవతెలంగాణ విలేకరి : చివరగా మీ జీవితంలో ఇంకా ఏమి సాధించాలనుకుంటున్నారు?


శ్యాంసంగ్ : నా జీవితంలో ప్రత్యేకంగా సాధించాలని నేను ఏమీ అనుకోవడం లేదు. కానీ నా జీవితంలో నేను అనుభవించిన పేదరికం తద్వారా వచ్చే కష్టాలను ఎన్నటికీ మరువలేను. కాబట్టి పేదలకు సహాయం చేయడం నాకు ఎంతో తృప్తిని ఇస్తుంది.

అగ్నిప్రమాదం సంభవిస్తే 101



ఎక్కువగా వేసవికాలంలో ప్రజల నిర్లక్ష్యం కారణంగా తరచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తాయి. ముంబాయి 1944 ఏప్రిల్ 14న విక్టోరియా డాక్ యార్డ్‌లో ఒక నౌకకు అగ్నిప్రమాదం సంభవించి విధి నిర్వహణలో ఉన్న 66 మంది అగ్నిమాపక సిబ్బంది అసువులు బాసిన కారణంగా వారి జ్ఞాపకార్థంగా ప్రతి ఏటా ఏప్రిల్ 14నుండి 20వరకు దేశ వ్యాప్తంగా అగ్నిమాపక దళ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. కర్తవ్య నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బందికి జోహార్లు అర్పించడం, అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి ప్రజలను చైతన్య పర్చడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యం...









> అప్రమత్తంగా లేకుంటే అంటుకుంటుంది

> అవగాహనతోనే అగ్నిప్రమాదాల నివారణ

> ఈనెల 14 నుంచి 20 వరకు అగ్నిప్రమాద వారోత్సవాలు



నవతెలంగాణ- హయత్‌నగర్

అగ్నిప్రమాద నివారణ పద్ధతులు

చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు వంటి ఇతర మండే పదార్థాలను అందుబాటులో ఉంచకూడదు. కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు ఆర్పకుండా అజాగ్రత్తగా పారేయ్యకూడదు. ఐఎస్ఐ ఎలక్ట్రిక్ వైరింగ్ పరికరాలనే వాడాలి. ఓవర్ లోడ్ పడకుండా, ఎలక్ట్రికల్ సాకేట్ నందు కెపాసిటీ తగిన ప్లగ్‌ను వాడాలి. ఇంటికి తాళం వేశాక లైట్స్ మెయిన్ ఆఫ్ చేయాలి. వంటింటి కింద, పై భాగంలో గాలి, వెలుతురు ఉండేటట్లు చూడాలి. చిన్న పిల్లలను అజాగ్రత్తగా వంట గదిలో వదిలివేయకూడదు. ఐ ఎస్ ఐ గ్యాస్ ట్యూబ్‌లను మాత్రమే వాడాలి. గ్యాస్ వాడకం పూర్తి అయిన వెంటనే రెగ్యులేటర్ వాల్యూ ఆపు చేయాలి. గ్యాస్ లీక్ అవుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్ వాల్యూ ఆపు చేయాలి. అటువంటి సమయంలో ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయకూడదు. వంట గదిలో పెట్రోల్, డీజిల్, అదనపు గ్యాస్ సిలిండర్లను ఉంచకూడదు. మీ దుస్తులకు నిప్పు అంటుకున్నప్పుడు నేలపై దొర్లాలి. లేదా దుప్పటి చుట్టుకోవాలి. కాలిన శరీర భాగాలమీద చల్లటి నీరు పోయకూడదు.

స్కూల్స్, హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్‌లో జాగ్రత్తలు...

స్కూల్స్, హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్ పై కప్పు ఆర్ సీ సీ లేదా కాంక్రీటు స్లాబ్‌లను మాత్రమే వాడాలి. ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలి. సెల్లార్‌లలో ఆటోమేటిక్ స్ప్రింక్లర్‌లను ఉపయోగించాలి. స్కూల్స్, హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్‌లో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు క్షేమంగా తప్పించుకునేందుకు గాను సరైన ప్రణాళికలు రచించి.. అది అందరికీ తెలిసే విధంగా తగు ప్రదేశాల్లో ఉంచాలి. షాపింగ్ మాల్స్ నందు ఎలక్ట్రికల్ సామగ్రి అంతా ఐ ఎస్ ఐ మార్క్ కలిగిన వాటిని మాత్రమే వాడాలి. హాస్పిటల్స్, స్కూల్స్ నందు బయటికి వెళ్ళు మార్గాలలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలి. తాటాకులు, గడ్డితో చేసిన స్కూల్స్, షాపింగ్ మాల్స్ పై కప్పుకు వాడరాదు. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు అగ్నిప్రమాదం జరగకుండా మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్స్ ను అమార్చాలి. ఫైర్ ఎవాక్యూయేషన్ డ్రిల్లును ప్రతి మూడు నెలలకు ఒక సారి క్రమం తప్పకుండా ప్రాక్టీసు చేయాలి.

గోదాములు, గిడ్డంగులలో..

గోదాములు, గిడ్డంగులలో స్టోర్ చేసే స్టాకును చెక్క స్లీపరుపై మాత్రమే ఉంచాలి. తగినంత నీరు, ఇతర అగ్నిమాపక సాధనాలు సిద్ధంగా ఉంచుకోవాలి. వస్తువుల నిల్వలు 4.5మీటర్ల ఎత్తు కంటే ఎక్కువ నిల్వ చేయకూడదు. తగినంత గాలి, వెలుతురు ఉండాలి.

తాత్కాలిక నిర్మాణాలు, పందిర్లు..

అగ్ని నిరోధక స్వభావం గల వస్తువులతోనే పందిర్లు నిర్మించాలి. పందిర్ల చుట్టూ కనీసం 4.5మీటర్ల ఖాళీ స్థలాన్ని ఉంచాలి. ఎలక్ట్రికల్ లైన్ వైర్లకు,పెండాల్స్‌కు కనీసం 2 మీటర్ల దూరాన్ని ఉంచాలి.

గ్రామీణ ప్రాంతాలలో..

గ్రామీణ ప్రాంతాలలో పూర్తిగా ఎండిన గడ్డిని మాత్రమే వాములుగా వేయాలి. పెద్ద గడ్డి వాములకు బదులు చిన్న చిన్న గడ్డి వాములుగా నిర్మించుకోవాలి. గుడిసెకు, గుడిసెకు మధ్య కనీసం 30 అడుగుల దూరం పాటించాలి. వంట పొయ్యిలను పడుకునే ముందు ఆర్పివేయాలి. అగ్ని నుండి రక్షణ చర్యల కోసం తగినంత నీటిని నిల్వ ఉంచుకోవాలి.

కర్మాగారాలలో...

కార్మాగారాలలో పనిచేసే ఉద్యోగులందరికీ అగ్ని ఉనికి ప్రదేశాలను గుర్తించేవిధంగా ఏర్పాటు చేయాలి. సిబ్బందికి బేసిక్ ఫైర్ ఫైటింగ్ లో శిక్షణ ఇవ్వాలి. అగ్నిప్రమాదాలు జరిగే ప్రదేశాలు గుర్తించాలి. సర్క్యూట్ లను ఓవర్ లోడ్ చేయకూడదు. ఎలక్ట్రికల్ ఫైర్ జరిగినప్పుడు ప్రథమంగా మెయిన్ స్విచ్ ఆఫ్ చేసిన తరువాత ఫైర్‌ను ఆర్పడానికి ప్రయత్నించాలి. విద్యుత్ ప్రవహిస్తున్న వైర్ల, తీగలపై అత్యవసర పరిస్థితులలో కార్బన్ డయాక్సైడ్ ఎక్స టిన్గ్విషర్లను ఉపయోగించాలి.



డూప్లికేట్ ఎలక్ట్రికల్ వైర్ల వలన షార్ట్ సర్క్యూట్

ఎక్కువగా షార్ట్ సర్క్యూట్ జరగడానికి ప్రధాన కారణం విద్యుత్ వైర్లు. ఐఎస్ఐ వాడక పోవడం, అధిక లోడ్ వలన కూడా షార్ట్ సర్క్యూట్ జరుగుతుంది. జీహెచ్ఎంసీ పరిధిలో 15మీటర్ల పైన ఉంటే ఫైర్ అధికారులు ఎన్ఓసీ ఇస్తారు. లోపు అయితే జీహెచ్ఎంసీ అధికారులు అనుమతులు మంజూరు చేస్తారు. సెల్లార్ లో, షటర్‌లలో ఆయిల్స్, కెమికల్స్ నిల్వ ఉంచడం వలన కూడా మంటలు వ్యాపిస్తాయి.

రంగారెడ్డి జిల్లా ఫైర్ అధికారి నాగేశ్వర్ రావు



అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నెంబర్లు..

అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నెంబర్లు.. జిల్లా అగ్నిమాపక అధికారి 8712699168, మల్కాజిగిరి అధికారి 8712699403, చర్లపల్లి అధికారి 8712699405, హయత్ నగర్ ఫైర్ అధికారి 8712699407 ను సంప్రదించాలి.



ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేద్దాం



బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ

నవతెలంగాణ - చైతన్యపురి

చేవెళ్లలో జరిగే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేద్దామని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. గ్రీన్ హిల్స్ కాలనీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేవెళ్ల బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని అన్నారు. శనివారం చేవెళ్లలో జరిగే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ హక్కుల కోసం పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీలు కొట్లాడుతారని అన్నారు. మన సమస్యలు పరిష్కారం కావాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలని కోరారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి చేవెళ్ల ఎంపీ అభ్యర్థిని గెలిపించడం కోసం చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ప్రతి ఒక్కరూ గెలుపు కోసం కృషి చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, శ్రీమన్నారాయణ, దుబ్బాక శేఖర్, రమేష్, పాషా, శ్రీకాంత్ గౌడ్, కుమార్, మహేందర్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఐ అత్యుత్తమ జియో సైన్స్ ఆర్గనైజేషన్

- **జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ జనార్దన్ ప్రసాద్**

నవతెలంగాణ- నాగోల్

జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా అత్యుత్తమ జియో సైన్స్ ఆర్గనైజేషన్ అని జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ జనార్దన్ ప్రసాద్ అన్నారు. 2023 సెప్టెంబర్ 18 నుండి 2024 ఏప్రిల్ 12 వరకు 7 నెలల పాటు 84 మందితో ప్రారంభమైన 47వ బ్యాచ్ భూ వైజ్ఞానిక శాస్త్రవేత్తల శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. నాగోలు డివిజన్‌లోని బండ్లగూడలో గల భారతీయ భూవైజ్ఞానిక సర్వే శిక్షణా సంస్థ (జి.యస్.ఐ.టి.ఐ.) యొక్క ఎం ఎస్ కృష్ణన్ ఆడిటోరియంలో యూనియన్ కమిషన్ సర్వీస్ కమిషన్ ద్వారా రిక్రూట్ చేయబడిన 47వ కొత్త బ్యాచ్‌కి చెందిన 84 మంది భూవైజ్ఞానిక శాస్త్రవేత్తల యొక్క ఓరియంటేషన్ కోర్సు ముగింపు కార్యక్రమం డైరెక్టర్ జనరల్ జనార్దన్ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జనార్దన్ ప్రసాద్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి దోహదపడే క్రిటికల్, స్ట్రాటజిక్ ఖనిజ నిక్షేపాల అన్వేషణకు 47వ కొత్త బ్యాచ్ జియలగిస్టు తమ నైపుణ్యాన్ని వినియోగించి వంతు కృషి చేయాలని ట్రైనీ అధికారులకు సూచించారు.

డాక్టర్ మాథ్యూ జోసెఫ్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్, హెడ్ మిషన్-వీ మాట్లాడుతూ 7నెలల పాటు సాగిన ఈ శిక్షణా కార్యక్రమాన్ని క్రమశిక్షణ, అంకితభావంతో విద్యార్థి దశ నుంచి ప్రొఫెషనల్ జియోలజిస్ట్‌గా విజయవంతంగా పూర్తి చేసిన అధికారులందరినీ అభినందించారు. తర్వాత శ్రీ శ్యామ ప్రసాద్ భూటియా, డైరెక్టర్ హైదరాబాద్ కోర్సు యొక్క పూర్తి వివరాలను అందజేశారు. అనంతరం శిక్షణ పొందిన ట్రైనీ అధికారులందరికీ డైరెక్టర్ జనరల్, డిడిజి అండ్ హెడ్, మి-వీ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డా.మాథ్యూ జోసెఫ్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్, హెడ్ మిషన్-5 డిప్యూటీ డైరెక్టర్ జనరల్స్, డైరెక్టర్లు, అధ్యాపకులు, శిక్షణా సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఈ పరీక్షలు తప్పనిసరి..

వయసు పైబడుతున్న కొద్దీ ఏదో ఒక ఆరోగ్య సమస్య వెన్నాడుతూనే ఉంటుంది. రోగం తీవ్రం కాకముందే ముందు జాగ్రత్తతో ఉంటే ఎలాంటి సమస్యనైనా సరే ఎదురుకోవచ్చు. వయసు పై బడుతున్నవారు కొన్ని ఆరోగ్య పరీక్షలు తప్పకుండా చేయించుకుంటే మంచిది. రక్తపరీక్ష, షుగర్ పరీక్ష క్రమం తప్పకుండా కచ్చితంగా చేయించుకోవాలి. అవేంటో ఓసారి తెలుసుకుందాం.



కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ) : ఇది రక్త పరీక్ష. ఇందులో ఎర్ర రక్త కణాలు (ఆర్బీసీ), తెల్ల రక్త కణాలు (డబ్ల్యూబీసీ), రక్తంలోని ప్లేట్‌లెట్ల గురించి సమాచారాన్ని అందించే పరీక్షల సమాహారం. అలాగే రక్తంలో ఎన్ని రకాల కణాలు ఉన్నాయో కంప్లీట్ బ్లడ్ కౌంట్ (సీబీసీ) నిర్ణయిస్తుంది. మనిషి ఆరోగ్య స్థితి తెలుసుకోవటానికి ఇవి క్రమం తప్పకుండా చేయించుకుంటే మంచిది.

బేసిక్ మెటాబోలిక్ ప్యానల్ పరీక్ష : దీనినే బీఎంపీ పరీక్ష అని కూడా అంటారు. ఈ టెస్ట్ ద్వారా రక్తంలో ఎనిమిది రకాలైన పోషకాలు.. కాల్షియం, గ్లూకోస్, సోడియం, పొటాషియం, బైకార్బొనేట్, క్లోరైడ్, రక్తంలో యూరియా నైట్రోజెన్, క్రియేటినైన్ ఏ మోతాదులో ఉందో తెలుస్తుంది. ఈ పరీక్ష చేయించుకునే ముందు మీరు 8 గంటల ముందు నుంచి ఎలాంటి ఆహారం తీసుకోకుండా ఉండాలి. పరీక్షలో నార్మల్‌గా లేకుండా మీరు కిడ్నీ, మధుమేహం లేదా ఇతర వ్యాధులతో బాధపడుతున్నట్టు వైద్యులు చెబుతారు.

లిపిడ్ పరీక్ష : ఈ లిపిడ్ పరీక్షకు 8 గంటలకు ముందు ఏమీ తినకూడదు. ఈ టెస్ట్‌తో కొలెస్ట్రాల్ లెవల్స్ తెలుస్తాయి. పరీక్ష తరువాత మీకు రిపోర్ట్ నార్మల్‌గా లేకపోతే మీరు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు పరిగణిస్తారు.

థైరాయిడ్ పరీక్ష : ఈ థైరాయిడ్ పరీక్ష ద్వారా శరీరంలో ప్రొటీన్ లెవెల్స్, థైరాయిడ్ స్థితిగతి ఎలా ఉందో తెలుసుకుంటారు.

సి-రియాక్టివ్ ప్రొటీన్ పరీక్ష : దీనినే సీఆర్‌పీ పరీక్ష అంటారు. ఈ సీఆర్‌పీ పరీక్షలో మీ సీఆర్‌పీ స్థాయి ఎక్కువగా ఉంటే మీరు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు. సీఆర్పీ స్థాయిలను బట్టి లుపస్, రుమటాయిడ్ ఆర్థ్రైటిస్, క్యాన్సర్ లాంటి రోగాలను సూచిస్తుంది.

రక్త పరీక్షలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

రక్తం తీసే ప్రదేశాన్ని దూదితో శుభ్రం చేయాలి. నరాలు కనిపించే విధంగా చేయికి బ్యాండ్ చుట్టాలి. నర్సు రక్తాన్ని తీసుకున్న తరువాత కట్టిన బ్యాండ్‌ను తీసేసి రక్తం తీసిన ప్రదేశాన్ని దూదితో లేదా మెడికల్ టేప్‌తో కప్పివేయాలి. రక్త పరీక్ష చేయడానికి స్టెరిలైజ్డ్ సూది, శుభ్రమైన దూదిని మాత్రమే ఉపయోగించాలి. ఈ పరీక్షలను తప్పకుండా చేసుకుంటే ఎలాంటి అనారోగ్యాన్నైనా ముందుగానే ఎదుర్కోవచ్చు.

జాతకాల సాకు చెప్పి...

పెండ్లి చేయాలంటే అంతకంటే ముందు జరగాల్సిన పనులు చాలా ఉంటాయి. సంబంధం మాట్లాడుకోవడం, ఒకరినొకరు చూసుకోవడం, కుటుంబ సభ్యులు మాట్లాడుకోవడం, రెండు మూడు సార్లు కలుసుకోవడం సహజంగా జరిగే తంతు. ఆ తర్వాత పూలూ పండ్లు, నిశ్చితార్థం ఆ తర్వాత పెండ్లి. నిశ్చితార్థం తర్వాత కొందరు పెండ్లికి చాలా సమయం తీసుకుంటారు. కొంత మంది వెంటనే పెండ్లి చేసేస్తారు. ఏది ఏమైనా ఒకరి గురించి మరొకరు తెలుసుకొనేందుకు ఈ సమయం ఉపయోగపడుతుంది. ఒకరి అభిప్రాయాలు ఒకరికి నచ్చకపోతే సంబంధం వద్దనుకోవడం కూడా జరుగుతుంది. అలాంటి ఓ కథనే ఈ వారం ఐద్వా అదాలత్‌లో...



ఐద్వా అదాలత్ సెల్: 9490098024

జానకికి 46 ఏండ్లు ఉంటాయి. వాళ్ళ చిన్న కూతురిని తీసుకొని వచ్చింది. వస్తూనే 'పెండ్లి తర్వాత జరిగే గొడవలు మాత్రమే ఇక్కడ చూస్తారా? లేకపోతే అంతకు ముందు వచ్చే సమస్యలను కూడా పరిష్కరిస్తారా? అని అడిగింది. దానికి మేము 'ముందు మీ సమస్య ఏంటో చెప్పండి. పరిష్కరించగలమో లేదో చెప్తాము' అంటే...

'నా కూతురు లహరి డిగ్రీ చివరి ఏడాదిలో వున్నప్పుడు విజయ్ పెండ్లి చూపులకి వచ్చాడు. మా అమ్మాయిని ఏదో పెండ్లిలో చూశారంట. నచ్చిందని వచ్చారు. మేమిప్పుడే అమ్మాయికి పెండ్లి చేయమని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. 'మాకు అమ్మాయి నచ్చింది, రెండేండ్ల తర్వాతే పెండ్లి చేయండీ' అటూ నాలుగైదు సార్లు వచ్చారు. మా అమ్మాయికి కూడా అబ్బాయి నచ్చాడు. డిగ్రీ తర్వాత ఎలాగో పెండ్లి చేస్తాము కాబట్టి సరే అని ఒప్పుకున్నాము.

మేము కూడా వాళ్ళ ఇంటికి వెళ్ళి చూశాము. అబ్బాయికి మంచి ఉద్యోగం ఉంది. కొత్తగా ఇల్లు కట్టుకుంటున్నారు. ఇంట్లో తల్లి కొడుకు ఇద్దరే ఉంటారు. తండ్రి లేడు. అంతా బాగానే ఉంది అనుకుని అందరం పెండ్లి చేయడానికి సిద్ధమయ్యాము. నిశ్చితార్థం కూడా చేశాము. ఇల్లు పూర్తి అయిన తర్వాత పెండ్లి చేసుకుంటాము, అప్పటి వరకు లహరి డిగ్రీ కూడా పూర్తి అవుతుందని మాట్లాడుకున్నాం. మధ్యలో వచ్చి 'ఇల్లు కట్టుకోడానికి డబ్బులు తక్కువ అవుతున్నాయి. మీ దగ్గర వుంటే ఇవ్వండి. మీరు ఇచ్చే కట్నం నుండి కట్ చేసుకోండి. ఆ ఇంట్లో వుండేది వాళ్ళే కదా' అంటే మేము రెండు లక్షలు ఇచ్చాము. మళ్ళీ కొన్ని రోజులకు ఇంకా డబ్బులు కావాలి అంటే మా దగ్గర లేవు అని చెప్పాము. ఆ తర్వాత విజయ్ ఆఫీస్ నుండి ఇంటికి వస్తుంటే ప్రమాదం జరిగింది. అందులో విజయ్ కాలు విరిగింది. మూడు నెలలు ఇంట్లో వుండి రెస్ట్ తీసుకున్నాడు. అప్పుడు ఆస్పత్రి ఖర్చులకు కూడా మేము డబ్బులు ఇచ్చాము. లహరి, విజయ్ ఇద్దరూ ఒకరితో ఒకరు ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారు. విజయ్ ఆరోగ్యం బాగుపడింది. తిరిగి ఆఫీసుకు వెళుతున్నాడు. లహరి డిగ్రీ పూర్తి అయ్యింది. ఇంక పెండ్లి చేస్తాము అని మేము వాళ్ళ ఇంటికి వెళితే విజయ్ తల్లి పద్మని అడిగితే 'నీ కూతురు నష్టజాతకురాలు, విజయ్, లహరికి జాతకాలు కలవడం లేదు. అందుకే మేము వేరే అమ్మాయిని చూసుకుంటున్నాం. మీ కూతురితో సంబంధం మాట్లాడినప్పటి నుండి మాకు అన్నీ ఆటంకాలు జరుగుతున్నాయి. విజయ్ చనిపోయేవాడు బతికాడు. మాకు మీ సంబంధం ఇష్టం లేదు' అంటూ మమ్మల్ని తిరిగి పంపించేశారు. మాకేం చేయాలో అర్థం కాక మీ దగ్గరకు వచ్చాము' అని చెప్పింది.

మేము పద్మకు, విజయ్‌కు ఫోన్ చేసి పిలిపిచాము. లహరి వాళ్ళ గురించి అడిగితే 'లహరి జాతకం విజయ్‌తో కలవడం లేదు. ఆ సంబంధం అనుకున్నప్పటి నుండి మాకన్నీ ఆటంకాలే. మేము పంతులిని అడిగితే ఆయన కూడా ఇదే చెప్పారు. మేము కాదని పెండ్లి చేస్తే విజయ్‌కి ప్రాణ హాని ఉంది అని చెబుతున్నారు. చూస్తూ చూస్తూ నా కొడుకుని ఆ అమ్మాయికిచ్చి ఎలా పెండ్లి చేయాలి? అందుకే ఈ సంబంధం ఉందని అంటున్నాం' అన్నది.

విజయ్ మాట్లాడుతూ 'నిశితార్థానికి, పెండ్లికి మధ్య చాలా సయం దొరకడంతో లహరితో నేను రోజూ ఫోన్లో మాట్లాడేవాడిని. నాకూ తను బాగా నచ్చింది. కానీ మా జాతకాలు కలవనప్పుడు రేపు పెండ్లి చేసుకున్నా మా భవిష్యత్ బాగోదని అంటున్నారు. అందుకే మా అమ్మ ఈ పెండ్లి వద్దని అంటుంది' అన్నాడు. 'ఒక అమ్మాయితో నిశ్చితార్థం అయిన తర్వాత ఇలా మాట్లాడడం ఎంత వరకు సరైనది' అని మేము అడిగితే జాతకాలు కలవకపోవడం వల్లనే నాకు రోడ్డు ప్రమాదం జరిగింది. అందుకే నాకు లహరిని పెండ్లి చేసుకోవడం ఇష్టం లేదు. ఈ విషయం లహరికి కూడా చెప్పాను. దానికి తను కూడా ఒప్పుకుంది. మళ్ళీ మీ దగ్గరకు వచ్చి మాపైన కంప్లెయింట్ ఇచ్చింది' అన్నాడు.

'మీ ఇద్దరికీ పెండ్లి జరుగుతుందని అందరికీ తెలుసు. ఏడాది నుండి బంధువుల్లో, చుట్టుపక్కల బాగా ప్రచారం కూడా జరిగింది. ఫోన్లో మాట్లాడుకోవడమే కాకుండా, బయట కూడా ఇద్దరూ కలిసి తిరిగారు. ఇప్పుడు పెండ్లి వద్దంటే ఆ అమ్మాయి పరిస్థితి ఏంటి? ఇన్ని రోజుల తర్వాత ఇప్పుడు జాతకాలు కలవడం లేదంటున్నారు. నిశితార్థం చేసుకునేటప్పుడే జాతకాలు చూసుకోవచ్చు కదా? నీకు ప్రమాదం జరిగినప్పుడు కూడా లహరి ఆస్పత్రికి వచ్చింది. ఒక వేళ పెండ్లి తర్వాత ఇలా జరిగితే ఏం చేసేవాళ్ళు. మొన్నటి వరకు అంతా బాగానే వుంది. ఇప్పుడు సడన్‌గా జాతకాలు కలవలేదు అంటున్నారు' ఇది కరెక్టు కాదు అన్నాము.

దానికి విజయ్ 'ఒక్క జాతకాలు మాత్రమే కాదు లహరితో మాట్లాడేటప్పుడు ఆమెపై నాకు ఎందుకో ప్రేమ కలగడం లేదు. పెండ్లి తర్వాత కూడా ఇలాగే ఉంటే చాలా ఇబ్బంది అవుతుంది. నాకు ప్రమాదం జరిగినప్పుడు ఆస్పత్రిలో వేరే అమ్మాయితో పరిచయం అయ్యింది. ఆమెతో మాట్లాడినా, తాకినా నాకు చాలా హ్యాపీగా అనిపిస్తుంది. కానీ లహరితో అలా అనిపించడం లేదు. అందుకే నిశ్చితార్థం క్యాన్సిల్ చేసుకుంటున్నాను' అన్నాడు.


అతని మాటలు విన్న లహరి 'విజయ్ అంత క్లియర్‌గా చెప్పిన తర్వాత నేను అతన్ని ఎలా పెండ్లి చేసుకుంటాను. నాకూ విజయ్ వద్దు' అన్నది. దానికి మేము 'నీకు ఇష్టం లేకుండా అతనితో పెండ్లి చేయలేం. నువ్వు మంచి ఉద్యోగం చేసుకొని నీ కాళ్లపై నువ్వు నిలబడిన తర్వాత మంచి వ్యక్తిని చూసి పెండ్లి చేసుకో. పెండ్లికి ముందే విజయ్ గురించి తెలిసింది కాబట్టి సరిపోయింది. లేదంటే ఇలాంటి వ్యక్తిని పెండ్లి చేసుకుని ఎన్నో కష్టాలు పడాల్సి వచ్చేది అని చెప్పాము. దానికి ఆమె అంగీకరించింది.

విజయ్ తల్లితో 'మీరు పెండ్లి వద్దను కుంటున్నారు కనుక వాళ్ళ దగ్గర తీసుకున్న డబ్బుతో పాటు బంగారం కూడా ఇచ్చేయ్యాలి. అలాగే మీ అబ్బాయి మనసులో మరో అమ్మాయిని పెట్టుకొని జాతకాల సాకు చెప్పి లహరిని వదిలించుకోవాలనుకుంటున్నాడు. కాబట్టి ఆమెకు మీరు నష్టపరిహారం కింద మరో రెండు లక్షలు అదనంగా ఇవ్వాలి' అన్నాము. దానికి వాళ్ళు 'అదనంగా మేమెందుకు ఇస్తాము' అన్నారు. 'ఇవ్వకపోతే పరిస్థితి మరోలా ఉంటుంది' అని హెచ్చరించాము. దాంతో వాళ్ళు లహరికి ఇవ్వాల్సింది మొత్తం ఇవ్వడానికి అంగీకరించారు.

'మీరు పెండ్లి వద్దను కుంటున్నారు కనుక వాళ్ళ దగ్గర తీసుకున్న డబ్బుతో పాటు బంగారం కూడా ఇచ్చేయ్యాలి. అలాగే మీ అబ్బాయి మనసులో మరో అమ్మాయిని పెట్టుకొని జాతకాలు సాకు చెప్పి లహరిని వదిలించుకోవాలను కుంటున్నాడు. కాబట్టి ఆమెకు మీరు నష్టపరిహారం కింద మరో రెండు లక్షలు అదనంగా ఇవ్వాలి'

- వై వరలక్ష్మి
9948794051

బల్లులు, బొద్దింకలకు విరుగుడు ఇలా...



అసలే వేసవికాలం. ఓ వైపు ఉక్కపోత మరోవైపు చీడపురుగుల బెడదా ఎక్కువగానే ఉంటుంది. ముఖ్యంగా బొద్దింకలు, బల్లులు ఇండ్లలోకి చొరబడుతుంటాయి. వీటిని తరిమికొట్టే కొన్ని చిట్కాలను తెలుసుకుందాం.

ఇంట్లో బల్లులు ఎక్కువగా తిరుగుతుంటే గుడ్డు పెంకులు వీటికి సరైన నివారణ మార్గం. బల్లులు ఏ వైపు నుంచి వస్తున్నాయో అక్కడ కిటికీ దగ్గర ఈ గుడ్డు పెంకులను ఉంచితే ఆ వాసనకు బల్లులు రావు. బల్లులను తరిమికొట్టడానికి కిటికీలు తలుపుల చుట్టూ ఉల్లిపా య పొరలు, వెల్లుల్లి తొక్కలు ఉంచితే ఉపయోగం ఉంటుంది. బొద్దింకలను తరిమిగొట్టేందుకు మార్కెట్‌లో మందులు చాలానే ఉన్నాయి. కానీ అవి మన ఆరోగ్యానికి హాని కలగజేస్తాయి. ఇవి ఇంట్లోకి రాకుండా అక్కడక్కడ నాప్తలీన్ బాల్స్‌ను ఉంచాలి. ఇంట్లో పెప్పర్ స్ప్రే చేయడం ద్వారా పురుగులు చేరవు.

ఉపేక్షించేదే లేదు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నప్పటికీ ప్రజల అవసరాలకు సరిపోవటం లేదని గుర్తు చేశారు. భూగర్భ జలమట్టం పడి పోవటంతో ప్రజలు నల్లా నీటిపై ఆధారపడుతున్నారనీ, ఫలితంగా రాష్ట్రంలో నీటి సమస్య తలెత్తిందన్నారు. తాగు నీటి కోసం వచ్చే ఫిర్యాదులను యుద్ధ ప్రాతిపదికన సమీక్షించి వెంటనే ఆయా ప్రాంతాలకు నీటి సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సారథ్యంలో ఏ రోజుకారోజు మిషన్ భగీరథ, మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్తు శాఖ అధికారులు తాగునీటి సరఫరాపై సమీక్ష జరపాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజుల్లో డిమాండ్ మరింత పెరిగినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సీఎం అధికారులకు సూచించారు. అవసరమైతే నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నగరానికి నీటిని తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే సింగూర్ నుంచి నీటి సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కృష్ణా బేసిన్లో నీటి లభ్యత లేనందున నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి తాగునీటిని తెచ్చుకునేలా కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని సీఎం అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లో సిబ్బంది అత్యుత్సాహంతో ఇటీవల ఒకచోట తాగునీటి సరఫరా నిలిచిపోయిందనే విషయం ఈ సందర్భంగా సీఎం దృష్టికి రావడంతో ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దేశ పూర్వకంగా తాగునీటి సరఫరాకు ఆటంకం కల్పించిన వారిని వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని ఆదేశించారు. అకారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మార్గదర్శి మాకినేని

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతోందనీ, పార్లమెంటు ఎన్నికల్లోనూ దాన్ని కొనసాగించాలని చెప్పారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకికవాదం గురించి మౌలిక విషయాలను ఆయన రాశారని గుర్తు చేశారు. లౌకికవాదం, దాని స్వభావం గురించి సైద్ధాంతిక రూపకల్పన చేశారని వివరించారు. రాజీవ్‌గాంధీ బాబ్రీ మసీదు తాళాలు తెరిపించి, హిందూవులు పూజలు చేసుకోవడానికి అనుమతి ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ లౌకికవాద పార్టీ అయినపుడు ఆ పని చేయాల్సిన అవసరమేంటన్న ప్రశ్న అందరిలోనూ వచ్చిందన్నారు. ఆ అంశంపైనే మాకినేని ఓ వ్యాసం రాశారని తెలిపారు. కాంగ్రెస్ లౌకికవాద అవగాహనలోనే ఒక లోపం ఉందన్నారు. లౌకికవాదాన్ని కమ్యూనిస్టులు చూసే పద్ధతికి, బూర్జువాలు, కాంగ్రెస్ పార్టీ చూసే పద్ధతికి తేడా ఉందని చెప్పారు. అది జాతీయోద్యమం నుంచి ఉందన్నారు. అందుకే మతోన్మాదులపై పోరాటం సాగిస్తున్నామని చెప్పారు. ఇప్పుడు ఈ పోరాటానికి మాకినేని సైద్ధాంతిక ఆయుధాలనీ, వాటిలో ఎన్నో విషయాలు, సందర్భాలను ఆయన ప్రస్తావించారని వివరించారు. ఆయన్ను స్మరించుకుంటున్నామంటే ఆచరణలో ఆయన ఆలోచనలు ఎప్పుడు ఏ రకంగా ఉపయోగపడతాయో వాటిని తెలుసుకోవాల్సిన అవసరముందని చెప్పారు. ఆ రకమైన ప్రయత్నం అందరూ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, డీజీ నరసింహారావు, టి జ్యోతి, టి సాగర్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, బొంతల చంద్రారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జె బాబురావు తదితరులు పాల్గొన్నారు.

డెడ్ స్టోరేజీకి నాగార్జునసాగర్ ప్రాజెక్టు

(మొదటిపేజీ తరువాయి)

నీటిమట్టం 510.30 అడుగులుగా ఉంది. దీంతో హైదరాబాద్‌కు తాగు నీటి విడుదలకు ఇబ్బందిగా మారనుంది. సాగర్‌లో 510 అడుగుల నీటిమట్టం ఉంటేనే ఎలిమినేటి మాధవరెడ్డిప్రాజెక్టు ఎత్తిపోతల ద్వారా హైదరాబాద్‌కు తాగునీటిని అందించడం వీలవుతుంది. తగ్గితే మాత్రం అక్కడి పంపులు నడపడం సాధ్యం కాదు. రెండు తెలుగు రాష్ట్రాల నీటి అవసరాలకుగాను 505 అడుగుల వరకు నీటిని వినియోగించుకునేందుకు ఒప్పందం జరిగింది. ఈ నేపథ్యంలో 510 అడుగుల కంటే నీటిమట్టం తగ్గితే అది హైదరాబాద్ తాగునీటి సరఫరాపై తీవ్రప్రభావం చూపనుంది.

సీబీఐ కస్టడీకి కవిత



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మూడ్రోజుల పాటు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) కస్టడీకి అనుమతిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఉత్తర్వులు వెలువరించింది. ఈనెల 14 వరకు సీబీఐ కస్టడీకి అప్పగించిన కోర్టు, 15న ఉదయం 10 గంటలకు తిరిగి కవితను కోర్టులో హాజరుపరచాలని ఆదేశించింది. కవిత విచారణకు సహకరించనందున ఆమె నుంచి కీలక సమాధానాలు రాబట్టేందుకు ఐదు రోజులు సీబీఐ కస్టడీకి ఇవ్వాలని కోరగా... కేవలం మూడు రోజుల కస్టడీకి అనుమతిస్తున్నట్లు స్పష్టం చేసింది. అలాగే సీబీఐ కస్టడీలో ప్రతి రోజు సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల వరకు కుటుంబ సభ్యులను కలిసేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. కవిత భర్త అనిల్, పిల్లలు, తల్లి శోభారావు, సోదరులు కేటీఆర్, సంతోష్ రావు, పీఏ శరత్ కలిసేందుకు అనుమతిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. అనంతరం కవితను ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయానికి తరలించారు. లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో అరెస్టై జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా తీహార్ జైల్లో ఉన్న కవితను గురువారం మధ్యాహ్నం 12:15 నిమిషాలకు సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఉదయం 10:30 నిమిషాలకు కవితను రౌస్ అవెన్యూ సీబీఐ స్పెషల్ కోర్టులో హాజరుపరిచారు. కవితకు వ్యతిరేకంగా సహ నిందితులు ఇచ్చిన వాంగ్మూలాలు, వాట్సాప్ చాట్‌లు, ఇతర ఆధారాలను కోర్టుకు సమర్పించారు. ఆధారాలపై సుమారు గంటన్నరకు పైగా వాదనలు సాగాయి. ఈ సందర్భంగా సీబీఐ తరపు సీనియర్ న్యాయవాది పంకజ్ కుమార్ వాదనలు వినిపిస్తూ... లిక్కర్ స్కాంలో కవిత కింగ్ పిన్‌గా వ్యహరించారని ఆరోపించారు. సూత్రధారితో పాటు పాత్రధారిగా ఉన్నారని ఆరోపించారు. ఆప్ నేతలకు రూ.100 కోట్లను సమకూర్చడంతో పాటూ... తమకు అనువుగా లిక్కర్ స్కాంను రూపొందించుకోవడంలో కవిత కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కేసు దర్యాప్తులో ఇప్పటికే సహ నిందితుల వాంగ్మూలాలు నమోదు చేసినట్లు వివరించారు. అప్రూవర్లుగా మారిన వారితో పాటు కవిత సన్నిహితులు అభిషేక్ బోయినపల్లి, మాజీ ఆడిటర్ బుచ్చిబాబు, ఇతరులు కవిత పాత్రపై కీలక సమాచారం ఇచ్చారన్నారు. అయితే తాజా సమాచారంపై కవితను ప్రశ్నించగా... ఆమె తప్పించుకునే సమాధానాలు ఇస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విచారణకు సహకరించడం లేదని, అందుకే ట్రయల్ కోర్టు అనుమతితో కవితను తీహార్ జైల్ కస్టడీలోనే అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

అయితే తీహార్ జైల్లో కవితను ఈ నెల 6న సీబీఐ విచారించడం, సీబీఐ కవితను అరెస్ట్ చేయడంపై ఆమె తరపు న్యాయవాదులు విక్రమ్ చౌదరి వర్చువల్ మోడ్‌లో నితీష్ రాణా, మోహిత్ రావు కోర్టు హాల్ లో అభ్యంతరం తెలిపారు. సీబీఐ రిమాండ్ పై విచారణకు ముందు... కవిత విచారణ, అరెస్ట్‌పై తాము దాఖలు చేసిన రెండు పిటిషన్లపై విచారణ చేపట్టాలని కోర్టును కోరారు. ఇందుకు అనుమతించిన స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా మధ్యాహ్నం 2 గంటలకు విచారణను వాయిదా వేశారు. అనంతరం 2 గంటలకు విచారణ ప్రారంభం కాగా ప్రతివాది అయిన కవిత, ఆమె తరపు న్యాయవాదులైన తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సీబీఐ అక్రమంగా వ్యవహరించిందని విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు. మరోవైపు సీబీఐ రిమాండ్‌పై కూడా విచారణ ముగించిన స్పెషల్ జడ్జ్ తీర్పు రిజర్వ్ చేశారు. సాయంత్రం 4:10 నిమిషాలకు కవితను సీబీఐ కస్టడీకి అప్పగిస్తున్నట్లు ఉత్తర్వులు విడుదల చేశారు.

కేసే తప్పయితే ... చెప్పేదేముంది : కవిత

లిక్కర్ కేసే తప్పయితే.. ఇంకా సీబీఐ గురించి చెప్పేది ఏముందని కవిత అన్నారు. కోర్టు హాల్ నుంచి బయటకు వస్తున్న సమయంలో మీడియా వేసిన ప్రశ్నలకు స్పందించారు. సీబీఐ మళ్లీ అవే ప్రశ్నలు అడుగుతుంది. కొత్తగా చెప్పేది ఏమీ లేదు. సీబీఐది వృధా ప్రయాస. సీబీఐ చేస్తోంది తప్పు.. అని అన్నారు.

పర్యాటకుల పెంపు కోసం భారత్‌లో రోడ్ షోలు ! • మాల్దీవుల పర్యాటక సంస్థ ఆలోచన

న్యూఢిల్లీ : భారత్, మాల్దీవుల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో మాల్దీవుల్లో పర్యటించే భారత పర్యాటకుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఈ తరుణంలో పరిస్థితులను చక్కదిద్దేందుకు మాల్దీవులకు చెందిన పర్యాటక సంస్థ ముందుకొచ్చింది. భారత పర్యాటకులను ఆకర్షించేందుకు భారతదేశ నగరాల వ్యాప్తంగా రోడ్ షోలను నిర్వహించనున్నట్లు మాల్దీవులకు చెందిన ప్రధాన పర్యాటక సంస్థ ప్రకటించింది. లక్షదీవుల్లో పర్యటిస్తూ ప్రధాని మోడీ మాల్దీవులతో లక్షద్వీప్‌ను పోల్చారు. అక్కడకువెళ్ళే పర్యాటకులు ఈ ప్రాంతాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. ఆ వెంటనే మాల్దీవులు అధ్యక్షుడు, మంత్రులు, పలువురు ఉన్నతాధికారులు మోడీపై పలు వ్యాఖ్యలు చేశారు. దీంతో మాల్దీవులను పూర్తిగా బహిష్కరించే కార్యక్రమం సాగింది.

ఈ నేపథ్యంలో మాల్దీవ్స్ అసోసియేషన్ ఆఫ్ ట్రావెల్ ఏజెంట్స్ అంట్ టూర్ ఆపరేటర్స్ (ఎంఎటిఎటిఓ) ఈ నెల 8న మాలెలో భారత హై కమిషనర్‌తో చర్చలు జరిపింది. రాబోయే మాసాల్లో మాల్దీవులకు మీడియా ట్రిప్‌లకు కూడా అవకాశం కల్పించనున్నట్లు తెలిపింది.

బ్లాక్‌మెయిల్‌తో రేవంత్‌రెడ్డి కొత్త నాటకం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజలను ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తూ రేవంత్‌రెడ్డి కొత్త నాటకానికి తెరలేపారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ అభ్యర్థులను మార్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అంతకు ముందు ఓబీసీ మోర్చా సమావేశంలో పాల్గొన్నారు. ఆయన సమక్షంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వడ్ల నందు, చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన, పీఏసీఎస్ చైర్మెన్ రాజునాయక్, కోటిపల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, పలువురు ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు బీజేపీలో చేరారు. లక్ష్మణ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. గ్యారెంటీలను అటకెక్కించి పార్లమెంట్ ఎన్నికలతో ముడిపెట్టడం పలు అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. ప్రజల దృష్టి మరల్చేందుకు, సానుభూతి పొందేందుకు తనపై కుట్రలు పన్నుతున్నారని రేవంత్‌రెడ్డి కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీని గెలపించేందుకు కాంగ్రెస్ ప్లాన్ చేస్తోందనీ, రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ఆ పార్టీ నేతలు ఒప్పుకోవడం లేదని చెప్పారు. కల్వకుంట్ల కుటుంబం రాష్ట్రాన్ని దోచుకున్నదని ఆరోపించారు. బీజేపీ మినహా ఇతర పార్టీలు కుటుంబాల కోసం, కొడుకులను సీఎం చేయడం కోసం పనిచేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ది ముగిసిన అధ్యయనమని ఎద్దేవా చేశారు. కేసీఆర్ భగీరథుడు కాదనీ, బిడ్డతోని ఢిల్లీ వరకు మద్యం పారించిన వ్యక్తి అని దెప్పిపొడిచారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మజ్లిస్ రహస్య సంధి కుదురుస్తోందని ఆరోపించారు. గత ఎన్నికల్లో ఓడిపోయినా బీఆర్ఎస్ నేతల్లో అహంకారం తగ్గలేదనీ, అలాంటి అవకాశవాద రాజకీయాలను ప్రజలు గ్రహించి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. రాష్ట్రంలో పంట పొలాలు ఎండిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నదనీ, దీనిపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని చెప్పారు. నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు. ఎంఐఎం విధానాలతో విభేదాలున్నప్పటికీ తమ నాయకుడు, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాల్లో భాగంగానే ఒవైసీని గెలిపిస్తామని ఫిరోజ్ ఖాన్ బాహాటంగానే ప్రకటించారని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డిని సమర్థించడం తమ పార్టీ వాళ్లకే నచ్చడం లేదని వీహెచ్ చెబుతున్నారన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు కూల్చాలననే ఉద్దేశం తమకు లేదనీ, ఐదేండ్లు సజావుగా కొనసాగాలని కోరకుంటున్నానని చెప్పారు. విపక్ష ఇండియా కూటమిలోని సగం మంది బెయిల్ మీద బయట తిరుగుతున్నారనీ, జైల్లో ఉన్న నాయకులకు కూటమి నాయకులు వంతపాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీపై ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా మోడీ ప్రభంజనం ముందు అన్నీ కొట్టుకుపోతాయన్నారు. తమ పార్టీకే ఎక్కువ ఎంపీ సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

ముందస్తుగానే రుతుపవనాలు !

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కరువు ఛాయలతో అల్లాడుతున్న అన్నదాతలకు భారత వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. ఈ ఏడాది జూన్-ఆగస్టు నాటికి లా నినో పరిస్థితులుటాయనీ, ముందుగానే రుతుపవనాలు వస్తాయని తెలిపింది. దీంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయని చల్లని కబురు చెప్పింది. దీంతో దేశ వ్యాప్తంగా ఉన్న రైతులు, సాధారణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. పంటలు పండించేందుకు సరిపడా నీరు లేక అష్టకష్టాలను అనుభవించారు. ఎల్ నినో ప్రభావంతో దేశమంతా కరువు పరిస్థితులు దాపురించాయి. కొన్ని చోట్ల నోటికాడికి వచ్చిన పంటలు నీటి ఎద్దడితో ఎండిపోయి పశువులకు మేతగా మారుతున్నాయి. దీంతో వ్యవసాయమే వృత్తిగా జీవిస్తున్న రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి అల్లాడిపోతున్నారు. ఎండ తీవ్రతతో పలు ప్రాంతాల్లో తాగు నీటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వచ్చే వర్షాకాలంలో ఈ సారైనా వర్షాలు పడతాయో లేదో అని ఆందోళన చెందుతున్న ప్రజలకు ఐఎండీ గుడ్ న్యూస్ అందించినట్టు అయింది.

రాష్ట్రంలో వచ్చే మూడ్రోజులు వర్షాలు..మరింత తగ్గనున్న ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలో వాతావరణం మరింత చల్లబడింది. వచ్చే మూడ్రోజులు ఉష్ణోగ్రతలు మరింత తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయి. శుక్రవారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సగటు కంటే రెండు నుంచి ఐదు డిగ్రీల మేర తక్కువ నమోదయ్యాయి. రాష్ట్రంలో ఉపరితల ద్రోణి కొనసాగుతున్నది. మహారాష్ట్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం నెలకొంది. అది సముద్ర మట్టం నుంచి సగటున 1.5 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై క్రమంగా బలహీనపడింది. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తగ్గి చాలా ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంది. రాష్ట్రంలో వచ్చే మూడ్రోజులు 40 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది. కొన్ని జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది. ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని సూచిస్తూ పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లను జారీ చేసింది. ఆరెంజ్ అలర్ట్ జాబితాలో ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సూర్యాపేట, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలు, ఎల్లో అలర్ట్ జాబితాలో మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలున్నాయి. రాష్ట్రంలో అక్కడక్కడ పిడుగులు పడే అవకాశముందని హెచ్చరించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు నమోదయ్యే అవకాశముంది. గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచే సూచనలున్నాయి.

నిరుద్యోగ సమస్యేకీలకం...

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నది. గత ఐదేండ్లతో పోలిస్తే ఉద్యోగాలు పొందడం చాలా కష్టంగా మారిందని దాదాపు ఐదింట మూడొంతుల మంది భావిస్తున్నారని అధ్యయనం కనుగొన్నది. కేవలం 12 శాతం మంది ఉద్యోగాలు పొందడం సులభం అని చెప్పింది గ్రామీణ ప్రజలు నిరుద్యోగం, ధరల పెరుగుదల గురించి ప్రస్తావించే అవకాశం ఎక్కువగా ఉన్నదని వివరించింది. మొత్తమ్మీద, రాబోయే లోక్‌సభ ఎన్నికలు బీజేపీ ఊహించుకున్నట్టుగా అంత సులువేమీ కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. నిరుద్యోగులు, యువత, మైనారిటీలు, రైతులు, మహిళలు, దళితులు.. ఇలా ప్రతి ఒక్క వర్గమూ మోడీ సర్కారుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నదని అంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల తీర్పు ఒక నిశబ్ద విప్లవం కానున్నదని వారు అంచనా వేస్తున్నారు.

నీటి కేటాయింపులు

(మొదటిపేజీ తరువాయి)

అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. హైదరాబాద్ జనాభాను పరిగణనలోకి తీసుకుని తాగునీటి కోసం ఎక్కువ మొత్తం కేటాయించాలని డిమాండ్ చేశారు. దీంతో నాగార్జునసాగర్‌లో 500 అడుగులపై ఉన్న 14 టీఎంసీల నీటిని రెండు రాష్ట్రాలకు కేటాయిస్తూ కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకుంది. మే నెలలో త్రిసభ్య కమిటీ మరోమారు సమావేశం కావాలని నిర్ణయించింది.



ఈస్ట్‌జోన్‌కే టైటిల్

మహిళల ఇంటర్ జోనల్ మల్టీ-డే ట్రోఫీ

ముంబయి: మహిళల ఇంటర్ జోనల్ మల్టీ-డే టైటిల్‌ను ఈస్ట్‌జోన్ జట్టు చేజిక్కించుకుంది. సౌత్‌జోన్ మహిళల జట్టు నిర్దేశించిన 184పరుగుల లక్ష్యాన్ని ఈస్ట్‌జోన్ జట్టు 61.3ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి ఛేదించింది. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఈస్ట్‌జోన్ జట్టు బ్యాటర్ దీప్తి శర్మ(46), రీచా ఘోష్(33) రాణించగా.. సౌత్‌జోన్ బౌలర్ సహానా పవార్, మిన్ను మణి మూడేసి వికెట్లతో రాణించారు.



ఈస్ట్‌జోన్ కెప్టెన్ దీప్తి శర్మకు టైటిల్‌ను టీమిండియా మహిళలజట్టు మాజీ కెప్టెన్ శుభాంగి కులకర్ణి అందజేశారు. అలాగే రూ.50లక్షల ప్రైజ్‌మనీ దక్కింది. రన్నరప్‌గా నిలిచిన సౌత్‌జోన్‌కు రూ.20లక్షల ప్రైజ్‌మనీ దక్కింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మిన్ను మణికి, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ దీప్తి శర్మకు లభించాయి.

సౌత్‌జోన్ : 133, 179
ఈస్ట్‌జోన్ : 129, 184/9

కుల్దీప్ కేక..

లక్నోపై ఆరు వికెట్ల తేడాతో ఢిల్లీ గెలుపు

లక్నో: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్)లో తొలిసారి ఢిల్లీ క్యాపిటల్స్ మరో విజయాన్ని సొంతం చేసుకుంది. భారత్‌రత్న శ్రీ అటల్‌బిహారి వాజ్‌పేయి ఏక్నా స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన లక్నోను స్పిన్నర్ కుల్దీప్ యాదవ్(3/20) స్పిన్ దెబ్బకు 20 ఓవర్లలో 167పరుగులకే పరిమితమైంది. ఆ లక్ష్యాన్ని ఢిల్లీ జట్టు 18.1 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి 170 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ఛేదనలో ఢిల్లీ ఓపెనర్ పృథ్వీ షా(32) రాణించినా.. స్టార్ బ్యాటర్ డేవిడ్ వార్నర్(8) నిరాశపరిచాడు. ఆ తర్వాత ఫ్రేజర్(55) అర్ధసెంచరీకి తోడు కెప్టెన్ పంత్(41)బ్యాటింగ్‌లో రాణించారు. వీరిద్దరూ 3వ వికెట్‌కు 77పరుగులు చేసి ఢిల్లీని విజయతీరాలకు చేర్చారు. ఆ తర్వాత హోప్, స్టబ్స్ మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. లక్నో బౌలర్లు బిష్ణోయ్‌కు రెండు, నవీన్, యశ్ ఠాకూర్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లక్నో సూపర్ జెయింట్స్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. డేంజరస్ ఓపెనర్ క్వింటన్ డికాక్(19), దేవ్‌దత్ పడిక్కల్(13)లను ఖలీల్ అహ్మద్ ఎల్బీగా పెవీలియన్‌కు చేర్చాడు. జట్టు స్కోర్ 28పరుగుల వద్ద లక్నో జట్టు తొలి వికెట్ కోల్పోయినా.. 77 పరుగులకే చేరేసరికి ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ తర్వాత రాహుల్, స్టోయినిస్‌తో ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేసినా.. చైనామన్ కుల్దీప్ వరుస బంతుల్లో మార్కస్ స్టోయినిస్(8), నికోలస్ పూరన్(0)లను ఔట్ చేశాడు. ఆ తర్వాతి ఓవర్లో కేఎల్ రాహుల్(39)ను పెవిలియన్ పంపి లక్నోను పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత ఇషాంత్ శర్మ ఓవర్లో దీపక్ హుడా(10) వెనుదిరిగాడు. కృణాల్ పాండ్యా కూడా నిరాశపరచడంతో లక్నో జట్టు 94పరుగులకే 7వికెట్లు కోల్పోయి మరింత కష్టాల్లో పడింది. ఆ దశలో ఆయుష్ బడోని(65)మెరుపు అర్ధసెంచరీకి తోడు అర్షాద్ ఖాన్(20నాటౌట్) ఆదుకున్నారు. వీరిద్దరూ కలిసి 8వ వికెట్‌కు 73పరుగులు జతచేసి లక్నోజట్టు గౌరవప్రద స్కోర్ చేసేందుకు దోహదపడ్డారు. ఢిల్లీ బౌలర్లలో కుల్దీప్ యాదవ్‌కు మూడు, ఖలీల్ అహ్మద్‌కు రెండు, ఇషాంత్, ముఖేశ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కుల్దీప్ యాదవ్‌కు లభించింది.



స్కోర్‌బోర్డు..

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (ఎల్‌బి)ఖలీల్ అహ్మద్ 19, కెఎల్ రాహుల్ (సి)పంత్ (బి)కుల్దీప్ 33, దేవదత్ పడిక్కల్ (ఎల్‌బి)ఖలీల్ అహ్మద్ 3, స్టొయినీస్ (సి)ఇషాంత్ (బి)కుల్దీప్ 8, పూరన్ (బి)కుల్దీప్ యాదవ్ 0, దీపక్ హుడా (సి)వార్నర్ (బి)ఇషాంత్ 10, ఆయుష్ బడోని (నాటౌట్) 55, కృణాల్ పాండ్యా (సి)పంత్ (బి)ముఖేశ్ కుమార్ 3, అర్షాద్ ఖాన్ (నాటౌట్) 20, అదనం 10. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 167పరుగులు.

వికెట్ల పతనం: 1/28, 2/41, 66/3, 4/66, 5/77 6/89 7/94

బౌలింగ్: ఖలీల్ అహ్మద్ 4-0-41-2, ఇషాంత్ శర్మ 4-0-36-1, ముఖేశ్ కుమార్ 4-0-41-1, అక్షర్ పటేల్ 4-0-26-0, కుల్దీప్ యాదవ్ 4-0-20-3,

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పృథ్వీ షా (సి)పూరన్ (బి)బిష్ణోయ్ 32, వార్నర్ (బి)యశ్ ఠాకూర్ 8, ఫ్రేజర్ (సి)అర్షాద్ ఖాన్ (బి)నవీన్-ఉల్-హక్ 55, పంత్ (స్టంప్)రాహుల్ (బి)బిష్ణోయ్ 41, స్టంబ్స్ (నాటౌట్) 15, హోప్ (నాటౌట్) 11, అదనం 8. (18.1ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 170పరుగులు.

వికెట్ల పతనం: 1/24, 2/63, 3/140, 4/146

బౌలింగ్: అర్షాద్ ఖాన్ 3.1-0-34-0, నవీన్-ఉల్-హక్ 3-0-23-1, యశ్ ఠాకూర్ 4-0-31-1, కృనాల్ పాండ్యా 3-0-45-0, రవి బిష్ణోయ్ 4-0-25-2, స్టొయినీస్ 1-0-10-0

వరుసగా మూడోసారి ససెక్స్‌తో పుజరా ఒప్పందం



లండన్: టీమిండియా టెస్ట్ బ్యాటర్ ఛటేశ్వర పుజరా వరుసగా మూడో ఏడాది కౌంటీల్లో ససెక్స్ తరఫున ఆడేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. శుక్రవారం లిసెస్టర్‌షైర్‌తో జరిగిన మ్యాచ్‌లో ససెక్స్ తరఫున 2024 సీజన్‌ను ప్రారంభించాడు. 2022 సీజన్‌లో ససెక్స్ తరఫున 18మ్యాచులు ఆడిన ఈ ఏడాది డివిజన్-1లో తొలి ఏడు మ్యాచ్‌లు ఆడనున్నట్లు తెలిపాడు. ఈ క్లబ్ తరఫున పుజరా గత రెండేళ్లలో 64.24యావరేజ్‌తో 1,863పరుగులు చేశాడు. ఇందులో ఎనిమిది సెంచరీలు, మూడు అర్ధసెంచరీలు ఉన్నాయి. ఇక 2023-24 రంజీ సీజన్‌లో సౌరాష్ట్ర తరఫున 13 ఇన్నింగ్స్‌లో 69.08 సగటుతో 829పరుగులు చేశాడు. గతంలో పుజరా డెర్బీషైర్, యార్క్‌షైర్, నాటింగ్హామ్‌షైర్‌లలోనూ ఆడిన అనుభవం ఉంది.



మెరిసిన రుతిక

కొరియాపైన 2-1తో విజయం
బిల్లీ జీన్ కప్-2024

ఛాంగ్‌షా(చైనా): ఆసియా పసిఫిక్ ఓషియానా టెన్నిస్‌లో భాగంగా బిల్లీ జీన్ కింగ్‌కప్-2024లో భారత క్రీడాకారిణుల హవా కొనసాగుతోంది. తొలి లీగ్‌లో తైవాన్‌లపై నెగ్గిన భారత మహిళలబృందం..

తాజాగా కొరియాపైనా ఘన విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మూడో లీగ్ పోటీలో భారత్ 2-1తేడాతో కొరియాను చిత్తుచేసింది. రుతుజ భోసాలే, అంకితా రైనా, ప్రార్థనా థోంబరేలతో కూడిన భారత బృందం ప్రపంచ గ్రూప్ ప్లే-ఆఫ్‌లో చోటుకోసం ఈ టోర్నీ బరిలోకి దిగింది. తొలి సింగిల్స్‌లో రుతుజ 6-2, 6-2తో సోహ్యూన్‌ను చిత్తుచేయగా..

రెండో సింగిల్స్‌లో అంకిత రైనా 2-6, 3-6తో సుజోంగ్ జాంగ్ చేతిలో ఓటమిపాలైంది. ఇక నిర్ణయాత్మక డబుల్స్‌లో అంకిత-ప్రార్థన 6-4, 6-4తో కిమ్-సోయున్‌లను చిత్తుచేయడంతో భారత్‌కు విజయం వరించింది. శనివారం జరిగే చివరి లీగ్‌లో భారత్ న్యూజిలాండ్‌తో తలపడనుంది. మరోవైపు న్యూజిలాండ్ రెండు విజయాలతో అగ్రస్థానంలోనే కొనసాగుతోంది.



సెమీస్‌కు సిన్నర్, సిట్సిపాస్

మోంటేకార్లో మాస్టర్స్ టోర్నీ

మొనాకో: మోంటేకార్లో మాస్టర్స్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి 2వ సీడ్ జెన్నిక్ సిన్నర్, 12వ సీడ్ సిట్సిపాస్ ప్రవేశించారు. శుక్రవారం జరిగిన తొలి క్వార్టర్‌ఫైనల్లో స్టెఫోనిస్ సిట్సిపాస్(గ్రీక్) 6-4, 6-2తో వరుససెట్లలో 15వ సీడ్ ఖచనోవ్(రష్యా)ను ఓడించాడు. మరో క్వార్టర్స్‌లో 2వ సీడ్ జెన్నిక్ సిన్నర్(పోలండ్) 6-4, 6-7(6-8), 6-3తో 7వ సీడ్ రూనే(డెన్మార్క్)ను ఓడించాడు. శనివారం జరిగే సెమీస్‌లో సిన్నర్‌తో సిట్సిపాస్ తలపడనున్నాడు. ఇతర క్వార్టర్స్ పోటీలో 12వ సీడ్ హోబర్ట్ హుర్కరాజ్‌తో 8వ సీడ్ సి. రూడ్, టాప్‌సీడ్ నొవాక్ జకోవిచ్‌తో 11వ సీడ్ డి-మినార్ తలపడనున్నారు.

నవచిత్రం



కార్తికేయ

భజే వాయు వేగం

యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్ పై హీరో కార్తికేయ గుమ్మకొండ నటిస్తున్న 'భజే వాయు వేగం' సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్, మోషన్ పోస్టర్‌ను హీరో మహేష్ బాబు సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ ఇంట్రెస్టింగ్‌గా ఉన్నాయని తెలిపిన ఆయన చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఐశ్వర్య మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, హ్యాపీ డేస్ ఫేమ్ రాహుల్ టైసన్ ఓ ముఖ్య పాత్రను పోషిస్తున్నారు. ప్రశాంత్ రెడ్డి దర్శకుడు. అజయ్ కుమార్ రాజు.పి. కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌లో క్రికెట్ బ్యాట్‌తో హీరో కార్తికేయ పరుగులు పెడుతుండటం, మరోవైపు పెద్ద మొత్తంలో డబ్బు ఎగరడం కనిపిస్తోంది. ఈ పోస్టర్ సినిమా మీద ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తోంది. ఫ్రెష్ కంటెంట్‌తో ప్రేక్షకులను ఎంగేజ్ చేసేలా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ సినిమా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమవుతోంది. త్వరలోనే థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నారు. తనికెళ్ల భరణి, రవిశంకర్, శరత్ లోహితస్వ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మాటలు: మధు శ్రీనివాస్, ఆర్ట్: గాంధీ నడికుడికర్, ఎడిటర్: సత్య జి, సినిమాటోగ్రఫీ: ఆర్.డి రాజశేఖర్, మ్యూజిక్ (పాటలు) - రధన్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ - కపిల్ కుమార్.



విశ్వక్‌సేన్

ఓటీటీలోనూ విజయం ఖాయం

విశ్వక్ సేన్, చాందినీ చౌదని హీరో, హీరోయిన్లుగా విద్యాధర్ కాగిత దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'గామి'. కార్తిక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రం మార్చి 8న విడుదలై విశేష ప్రేక్షకాదరణ పొందింది. ఈ చిత్రం ఈనెల 12 నుంచి జీ5 ఓటీటీ సంస్థలో స్ట్రీమింగ్ అవుతుంది. ఈ నేపథ్యంలో స్నో కింగ్‌డమ్‌లో చిత్ర బృందం మీడియాతో ముచ్చటించింది.హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ,'ఇంత తక్కువ ఉష్ణోగ్రతలో ఇలా స్నో కింగ్‌డమ్‌లో నిర్వహించాలనే ఐడియా అంతా కూడా జీ5 టీమ్‌దే. 'గామి'లాంటి సినిమాలకు మామూలుగా అవార్డులు, ప్రశంసలు వస్తుంటాయి. కలెక్షన్లు రావని అంతా అనుకుంటారు. కానీ ఇది నా కెరీర్‌లో బిగ్గెస్ట్ ఓపెనింగ్స్, కలెక్షన్లను సాధించింది. ఇందులో కమర్షియల్ అంశాలేవీ ఉండవు. అయినా ఆడియెన్స్ చాలా బాగా ఆదరించారు. ఈ సినిమాని థియేటర్లో అందరూ చూశారు. మాకు మంచి రివ్యూలు ఇచ్చారు. జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్న మా చిత్రాన్ని చూసి మరింతగా ఆదరించండి' అని అన్నారు.

'థియేటర్లో మా సినిమా కొంత మందికి అర్థం కాలేదు. ఇప్పుడు ఓటీటీలోకి వస్తోంది. మూడు నాలుగు సార్లు చూస్తే మా థీమ్ ఏంటి? మా కాన్సెప్ట్ ఏంటి? అన్నది అందరికీ ఈజీగా అర్థం అవుతుంది' అని డైరెక్టర్ విద్యాధర్ చెప్పారు. లాయిడ్ జేవియర్ (జీ 5 సౌత్, వైస్ ప్రెసిడెంట్ - మార్కెటింగ్) మాట్లాడుతూ, 'గామిలాంటి మంచి చిత్రాన్ని తీసిన విద్యాధర్, విశ్వక్ సేన్‌లకు థ్యాంక్స్. ఈ 12 నుంచి తెలుగు, తమిళ్, కన్నడలో జీ5లో స్ట్రీమింగ్ అవుతోంది. 2024లో వచ్చిన బెస్ట్ మూవీస్‌లో ఇదొకటి' అని అన్నారు.

నయా క్రైమ్ కామెడీ థ్రిల్లర్



రాజ్‌తరుణ్, రాశి సింగ్

రాజ్ తరుణ్ హీరోగా, గోవిందరాజు సమర్పణలో కనెక్ట్ మూవీస్ ఎల్.ఎల్.పి ప్రొడక్షన్ నెం.1 సినిమా ప్రారంభ పూజ శుక్రవారం రామానాయుడు స్టూడియోస్‌లో ఘనంగా జరిగింది. నూతన దర్శకుడు రమేష్ కడుములని పరిచయం చేస్తూ ఈ సినిమాని మురళీధర్ రెడ్డి, కేఐటిఎస్ శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. రాశి సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

ఈ సినిమాకు డైరెక్టర్ మారుతి క్లాప్ చేయగా, ప్రవీణ్ సత్తార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. నక్కిన త్రినాధరావు ఫస్ట్ షాట్‌కి డైరెక్ట్ చేయగా, ధీరజ్ మొగిలినేని, వంశీ స్క్రిప్ట్ అందజేశారు.

దర్శకుడు రమేష్ కడుముల మాట్లాడుతూ,'ఈ సినిమా షూటింగ్ ఈనెల 15న ప్రారంభమై కంటిన్యూ షూటింగ్ ఉంటుంది. అక్టోబర్‌లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. ఇది క్రైమ్ కామెడీ. 'స్వామిరారా, అంధధూన్ ' తరహాలో అందరికీ నచ్చుతుంది' అని తెలిపారు.

'కథ చాలా చాలా అద్భుతంగా వచ్చింది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని ప్రొడ్యూసర్ కేఐటిఎస్ శ్రీనివాస్ చెప్పారు. హీరో రాజ్ తరుణ్ మాట్లాడుతూ,'ఇది చాలా మంచి కథ. క్రైమ్ కామెడీ జోనర్. నా ఫేవరట్ జోనర్. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించడానికి సాలిడ్ కంటెంట్‌తో రాబోతున్నాం' అని అన్నారు.

హీరోయిన్ రాశీ సింగ్ మాట్లాడుతూ,'ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు. కథ విన్నప్పుడు నా పాత్ర చాలా నచ్చింది. రాజ్ తరుణ్‌తో కలసి నటించడం ఆనందంగా ఉంది' అని చెప్పారు.

హనుమాన్ తరహాలోనే శబరిని సైతం..



వరుణ్ సందేశ్, శశాంక్, వరలక్ష్మీ శరత్‌కుమార్, మహేంద్రనాథ్

వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన సినిమా 'శబరి'. మహర్షి కూండ్ల సమర్పణలో మహా మూవీస్ పతాకంపై మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించారు. అనిల్ కాట్జ్ దర్శకుడు. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో మే 3న సినిమా విడుదల అవుతోంది. శుక్రవారం ఐదు భాషల్లో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి వరుణ్ సందేశ్ ముఖ్య అతిథిగా హాజరై తెలుగు ట్రైలర్‌ని రిలీజ్ చేయగా, తమిళ ట్రైలర్‌ను నిర్మాత మహేంద్రనాథ్ విడుదల చేశారు.

వరలక్ష్మీ శరత్ కుమార్ మాట్లాడుతూ, 'తెలుగులో ఫస్ట్ టైమ్ ఫిమేల్ ఓరియెంటెడ్ సినిమా చేశా. తన క్యారెక్టర్ చుట్టూ నడిచే సినిమా చేయడం ఏ నటి అయినా సరే ఎగ్జైట్ అవుతుంది. నాకు ట్రైలర్ నచ్చింది. వండర్ ఫుల్ స్క్రిప్ట్‌ని నా దగ్గరకు తీసుకు వచ్చిన దర్శకుడు అనిల్‌కి థ్యాంక్స్. తన బిడ్డను కాపాడుకోవడం కోసం తల్లి ఏం చేసిందనేది కథ. 'హనుమాన్' సినిమాను అంత పెద్ద హిట్ చేసింది తెలుగు ప్రేక్షకులే. ఈ 'శబరి'ని కచ్చితంగా ప్రమోట్ చేస్తారని నమ్మకం ఉంది. ఇది స్ట్రెయిట్ ఫార్వార్డ్ థ్రిల్లర్. ఎడ్జ్ ఆఫ్ ది సీట్ థ్రిల్ ఇస్తుంది. ఈ సినిమా నిర్మాత మహేంద్రనాథ్ కోసం పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. 'ముఖ్య అతిథిగా వచ్చిన వరుణ్ సందేశ్‌తో నా రెండో సినిమా చేస్తున్నా. ఆ తర్వాత మూడో సినిమా అమర్ దీప్ హీరోగా చేస్తున్నాను. ఈ సినిమా తర్వాత వరలక్ష్మీ శరత్ కుమార్ పెర్ఫార్మన్స్ గురించి అందరూ చెబుతారు. నిర్మాతగా నా తొలి సినిమా ఇది' అని తెలిపారు.

నవ్వించే కిడ్నాప్‌ల పర్వం..

చైతన్య రావు, సునీల్, శ్రద్ధాదాస్, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రలలో వనమాలి క్రియేషన్స్ బ్యానర్ పై సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మిస్తున్న హిలేరియస్ క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'పారిజాత పర్వం'. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను యాంకర్ సుమ కనకాల లాంచ్ చేశారు.

కిడ్నాప్ ప్లాన్‌ని సునీల్ తన గ్యాంగ్‌తో చెబుతుండగా మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. 'కిడ్నాప్ ఈజ్ ఎన్ ఆర్ట్'అనే ట్యాగ్ లైన్‌ని జస్టిఫై చేస్తూ ఇందులో చూపించిన సన్నివేశాలు హిలేరియస్‌గా ఉన్నాయి. చైతన్య రావు, సునీల్, శ్రద్ధా దాస్.. ఇలా సినిమాలోని ప్రధాన పాత్రల చుట్టూ నడిపిన కిడ్నాప్ సీక్వెన్స్‌లు హైలెట్‌గా ఉంటూ కథపై చాలా క్యురియాసిటీని పెంచాయి. ట్రైలర్ చివర్లో వైవా హర్ష చెప్పిన సినిమా రివ్యూ హిలేరియస్‌గా ఉంది. ఈనెల 19న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. శ్రీకాంత్ అయ్యంగార్, సురేఖ వాణి, సమీర్, గుండు సుదర్శన్ , జబర్దస్త్ అప్పారావు, టార్జాన్, తోటపల్లి, మధు, జబర్దస్త్ రోహిణి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాత -అనంత సాయి, డీవోపీ-బాల సరస్వతి, సంగీతం-రీ, ఎడిటర్- సశాంక్ వుప్పుటూరి, ఆర్ట్ డైరెక్టర్ - ఉపేందర్ రెడ్డి.



శ్రద్ధా దాస్

వినోదం + సందేశం

ఎంటర్టైన్మెంట్‌తోపాటు మంచి మెసేజ్ ఉన్న సినిమా 'కల్లు కాంపౌండ్ 1995'. గణేష్, ఆయూషి పటేల్ జంటగా బ్లూ హారీజోన్ మూవీ ఫ్యాక్టరీ బ్యానర్ పై ప్రవీణ్ జెట్టి దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. పోసాని కృష్ణమురళి, జీవా, ప్రవీణ్, బాలచందర్, గౌతమ్ రాజు, చిట్టి బాబు కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని బుర్రా మల్లేష్ గౌడ్ (బొట్టు), హారిక జెట్టి, పిట్ల విజయలక్ష్మీ సంయుక్తంగా నిర్మించారు. పోస్ట్ ప్రొడక్షన్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది.



గణేష్, ఆయూషి పటేల్

ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన తమ్మారెడ్డి భరద్వాజ ట్రైలర్‌ను లాంచ్ చేశారు.

హీరో గణేష్ మాట్లాడుతూ,'కన్నడలో చాలా సినిమాలలో నటించాను. కథకు సరిగ్గా సరిపోతానని నమ్మి ఎటువంటి ఆడిషన్ లేకుండా నాతో సినిమా చేశారు దర్శక, నిర్మాతలు. సినిమా చాలా బాగా వచ్చింది' అని తెలిపారు.

'స్టోరీ డిఫరెంట్‌గా ఉంటూ ఓ కొత్త సినిమా చూసిన ఫీలింగ్ ప్రేక్షకులకు కచ్చితంగా కలుగుతుంది అలాగే మంచి మెసేజ్ కూడా చెప్పాం. మా సినిమా ట్రైలర్, సాంగ్స్ చూసి సీనియర్ టెక్నీషియన్స్ మెచ్చుకుంటున్నారు. అందరి సపోర్ట్‌తో మంచి అవుట్ పుట్ వచ్చింది' అని దర్శకుడు ప్రవీణ్ జెట్టి చెప్పారు.

తొలి తెలంగాణ మూకీ చిత్రం

గజగౌని ప్రొడక్షన్ పతాకంపై కవిత రాజ్ పుత్, జమున, అంజలి, మధు, హీరో, హీరోయిన్లుగా మధులింగాల దర్శకత్వంలో గజగౌని దయానంద్ గౌడ్ నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్, 'కావ్య రాజ్'.

ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథి విచ్చేసిన ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాత దయానంద్ మాట్లాడుతూ, 'ఈ సినిమా మామూలు సినిమా కాదు.



తెలంగాణ మొట్టమొదటి మూకీ చిత్రం. మాకు ఆదర్శనీయుడైన లెజెండరీ నటుడు పైడి జయరాజుకి ఈ సినిమాని అంకితం ఇస్తున్నాం. ఇది అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించే సినిమా అవుతుంది' అని తెలిపారు. 'పైడి జైరాజ్‌ని ఆదర్శంగా తీసుకుని దయానంద్ ఈ సినిమా చేయడం ఆనందంగా ఉంది. చాలా కాలం తర్వాత మంచి మూకీ సినిమా రాబోతుంది. ఈ మంచి ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని ప్రసన్న కుమార్ చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2014/59462.